దేశంలో అత్యధికంగా చదవబడుతున్న ఏకైక తెలుగు మాసపత్రిక

03 - 1981

జ్యోతి

మార్చి 81

రూ 3·50



వ్యవస్థాపకులు

కీ॥ శే॥ వి. వి. రాఘవయ్యగారికి


స్మృత్యంజలి



1928-1971

మీ కార్యదీక్ష, క్రమశిక్షణా, సహృదయతా మాకు ఆశీస్సులై నిలుస్తుండగా, మీరు స్థాపించిన యీ సాహిత్య జ్యోతిని వెలిగిస్తూ ముందుకు సాగుతున్నాము. మీరు మాకు దూరమైన క్షణాన్ని కసి[illegible]గా తిట్టుకొంటూ, మీ జ్ఞాపకాల్ని మననం చేసుకొంటూ మీకు మా స్మృత్యంజలి ఘటిస్తున్నాము.

— జ్యోతి కుటుంబం



సంస్థాపకులు
కీ॥శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి లీలావతి
రాఘవయ్య

మార్చి 1981

సంపుటి 19 | సంచిక 2

విషయసూచిక


ఈ నెల నవలానుబంధం

డాక్టర్ చైతన్య

రచన : అల్లూరి రాజకుమారి

ముఖచిత్రం : జయసుధ, చివరి అట్టమీద : రాజ్యలక్ష్మి

జ్యోతి, 1-8-4/1/1 చిక్కడపల్లి, హైదరాబాదు 500 020
సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో సహా) రు. 50



భూమి గుండ్రంగా వుంది!



తొలిమాట

గత సంచికలో 'భూమి గుండ్రంగా వుంది' ప్రచురించ (లేకపోయి) నందుకు మా పాఠకులు కొందరు కోపగించుకున్నారు. ప్రకటనలు ఎక్కువై సీరియల్ నవల వేయలేకపోయామని ఆరోపించినవారు కూడా లేకపోలేదు. నిజానికి 'భూమి గుండ్రంగా వుంది' మాకు రచయిత్రి నుంచి అందనందువల్లనే ప్రచురించలేకపోయాము. అందకపోవడం వల్లనే ఈ సంచికలో కూడా 'భూమి గుండ్రంగా వుంది' ప్రచురించలేకపోతున్నాము! పాఠకులు మమ్మల్ని మన్నింతురుగాక! !

❊ ❊ ❊ ❊ ❊

ఢిల్లీలో జరిగిన 8వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం విశేషాలు ఈ సంచికలో ప్రచురించాము. ప్రముఖ రచయిత వి. రాజారామమోహనరావు ఢిల్లీ చలన చిత్రోత్సవ విశేషాలతోపాటు రెండు విదేశీ చిత్రాల సమీక్షలు కూడా ఈ సంచిక సినిమా శీర్షికలో రాశారు. వచ్చే సంచికలో ఈ ఉత్సవంలో మరో చిత్రంతో కలిసి బంగారు నెమలిని గెలుచుకున్న 'ఆక్రోష్' చిత్ర సమీక్ష ప్రచురిస్తాము.

❊ ❊ ❊ ❊ ❊

దక్షిణ భారత దేశంలో మొట్టమొదటి స్టూడియో (1936) నిర్మించి, మొట్టమొదటి తెలుగు చిత్రాన్ని నిర్మించిన నిడమర్తి సూరయ్య జనవరి 29న మరణించడంతో తెలుగు చలన చిత్రరంగం ఆది పురుషుణ్ణి కోల్పోయింది. కాంచనమాల మృతితో (జనవరి 24) చలనచిత్ర కథానాయికల తొలి తరం తారల్లో ఒక దేదీప్యమాన తార రాలిపోయింది. ఈ యిరువురి మృతి పట్ల జ్యోతి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తోంది.



ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ



ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య

నవశకానికి నాంది

రాష్ట్ర అవతరణ రజతోత్సవ సంవత్సరంలో వచ్చిన ఈ రిపబ్లిక్ దినోత్సవం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రత్యేక ప్రాధాన్యం కలది. శ్రీ టి. అంజయ్య సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మూడు నెలల స్వల్ప కాలంలోనే అన్ని వర్గాల ప్రజల, ముఖ్యంగా బలహీన వర్గాల ప్రజల, సత్వరాభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుంది.

అమలు జరిగిన కొన్ని సంక్షేమ చర్యలు :

❊ ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం. కీ.శే. సంజయ్‌గాంధీ 5 సూత్రాల కార్యక్రమం అమలు.

❊ రైతుల ఆర్థిక అభ్యున్నతికి వీలుగా రుణాల తిరిగి చెల్లింపు వ్యవధి పెంచారు. సకాలంలో తగినన్ని ఎరువుల సరఫరా, పంటల బీమా వంటి అనేక ప్రోత్సాహకాలు, సబ్సిడీల ద్వారా రైతులకు సర్వవిధాల సహాయం అందజేయడం.

❊ రైతులకు దాదాపు రు. 90 కోట్ల విలువైన రాయితీలు.

❊ మీటరు ఛార్జీల పద్ధతికి బదులుగా అశ్వికశక్తి (హార్స్ పవర్) ప్రాతిపదికపై ఏక మొత్తం రేట్లలో రైతుల విద్యుచ్ఛక్తి ఛార్జీల విధింపు.

❊ చక్రవడ్డీ విధించరాదని సహకార పరపతి సంఘాలకు ఆదేశం.

❊ 65 సంవత్సరాలపైబడిన వయస్సుగల వ్యవసాయ కూలీలు, అనాధలకు పింఛను పథకం.

❊ 5 ఎకరాల మాగాణి, 10 ఎకరాలమెట్ట గల రైతులకు భూమిశిస్తు చెల్లింపు నుంచి మినహాయింపు.

❊ గ్రామాలకు రోడ్లు, గ్రామీణ నీటి సరఫరా, బలహీన వర్గాలకు ఇళ్లు, సామాజిక సేద్యపు నీటి బావుల నిర్మాణం, పనికి ఆహారం పథకాలు మొదలైన సమీకృత గ్రామీణాభివృద్ధి పథకాల అమలు.

❊ కరువు నివారణ సహాయక చర్యల నిమిత్తం రు. 27 కోట్లు కేటాయింపు.

❊ సత్వర అధిక విద్యుదుత్పాదనకు వీలుగా అనంతపురం జిల్లాలో 40 కె.వి.ల కొత్త జల విద్యుచ్ఛక్తి ప్రాజెక్టు, 100 శాతం గ్రామీణ విద్యుదీకరణ పథకంలో మరో మూడు జిల్లాలు చేర్చడం, మెదకు జిల్లాలో అప్పుడే నూరుశాతం గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా కావడం గమనార్హం.

❊ ఎన్.జి.ఓ.ల సంక్షేమానికి రాయితీలు.

❊ అవినీతిని అంతమొందించి, నిష్కళంక పరిపాలన ఏర్పాటుకు చర్యలు.

❊ అన్ని స్థాయిలలో పౌర సంఘాల ఏర్పాటుతో సహా అనేక చర్యల ద్వారా అత్యవసర సరుకుల పౌర పంపిణీ పద్ధతిని క్రమబద్ధం చేయడం.

❊ రాష్ట్ర సమైక్యతా మండలి ఏర్పాటు. ఇటువంటి మండలిని ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్.

❊ స్కాలర్‌షిప్పుల మంజూరీ, హాస్టళ్ళలో ప్రవేశ అర్హతల నిమిత్తం షెడ్యూలు కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల విద్యార్థుల ఆదాయ పరిమితి రు. 6,000/- నుంచి రు. 12000/-లకు పెంపుదల.

❊ వచ్చే ఐదు సంవత్సరాలలో గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి వీలుగా రు. 250 కోట్ల ప్రణాళిక అమలు.

ఈ రిపబ్లిక్ దినోత్సవం నాడు మనమంతా బడుగువర్గాల అభ్యున్నతికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పునరంకితమవుదాం.

సమాచార, పౌరసంబంధ శాఖ : ఆంధ్రప్రదేశ్

ఉత్తరాలు

హెచ్చరిక!

ప్రముఖ సామాజిక వ్యాఖ్యాత సి. ధర్మారావుగారి "తెలుగు వారి ఒక తేజఃపుంజం" (జ్యోతి డిసెంబరు '80) చదివి ఇది వ్రాస్తున్నాను.

నిజమే! పొట్టి శ్రీరాములు చనిపోయేంత వరకూ ఆయన నిస్వార్థ ఆంధ్రభక్తిని మన గుర్తించలేదు. ముందే మనలో ఆ ఉత్తేజం ఉజ్జ్వలించి ఉంటే ఆయన ప్రాణం బలి అయి ఉండేది కాదేమో! 1915 నుండి ప్రత్యేకాంధ్ర నిర్మాణావసరానికి చర్చలు జరిగాయి, వ్యతిరేకాలు కలిగాయి. కాని మనం కార్యదీక్ష పూనలేదు. ఇతర ప్రాంతాలు ఈ విషయంతో ఆశయాల్ని, అవసరాల్ని తీర్చుకున్నాయి. ఇప్పటికీ మనం చల్లబడి, చైతన్య రహితంగానే బ్రతుకుతున్నాం. ఇప్పుడు రాయలసీమకు రత్నహారంవంటి "బళ్ళారి" మనది కాదు. తెలుగుదేశానికి శిరోహారం వంటి "బరంపురం" పొరుగువారిదైంది. రేపో మాపో మన మిలాగే నిద్రపోతూంటే "తిరుపతి" కాస్తా తమిళులదై పోయే ప్రమాదం వుంది

మనమంతా ఆ మహామనీషి పొట్టి శ్రీరాములు గారి జాతివాళ్ళమని చెప్పుకోగలగాలి అన్ని భాషల ప్రజలకన్నా సంఖ్యలో అధికులం (హిందీ, లిపి, నిజమైన ప్రాంతీయతా లేని భాష కాబట్టి) అనే ఉన్నత భావం మనలో వుండాలి.

దగ్గుపాటి పార్థసారథి నాయుడు
మనోరి-అలహాబాదు

మంచి ఎన్నిక !

ఇద్దరు తారల ముఖ సౌందర్యాలను ప్రదర్శించిన "జ్యోతి" ఫిబ్రవరి సంచిక ఎంతో నిండుగా ఉంది. ఆ నిండుతనం ముఖచిత్రం వరకే కాకుండా, లోపల ఉన్న రచనలు ఎంతో వైవిధ్యం కలిగివున్నాయి కథల పోటీలో మీ ఎన్నిక ప్రశంసనీయం. "మురికి", "మరో మొరావియా" కథలు చాలా బాగున్నాయి. రచయితలు అభినందనీయులు.

ఎ. ఛాయానాధ్
హైదరాబాద్


1980 జ్యోతి కథల పోటీలో తృతీయ బహుమతి నందుకున్న శశికళగారి "గోడమీది రాతలు" కథ చదివిన తరువాత ఈ ఉత్తరము వ్రాయకుండా ఉండలేకపోతున్నాను ఈ కథ గోడమీది రాతలను ప్రోత్సహించేదిగా ఉంది. గోడమీద రాతలు రాయటం, మరకలు పూయటము చాలా చెడ్డ అలవాటు. అసలా ఇంటి మనుష్యులమీద సదభిప్రాయము కలుగదు.

స్వంత ఇల్లు అయితే రాసారా. అద్దె ఇంట్లో ఉంటూ మన ఇల్లు కాదులే అనే మనస్తత్వమే ఇలాంటి గీతల్ని, రాతల్ని రాయిస్తుంది.

కథలో చెప్పదలచుకున్న విషయము నచ్చలేదుకాని కథ నడిపినతీరు, శైలి బాగున్నాయి. కథ వ్రాయటములో నేర్పు ఉంది. ఆమెనుంచి మంచి కథలు ఆశిస్తున్నాము.

జి. యస్. రాజరాజేశ్వరి
కర్నూలు.

శ్రీ ఆరెకపూడి రామశాస్త్రి



జననం : 14-2-1936 నిర్యాణం : 27-2-1979

మీ సంస్మరణే సౌభాగ్యంగా మిగుల్చుకున్న దురదృష్టవంతురాలు
— మీ కౌసల్య

నిత్యం డాడీ కబుర్లతోనే సంతృప్తి పొందుతున్న — మీ చిరంజీవులు
— కళ్యాణి, శ్రీకాంత్, సతీశ్‌కాంత్

కర్మభూమి

తెలుగు సినిమా పరిశ్రమకు అనుబంధ పరిశ్రమల్లాగ విడిభాగాలు సంఘగా చేసే కార్ఖానాలు అనే - పోహ వుండేది పత్రికలమీద. పేరుపొందిన నటీనటుల్ని దృష్టిలో వుంచుకొని, తమ కథ కేవలం సినిమాకి ముడిసరుకనే ధోరణితో వైవిధ్యంలేని, నిస్సారమైన రచనలు చేస్తున్న యీ కాలంలో ఆలోచింపజేసే రచన "కర్మభూమి". ఎందరో రాక్షసుల పాలబడి, పీక్కుతినబడి, శల్యావశిష్టంగా ఉన్న ఈ కర్మభూమిలోని అవినీతిని అందరిలా వ్యంగ్యోక్తుల్తో తూలనాడకుండా వారికి తోచిన విధానంలో చక్కటి పరిష్కారమార్గం చూపించారు కాంతారావుగారు. స్వప్రయోజనానికి ఎన్నోసార్లు రాజ్యాంగాన్ని అపసవ్యంగా మార్చివేస్తున్న నేతలూ! ఆ మనిక రాజ్యాంగం "కర్మభూమి" గురించి ఆలోచించండి.

పంతం ఉమామహేశ్వరరావ్
గెద్దనాపల్లి.

"జ్యోతి" ఫిబ్రవరి 81 సంచిక చాలా బాగుంది. ఈ సంచికలో ప్రచురించిన బహుమతి కథలు మూడూ బాగున్నాయి. "ప్రేమ సింహాసనం" ముగింపు చాలా నచ్చింది. డా॥ ఉయ్యూ నాగరాజ్‌గారి "మనసు సంగతి" శీర్షిక విజ్ఞానదాయకంగా వుంటున్నది. ఫిబ్రవరి నెల నవల "కర్మభూమి" బాగుండలేదు.

పి. వి. వరలక్ష్మి
భీమవరం.

ఆద్యంతాలు లేని కథ

జ్యోతి కథల పోటీలో మొదటి బహుమతి పొందిన సదానంద్‌శారదగారి రచన "ముగింపు" కథావస్తువు అతి ప్రాచీనమైనది. కనీసం రచనా విధానంలోకూడా క్రొత్తదనం లేదు. ఇటువంటి కథలు ఇదివరలో చాలా పత్రికల్లో కోకొల్లలుగా వచ్చాయి. రెండవ బహుమతి పొందిన "మరో మొనావియా" కథ ఓ మాదిరిగా ఉంది. మూడవ బహుమతి పొందిన "గోడమీద రాతలు" కథను రచించిన శశికళ గారికి నా అభినందనలు. జీవితంలో జరిగే అనుభూతుల్ని, అనుభవాల్ని వాస్తవానికి అతి దగ్గరగా ఉండేలా చెబితే చాలు, కథ వ్రాయాలంటే ఒక ఆరంభం మరొక ముగింపు అక్కర్లేదని నిరూపించారు.

ఇనుగంటి బుచ్చివెంకటరావు
పెద్దాపురం.

రుద్రాభట్ల!

విషాదవార్తలన్నీ నిజంగా విషాదాన్ని కలిగించ లేవు.

శ్రీ రుద్రాభట్ల నరసింగరావుగారి మరణవార్త రచయిత అన్న ప్రతివారికీ విషాదవార్త ఎలా వుంటుందో తెలియజేసింది.

మనిషి స్థిరత్వంమీద ఎంత గుడ్డినమ్మకమో మరణం అంటే అంత అపనమ్మకం-అందరికీ!

కాని-మరణం అనేది మనిషికి సంభవించటం ఎల్లప్పుడూ ఆకస్మికం కాకున్నా, అనివార్యం అని నిరూపించింది ఈ తెలుగు కథకుడి మరణవార్త!

'అరె! రుద్రాభట్ల నరసింగరావు పోయేడా!' అని మాటలయితే వచ్చేయికాని, వాటివెనక హృదంతరాళాల్లో కలిగిన బాధ వర్ణించటానికి భాష చాలదు.

ఆయన హేమాహేమీలు అనిపించుకున్న కథకులందరిచేత మంచి కథకుడనిపించుకున్నాడు.

అతను 'మెరిట్' మాత్రమే చూపి 'జీనియస్'ని దాచుకుని వెళ్ళిపోయేడా అనిపిస్తుంది!

ఇకముందు రాబోతున్న కథల్లో కొన్ని మంచికథలు మనకు దక్కకుండా పోయాయి శ్రీ రుద్రాభట్ల మరణంతో!


అయినా—

ఇప్పటికి ఉన్న అతని కథల్ని, లేకుండా పోయిన అతన్ని ఎన్నాళ్ళయినా మర్చిపోలేం!



ఇటీవల వంశీబర్కిలీ అవార్డు ఉత్సవంలో ప్రముఖ దర్శకుడు శ్రీ పుల్లయ్యను సత్కరిస్తున్న రాష్ట్ర గవర్నర్ శ్రీ కె.సి. అబ్రహాం, కుడిప్రక్కనున్నవారు శాంతకుమారి. వెనుకనున్నవారు వైజయంతిమాల.

ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'కళాసాగర్' యిటీవల మద్రాసులో యేర్పాటు చేసిన "తెలుగు నాటక శతజయంతి" ఉత్సవాల్లో నటుడు-రంగస్థల చరిత్రకారుడూ శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిని కళాసాగర్ తరపున సత్కరిస్తున్న ప్రముఖ తమిళ రంగస్థల నటుడు శ్రీ ఎస్. వి. సహస్రనామమ్.



తన జీవం వదులుకుని తెలుగురథకి జీవం పోసి వెళ్ళిపోయేడు మన చంద్రాభట్ల నరసింగరావు.

వారి మృతికి నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. వారి సోదరులకు సానుభూతి!

ఎ. చంద్రశేఖరరావు
హైదరాబాదు.

సాంస్కృతిక విశేషాలు

కళాకారులకు లక్ష్మణరావు దంపతుల సత్కారం!

తెలుగు నాటకరంగం శతజయంతి సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీ యీడ్పుగంటి లక్ష్మణరావు దంపతులు, దుర్గాపురంలోని వారి స్వగృహంలో జనవరి 11, 193 ఆదివారం నాడు ప్రముఖ రంగస్థల నటీనటులలో ఆనాటి వారినీ, యీనాటివారిని కొందరిని సత్కరించారు.

మురళీమోహన్, నిక్కిలి సోని, టి కనకం, బెజవాడ రాజరత్నం, అబ్బూరి కమల, సీతాలత, వల్లభనేని సుబ్రహ్మణ్యం, నందివాడ వెంకటాచలశర్మ, జొన్నలగడ్డ సత్యనారాయణ, తుమ్మల వెంకట్రామయ్య, కాట్రగడ్డ రాజగోపాలరావులను నూతన వస్త్రాలతో సత్కరించి కళపట్ల, కళాకారుల పట్ల తమకు గల గౌరవాభిమానాలను వ్యక్తం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మణరావు మాట్లాడుతూ వారి తండ్రి శ్రీ యీడ్పుగంటి శీతయ్యగారు వారి పినతండ్రిగారి అబ్బాయి శ్రీ శేషయ్యగారు కూడా నాటక రంగానికి కృషి చేసిన వారనీ, వారి గౌరవార్థమే ఈ అభినందన సభ ఏర్పాటు చేయబడిందనీ చెప్పారు. ప్రముఖులు శ్రీ బమన భీమయ్య, శ్రీ కోగంటి గోపాలకృష్ణయ్య, శ్రీ గుళ్ళపల్లి మాధవరావు, శ్రీ పొలదుగు వెంకటేశ్వరరావు, శ్రీ సి. రాఘవాచారి (విశాలాంధ్ర ఎడిటర్), శ్రీ పెరమకూరి కేశవరావు (హనుమంతరాయ గ్రంథాలయ కార్యదర్శి), శ్రీ పుల్లయ్య (విశాలాంధ్ర) శ్రీ పి. వెంకట్రావు (ఆంధ్రపత్రిక), శ్రీ యెర్నేని అంకినీడు (ప్రముఖ కాంట్రాక్టరు), శ్రీ సుబ్బరాజు (స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు), కొడాలి ఆదిశేషయ్య యింకా పలువురు సాహితీ ప్రియులు, పురప్రముఖులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


ఈ సందర్భంగా ప్రముఖ కళాకారులు ఆనాడు మృదుమధురంగా ఆలాపించిన పద్యాలు, పాటలు కొన్ని వినిపించారు.

"శ్రీ పాదుకలు" కృతిస్వీకరణ

ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళాభారతి అధ్వర్యంలో మద్రాసు, శంకరదాస్ ఆడిటోరియంలో ప్రఖ్యాతకవి, కళాప్రపూర్ణ శ్రీ కొండపీటి వెంకటకవి రచించిన "శ్రీ పాదుకలు" నాటక కృతి శ్రీమతి అల్లూరి వేంకట సుబ్బమ్మ గార్కి కృతినివ్వటం జరిగింది. అత్యంత వైభవోపేతంగా జరిగిన యీ సభకు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, కళాప్రపూర్ణ శ్రీ ఎన్. టి. రామారావుగారు అధ్యక్షత వహించారు. కళాభారతి అధినేత శ్రీ ఎ. ఎన్. రామమోహనరావుగారు స్వాగతం పలికారు. వేదోక్త ఆశీర్వచనం, మంగళ వాద్యాల శుభ సంరంభం మధ్య శ్రీ కొండపీటి వెంకట కవిగారు కృతిని శ్రీమతి అల్లూరి వెంకటసుబ్బమ్మ గారికి నూతన వస్త్రాలతో పాటు సమర్పించారు. ఆమె ఆ కృతిని కళావాచస్పతి శ్రీ కె. జగ్గయ్యగారికి యివ్వగా ఆయన ఆవిష్కరించారు. తెలుగు నాటక రంగ శత జయంత్యుత్సవాల సందర్భంగా ఏర్పాటయిన యీ కార్యక్రమం అత్యంత మనోహరంగా వున్నదని శ్రీ జగ్గయ్య కీర్తించారు.


అనంతరం కళాభారతి తరపున శ్రీ జగ్గయ్యగారు శ్రీ కొండపీటి వెంకటకవి దంపతులను నూతన వస్త్రాలతోనూ, శ్రీ రామమోహనరావుగారు దుశ్శాలువలతోనూ, శ్రీ ఎన్. టి. రామారావుగారు సన్మాన పత్రంతోనూ సత్కరించారు.


తనకు జరిగిన సన్మానానికి శ్రీ వెంకటకవిగారు కృతజ్ఞత తెలిపారు. శ్రీమతి వెంకటసుబ్బమ్మగారి తరపున శ్రీ పుండరీకాక్షయ్య (భాస్కర చిత్ర నిర్మాత) కృతజ్ఞతలు తెలిపారు.



ఈడ్పుగంటి లక్ష్మణరావు దంపతులు యిటీవల విజయవాడలో కొందరు కళాకారులను సత్కరించినప్పటి దృశ్యం.

'శ్రీ పాదుకలు' కృతి స్వీకరణోత్సవ చిత్రం.





శ్రీ కృష్ణగారు, శ్రీ నందమూరి జయకృష్ణ

కల్పనా రికార్డింగ్ స్టూడియో ప్రారంభోత్సవం!

హైదరాబాదులోని ప్రముఖ రేడియో అడ్వర్టయిజింగ్ సంస్థ, ప్రభాకర అడ్వర్టయిజర్స్‌వారు నూతనంగా నిర్మించిన కల్పనా రికార్డింగు స్టూడియోను శ్రీ నందమూరి జయకృష్ణ జనవరి 15 న లాంఛన ప్రాయంగా ప్రారంభించారు. ఆంధ్రా బ్యాంక్ వారి వ్యాపార ప్రకటన నొకదానిని ఇనాగురల్ రికార్డింగ్‌గా ధ్వని ముద్రితం చేశారు. ఆంధ్రా బ్యాంక్ ప్రధాన పౌర సంబంధ అధికారి శ్రీ కె. వి. భాస్కర రావు ప్రభాకర అడ్వర్టయిజర్స్ వారి గుణగుణాలను ప్రశంసిస్తూ సంస్థ పురోభి వృద్ధిని ఆకాంక్షించారు. పలుపురు చలనచిత్ర రంగ, వాణిజ్య రంగ ప్రముఖులూ, మిత్రులూ, శ్రేయోభిలాషులూ, పలువురు పాత్రికేయులూ ఈ ప్రారంభోత్సవ సంరంభంలో సముత్సాహంతో పాలుపంచుకున్నారు. ప్రభాకర ఎడ్వర్టయిజర్స్ వారి తొలి రేడియో స్పాట్ రూపొందించిన రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావుగారికి, వాయిస్ ఆర్టిస్ట్‌గా ఇతోధికంగా తోడ్పడిన కీ॥ శే॥ లక్ష్మీపతి కుటుంబానికి రు. 500 శ్రీ జయకృష్ణ చేతిమీదుగా ప్రభాకరరావారు అందించారు.

వాసిరెడ్డి సీతాదేవిగారి వెలుగు వెల్లువ

సంధియుగంలో స్త్రీ

నీకంటే అధికుణ్ణని నేనెన్నడూ అనుకోలేదు. నీ కంటే తెలివి తేటలు గల వాణ్ణని కూడా భావించలేదు. మనిద్దరమూ సమానులమనే విశ్వసిస్తున్నాను నేను - ఈ మాటలు ప్రపంచ ప్రఖ్యాత మేధావి, జీన్‌పాల్ సార్త్రే ఆయన సతీమణి సిమన్‌డి లివొయిర్‌తో ఒక ఇంటర్వ్యూ సందర్భంగా అన్నవి. ఒక మగవాడు తన భార్యతో యీ మాటలన డానికి అతనికి స్త్రీ సమస్యల పట్ల, సమాన హక్కుల కోసం స్త్రీలు సాగిస్తున్న పోరాటం పట్ల యెటువంటి అవగాహన అవసరమవుతుందో చెప్ప నక్కర్లేదు.

చలం పుట్టి దాదాపు ఒక శతాబ్దం నిండుతున్న దశలో కూడా తెలుగు నాట తెలుగు దేశంలో) బొత్తిగా తెలియదు. నిరక్షరాస్యత, తరతరాల "పరదా చాటు" వారిని ప్రపంచపు వెలుగును చూడనివ్వడం లేదు.

అక్షరాస్యులైన ఆడవాళ్ళలో మాత్రం తమ వ్యక్తిత్వానికీ, తమస్వేచ్ఛకీ సంబంధించిన స్పృహ ఎందరికుంది? సీతాదేవిగారి ఈ పుస్తకం స్త్రీలు ఎదుర్కొంటున్న ఇటువంటి కొన్ని ప్రధాన సమస్యలమీద వెలుగు ప్రసరిస్తోంది.

నిరక్షరాస్యులైన గిరిజన మహిళలస్థితి నుంచి,చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న నాగరిక స్త్రీల స్థితిగతులవరకు అనేక సమస్యలను సీతాదేవిగారు ఈ పుస్తకంలో ప్రస్తావించారు. ఆంధ్రప్రభలో ధారావాహికంగా ప్రచురించబడిన

కొత్త పుస్తకంతో కొంతసేపు

వాసిరెడ్డి సీతాదేవిగారి "సంధియుగంలో స్త్రీ" వంటి పుస్తకాలు అపసరం కావడం ఆలోచించవలసిన విషయమే. సార్త్రే వంటి ఆధునిక యుగ మేధావులూ, చలం వంటి తిరుగుబాటుదారులూ యేమనుకున్నారో, యేమి వాంఛించారో వారు ఉద్దేశించిన ఆ స్త్రీలలో అధిక సంఖ్యాకులకి (కనీసం వ్యాసపరంపరలో కొన్నింటిని యేర్చి కూర్చిన సంకలనం యిది. ఇందులోని 46 వ్యాసాలలో ప్రస్తావించబడినసంఘటనలన్నీ ఆమె స్వయంగా చూసినవే, ఆమె అనుభవంలోకి వచ్చినవే; చేయి తిరిగిన రచయిత్రి కనుక వాటిని యెంతో ప్రతిభావంతంగా, చదవరులను ప్రభావితం చేసే రీతిలో రాశారు సీత

సంధి యుగంలో స్త్రీ

రచన : వాసిరెడ్డి సీతాదేవి
పేజీలు 192 : వెల రూ. 12
ప్రతులకు :
దేశీ బుక్ డిస్ట్రిబ్యూటర్స్,
కాంగ్రెస్ ఆఫీస్ రోడ్,
విజయవాడ-2
దేశీ బుక్ హౌస్
నారాయణగూడా, హైదరాబాదు-29.

దేవిగారు. "చట్టాలు", "భద్రత లేని జీవితాలు", "వేశ్యావృత్తిని చట్టబద్ధం చేయాలా?", "ప్రేమ వివాహాలు విఫలం అవుతున్నాయా?" అనే వ్యాసాలు ఆలోచనా ప్రేరణాత్మకంగా వున్నాయి.

"ముఖం మీద విమర్శించే వాడే మిత్రుడు" అని సీతాదేవిగారు ఆసక్తికరమైన చర్చని లేవనెత్తారు - ఇప్పుడు రాస్తున్న రచయిత్రులు రాస్తున్నదంతా చెత్తేనా, ఎవరో ఒకరిద్దరు తప్ప - అంటూ! 'చెత్త' అనే మాటని ఖరారు చేసేంతటి సాహసం నాకులేదు కానీ, మన రచయిత్రులలో ఎక్కువ మంది వాస్తవజీవితాల విలువలనుంచి దూరంగా వెళ్ళి రాస్తున్నారని మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు. మినహాయింపు పొందిన ఆ ఒకరిద్దరు రచయిత్రులెవరో ఆలోచించగల పాఠకులకు తెలియని విషయం కాదు. రచయిత్రుల సృజనాత్మక శక్తిని తక్కువ చేసి మాట్లాడడం కాదిది. సామాజిక వైతాళికులుగా తాము నిర్వర్తించవలసిన బాధ్యతని వీరు విస్మరిస్తున్నారనే బాధతోనే ఎక్కువ మంది ఈవిమర్శచేస్తున్నారని గ్రహిస్తే మంచిది. సామాజిక దృక్పథం నుంచి చూసినప్పుడు కాలాతీత వ్యక్తులు, బలిపీఠం, మట్టిమనిషి వంటి నవలలు గుర్తుకొస్తున్నాయే కానీ నా వంటి వారికి కూడా మిగిలిన రచయిత్రుల సాహిత్యం స్ఫురణకి రావడం లేదు. ఇది నా లోపమేమో తెలియదు. ఈ విషయం మీద కొంత చర్చ జరిగితే సాహిత్య ప్రయోజన పరంగా కొంత ఉపయోగం వుంటుంది.

సీతాదేవిగారి యీ పుస్తకం, చదవనేర్చిన స్త్రీలు, పురుషులు కూడా చదివి ఆలోచించవలసిన అవసరం వుంది.

—రాజ్యలక్ష్మి

ఫ్రీవర్స్ ఫ్రంట్ బహుమతి

1980 సంవత్సరానికి ఫ్రీవర్స్ ఫ్రంట్ బహుమతి ఈ యేడు ఉగాదినాటికి నిర్ణయిస్తారు. బహుమతి విలువ 500 రూపాయలు. 1978, 1979, 1980 సంవత్సరాల్లో ప్రకటించిన ఫ్రీవర్స్ కావ్యాలకు యీ బహుమతి పొందే అర్హత వుంటుంది. దీనికోసం తమ కావ్యాలు పంపదలచినవారు, ఫిబ్రవరి చివరి తేదీలోగా 4 కాపీలు పంపాలి. చిరునామా: ఫ్రీవర్స్ ఫ్రంట్, ఎం. సి. 16, మలక్‌పేట కాలనీ, హైదరాబాదు-36. పంపని వారి కావ్యాలు కూడా పరిశీలించడం జరుగుతుంది. కాని నిర్ణేతల దృష్టికి రాకపోయేవి ఉంటాయేమోనని యీవిధంగా కాపీలు కోరుతున్నాం. కాపీలు పంపడానికి అవకాశం లేని వారు కావ్యం పేరు, ప్రచురణ సంవత్సరం, కవి వయస్సు మొదలగు వివరాలు పంపవచ్చు. వివిధ కవుల రచనలు కల సంకలనాలు బహుమతి పరిధిలో లేవు. ఈ బహుమతి యువకులకు ఉద్దేశించినటువంటిది.

-కుందుర్తి
అధ్యక్షులు, ఫ్రీవర్స్ ఫ్రంట్.



"చిరంజీవి సౌభాగ్యవతి శశిరేఖను చిరంజీవి శ్రీమంత్‌కు యిచ్చి........"

మేడమెట్లు దిగి వస్తున్న శశిరేఖ చివాలున యిటుతిరిగి చూసింది.

కళ్యాణ పత్రిక నమూనా పరిశీలించుతూ హాలులో సోఫాలలో తీరికగా ఆసీనులై ప్రసన్న వదనాలతో వింటున్నారు విశ్వేశ్వరి, రఘురామయ్య. తాను నిర్ణయించిన ముహూర్తబలం ఎంత మహత్తరమైనదో వివరించుతున్నాడు వారికి అభిముఖంగా కూర్చున్న పురోహితుడు.

నిలువెల్లా కంపించింది శశిరేఖ.

అస్తిత్వమే విస్మరింపజేసేటంత ఆవేశం ఆవరించిందామెను కొన్నిక్షణాలు.

సుడిగాలిలా దిగివచ్చింది మేడమెట్లు.

"రామ్మా కూర్చో! ఊరినుంచి వస్తూనే నిద్రపోయావు."

ఆ సాదర వాక్యాలు శశిరేఖకు విన్పించినట్లు లేదు.

తల్లి చేతిలోని కాగితాన్ని దురుసుగా లాక్కొని చూసి, మరుక్షణంలో నేలకేసి కొట్టింది చేతి సత్తువకొలదీ.

నివ్వెరపాటుతో చూశారు పెద్దలు ముగ్గురూకూడ.

"ఆఫ్ట్రాల్ శ్రీమంత్‌తోనా నా వివాహం? ఏం, నాకేం తక్కువని? మీకు ఏమి లేదని?" శివమెత్తిపోతూ అడిగింది.

"శశీ! ఏమిటా దూకుడు?" తల్లి మందలింపుగా అన్నది.

"కాక ఏమిటమ్మా ఇది?" ఆ స్వరంలో కోపం.

"గోపాలంగారూ, మీరు సెలవు తీసుకోండి. మళ్ళీ కబురంపుతాను" అన్నాడు రఘురామయ్య.

"చిత్తం చిత్తం" అంటూ పురోహితుడు నిష్క్రమించాడు, ఆ కుటుంబ కలహం చూడాలనే కోరిక వున్నప్పటికీ.

సీరియల్ ప్రారంభం

సౌభాగ్యవతి

— ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవీ రామశాస్త్రి



తనను తేరిపార జూస్తున్న తండ్రి రఘురామయ్యను చూచి బెదిరిపోలేదు శశిరేఖ.

"ప్రతిదానికీ హఠం చేసినట్లే అనుకున్నావా ఇటువంటి పెద్ద విషయాలలో కూడ? ఆలోచన ఎప్పుడు వస్తుందిక నీకు?" తన పెద్దతరహా హుందా ధోరణి లోనే అడిగాడు రఘురామయ్య.

కూర్చున్న తావునుండి విసురుగా లేచిపోయింది విశ్వేశ్వరి.

"అది ఇల్లు పీకి పందిరేసినా యిలాగే నిమ్మకు నీరెత్తినట్లు వుండండి. అప్పుడు యింకా బాగా పెద్దరికం అబ్బుతుంది మీ ముద్దుల కూతురికి.... శుభమా అని పెళ్ళి శుభలేఖ తయారుజేస్తుంటే నేలకేసి కొడతావటే దాన్ని?! అవ్వ!"

శశిరేఖ విసిరేసిన కాగితాన్ని తీసి కళ్ళకు అద్దుకొన్నది విశ్వేశ్వరి, "దుడుకు పిల్ల" అనుకుంటూ.

"నీ ఉద్దేశ్యం ఏమిటి? శ్రీమంత్‌తో అంత స్నేహంగా తిరుగుతావు..నీకు యిష్టమే, ఇక అడగడం అనవసర మనుకున్నాను" అన్నాడు తండ్రి.

"చిన్నప్పటినుండీ కలసి చదువుతున్నాం, కలసి తిరుగుతున్నాం. అంత మాత్రానికే బ్రతుకంతా అతడితో ముడిపెట్టుకుంటానని ఎలాగనుకున్నారు?"

కొద్దినిముషాలు సాలోచనగా నేలవైపు చూస్తూండిపోయాడు.

"మరి ఎందుకిష్టంలేదు శ్రీమంతంటే?"

"హుఁ!" నిరసన వ్యక్తీకరించేట్లు నవ్వింది. "సిరిలేని శ్రీమంతుడు! ఆతన్ని చేసుకొని నేను బావుకొనేదేమిటి?"

బాధపడ్డట్టు చూచాడు రఘురామయ్య.

"అమాయకురాలా! ఇంతేనా నీ చదువు నీకిచ్చిన జ్ఞానం? శ్రీమంత్‌వంటి వ్యక్తిని ధనరాసులతో అంచనా వేస్తున్నావా?"

కుమార్తె అజ్ఞానంపై జాలిపడుతున్నట్లుగా అన్నాడు.

"ఏనిమిదేళ్ళ ప్రాయంవాడు శ్రీమంత్ నేను మొదట చూసిననాడు. ఆనాటినుంచీ చూస్తున్నాను—కోటిలో ఒకడు అతను. అరుదైన గుణగణాలు, చేజేతులా పెన్నిధిని జారవిడువకు."

"హుఁ. పేదవాడు పెన్నిధి ఎలా కాగలడు నాన్నగారూ?"

"అతిశయం అనర్థదాయకం!" ఉరిమింది విశ్వేశ్వరి. "ఇంతకంటే గొప్ప వాడిని మేమూ తేలేము. ఏదో కాస్త కలిగినవాళ్ళమేకానీ, ఒక్కొక్కళ్ళకూ లక్షలు గ్రుమ్మరించి లక్షాధికారులను తేగల స్తోమతు మాకూ లేదు. పరిస్థితులర్థం చేసుకో."

"నీకు శక్తి లేకుంటే మానెయ్యమ్మా, అంతేకాని నా బ్రతుకును అధోగతి పాలు చెయ్యడమెందుకు? నేనిప్పుడు పెళ్ళి కావాలన్నానా?" తీవ్రంగా ప్రశ్నించింది శశిరేఖ.

"నీవనేదేమిటి? మా బరువు మాది. నీ తర్వాత వకుళ పెళ్ళికి వుంది. అది నీఅంత చదువుకోనైనా లేదు. ఈ రోజుల్లో అందరూ చదువు కావాలంటున్నారు పెళ్ళికూతుళ్ళకు కూడా."

"అమ్మా, మీ బరువు వదిలించుకోవడానికి నా బ్రతుకు భారం చేయకు. కావలిస్తే వకుళ పెళ్ళే చేసుకోండి. నేను బాగా ధనవంతుడూ, మంచి ఉద్యోగి అయినవారినే వివాహం చేసుకుంటాను."

ఖండితంగా వున్న ఆ ధోరణికి విశ్వేశ్వరీ, రఘురామయ్యా ముఖముఖాలు చూచుకున్నారు నిస్సహాయంగా.

రఘురామయ్య విసుగ్గా లేచి పచార్లు ప్రారంభించాడు ఆలోచించుతూ.

చేతిలోని శుభలేఖను విశ్వేశ్వరి దీనంగా నిరాశగా చూడసాగింది.

"ఇంట ఓం ప్రథమంగా పెద్దపిల్ల పెళ్ళి అనుకొని మురిశాను, ఏమిటో ఇలాగైంది." తనలో తాను అనుకొన్నట్లు నెమ్మదిగా విచారంగా అన్నది విశ్వేశ్వరి.

ఆ పత్రికను తల్లి చేతి నుండి తీసుకుని హేళనగా పైకీ క్రిందికీ చూసింది శశిరేఖ.

"చిరంజీవి........సౌభాగ్యవతి......" విలాసంగా నిలబడి, ఒక్కొక్క పదాన్నీ ఒత్తి పలుకుతూ అవహేళనా స్వరంతో అన్నది శశిరేఖ.

"టెంపరరీ ఉద్యోగం, వుండేదో, వూడేదో తెలియదు. బొటాబొటి జీతం మినహా మరే ఆధారమూ లేదు. ఇటువంటి శ్రీమంతుడిని కట్టుకొన్నది సౌభాగ్య వతి ఎలా కాగలదు? చిరంజీవి ఎలా ఔతుంది? చాలీచాలని జీతంలో అవసరాలు గడవక దినదిన గండంగా బ్రతుకుతూ ఎప్పుడో తపీమని అర్థాంతరంగా చావ వలసి వస్తుంది.... ...."

"శశీ!" అదలింపుగా అన్నది విశ్వేశ్వరి.

"మీరు మాట్లాడరేం అది అలా వాగుతూంటే"? భర్తను తీవ్ర కంఠంతో అడిగింది.

"మాట్లాడనీ, తన అభిప్రాయాలూ ఆశలూ తాను చెప్తోంది. ఎదిగినపిల్ల. లోకం తెలిసినదేకదా?" అతి నెమ్మది స్వరాన అన్నాడేకాని రఘురామయ్య స్వరంలో బాధ స్పష్టంగా ధ్వనించింది.

"ఆ నెత్తికెక్కించుకోవడమే యింతవరకూ తెచ్చింది!" నుదురు కొట్టు కున్నది విశ్వేశ్వరి.

విశ్వేశ్వరికి తీసిపోని తీవ్ర స్వభావి శశిరేఖ!

చేతిలోని శుభ పత్రికను పరపరా చింపి పారవేస్తూ తల్లిదెస సూటిగా చూసింది.

"ఈ పెళ్ళి జరగదమ్మా. ఈ జన్మలో జరుగదు. అంత ఆస్తిపరులు

నాన్నగారు! ఇంత మేడ, కారూ, హోదాగల నువ్వే ఇద్దరంటే ఇద్దరే ఆడపిల్లల పెళ్ళిళ్ళకు యింత భయపడుతున్నావే-మరి తన చదువు తప్ప మరేమీ లేని ఆ నిరాధారుడిని కట్టుకుంటే ముందుముందు నా కెన్ని సమస్య లెదురౌతాయో ఆలోచించావా!"

అప్రతిభురాలై అవాక్కుగా చూసింది విశ్వేశ్వరి.

సమాధానం చెప్పలేనట్లుగా తల వాల్చుకున్నది.

"మీరు చెప్పండి నాన్నగారూ, 'సౌభాగ్యవతి!' నోటిమ ఉగనుక తేలికగా అనేస్తారు. ప్రతి అమ్మాయిని 'చిరంజీవి సౌభాగ్యవతీ భవ!' అనే ఆశీర్వదిస్తారు. కాని అవి అందరిపట్లా నిజమౌతున్నాయా?

సౌ-భాగ్యవతి! అహ్హహ్హహ్హా! వంద భాగ్యాలు కాదు-కనీసం ఒక్కటి-ఒక్కటంటే ఒక్క భాగ్యమైనా ఇవ్వగలడా ఈ పేదభర్త? వంద నరకాలు మాత్రం రుచి చూపగలడు!"

దీర్ఘంగా నిశ్వసించుతూ అన్నాడు రఘురామయ్య.

"ఏం చెప్పనమ్మా? 'సౌభాగ్యవతి' అనే పదాన్ని నీవు సరిగా అర్థం చేసుకోలేదు. సహృదయుడూ, సద్వర్తనుడూ అయిన భర్త హృదయాన్ని మించిన భాగ్యం లేదు. సాధారణ భోగభాగ్యాలేమీ అందుకు సాటిరావు. ఆ ఉద్దేశ్యంతోనే నేను యిలా ఆశపడ్డాను కానీ, నీకు బలవంతంగా నీ యిష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసి నా బాధ్యత దులిపివేసుకుందామని కాదు. నువ్వు ప్రస్తుతం తెలివిగా ఆలోచించలేకపోతున్నావ్! తొందరేం? కొన్నాళ్లు ఈ విషయం వాయిదా వేద్దాం. తీరికగా ఆలోచించి, ప్రపంచాన్ని చూసి నిర్ణయించుకో! అంతవరకూ ఈ విషయాన్ని గోప్యంగానే వుంచుదాం. ముఖ్యంగా శ్రీమంత్‌కు తెలియకూడదు యివేమీ."

"మనం అనుకొంటే సరా? ఈసరికే ఆ గోపాలాచారి వెయ్యమంది చెవిన వేసి వుంటాడు."

"కబురంపించి గట్టిగా చెప్పు విశ్వేశ్వరీ, పురోహితుడికి-ఈ విషయమేమీ బయట తెలియరాదని."

"అలాగేలెండి."

2

"అక్కా!"

అరగంట పైగా ఆవేశంగా తలిదండ్రులతో వాదించిన కారణంగా అలంకరణా, మెరుగులూ ఏమైనా చెదిరినవేమోనని డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని సరిచూసుకుంటూన్న శశిరేఖ వకుళ పిలుపు విన్నీకూడ పలకలేదు.

ఎదుటి అద్దంలో కనబడుతూన్న వకుళ ప్రతిబింబంవైపు నిర్లక్ష్యంగా చూసింది.

వకుళ వచ్చి అక్క సరసన మరొక స్టూలుపై కూర్చున్నది.

చెంపలకు పౌడరు సుతారంగా అద్దుకొనడం ముగించి, కనుబొమలు దిద్దుకుంటూన్న శశిరేఖ అందాన్ని ఆరాధనగా చూసింది వకుళ.

"నువ్వు వస్తావనీ, ఇల్లు కళకళలాడుతుంది పెళ్ళి హడావుడితో-అనీ ఎంతో ఆశగా ఎదురు చూశారు అమ్మా నాన్నగారూ."

"నువ్వో?" వెక్కిరింపుగా అడిగింది శశిరేఖ.

"నేనూను. శ్రీమంత్ కూడ నువ్వంటే చాలా యిష్టంగా వుంటాడు. ఎందుకలా తృణీకరించావు?"

కోపంగా చూసింది శశిరేఖ.

"వకుళా నీ హద్దుల్లో నువ్వుండు. వెర్రిమొర్రి సలహాలిచ్చే ధైర్యం వచ్చిందే నీకు?"

"నేనంటే ఎందుకక్కా నీకంతకోపం? ఎప్పుడూ సరిగామాటాడవ్ నాతో!"

"వెర్రిమొహానివి గనుక! చదువు సంధ్యలు లేక నువ్వు కూడ ముసలాళ్ళల్లా ఆలోచిస్తున్నావ్."

"అందరూ నీలా ఎమ్మే డిగ్రీలు తెచ్చుకోనంతమాత్రాన నామోషీ ఏమీ లేదు. బియ్యే డిగ్రీకూడ తక్కువేమీ కాదు."

"నీతో వాదన నాకెందుగ్గానీ వెళ్ళు. నాకు పనుంది."

"సంక్రాంతి సెలవులకు వచ్చి వెళ్లినదానివి మళ్లీ ఈ వేసవిలో ఈరోజే వచ్చావ్. నీకు నాతో ఏమీ మాటలాడాలని లేదా అక్కా?"

"అబ్బబ్బ! ఏమిటే ఈ గోల నాకు? నెలా పదిహేను రోజులుంటాను యిక్కడ. సరేనా? ఈరోజు నా ఫ్రెండ్సుని చూడాలి. నన్ను పోనీయ్." విసుగ్గా అన్నది లిప్‌స్టిక్ దిద్దుకోవడం పూర్తిచేసి.

"సరే." లేచింది వకుళ వెళ్ళిపోవడానికి. "ఒక్క క్షణమక్కా. శ్రీమంత్‌ని మాత్రం తూలనాడకు, కొంతకాలం తర్వాత కూడ నీ అభిప్రాయం అదే అయితే అప్పుడే చెప్పవచ్చు. శ్రీమంత్‌వంటి యువకులను అరుదుగా చూస్తాం."

స్లిప్పర్స్ వేసుకుంటూన్న శశిరేఖ విసురుగా యిటు తిరగడంతో ఆమె పైటకొంగు తగులుకొని షెల్ఫ్‌లో అందంగా పేర్చబడిన బొమ్మలలో ఒకటి క్రిందపడి విరిగిపోయింది.

అదేమీ సరకుజేయలేదు శశిరేఖ.

"ఆ శ్రీమంత్ అంత దేవుడిలా అనిపిస్తే నీవే చేసుకో. నువ్వే తీర్చు అమ్మ నాన్నల ముచ్చటా, మురిపమూ!"

విసవిసా నడచి వెళ్ళిపోయింది, తన మాటల ప్రభావం వకుళను ఎలా గాయపరిచేదీకూడ గమనించక.

వకుళ ఆ అఘాతంనుండి చాలసేపటికిగానీ తేరుకోలేకపోయింది.

"చిన్నప్పటినుండీ కలిసి తిరిగినది మీరిద్దరూ. అందరూ అనుకొన్నది మీ యిద్దరిగురించీ. మంచి గుణాలున్న వ్యక్తిని ఎవరైనా గౌరవిస్తారు. ఎవరైనా కోరుకుంటారు" అన్నది మందస్వరాన.

అయితే, ఆమాటలనుశశిరేఖవినలేదు. అప్పటికే మెట్లుదిగివెళ్ళిపోయింది.

అక్క కోవం గురించీ, జరిగిన వాదోపవాదాలనుగూర్చి తలపోస్తూ గదిని ఆనుకొనివున్న బాల్కనీలోకి వచ్చి ప్రక్కయింటిలోకి చూసింది యధాలాపంగా.

తమ మేడ ప్రక్కనే వున్న చిన్న పెంకుటిల్లు బాగా పాతబడి పోయింది. కొద్దిపాటి పెరడు, ఆ యింట్లో నుండి శ్రీమంత్ బయటకు వచ్చి స్కూటర్ వేసుకు వెళ్ళిపోయాడు హడావుడిగా.

వకుళ గుండె ఒక్కసారి స్పందన ఆగిపోయినట్లయింది.

'అతడంత దేవుడిలా అనిపిస్తే నీవే చేసుకో........' శశిరేఖ మాటలు చెవులలో ధ్వనించగా సరిక్రొత్త ఆలోచనలు రాసాగాయి.

ఎంత చక్కటి రూపం! మరెంత నమ్రత!

'ఎందుకితడిని చేజేతులా కాలదన్నుతోంది అక్క?'

3

"ఎందుకు వద్దన్నానంటావా శ్రీమంత్‌ను? నాకు నాతో సరితూగగల సౌందర్యవంతుడూ, మా కంటే ధనవంతుడూ కావాలి!"

స్నేహితురాలు జలజ అడిగిన ప్రశ్నలకు ఓపికగా గర్వంగా జవాబులు చెబుతోంది శశిరేఖ.

"శ్రీమంత్ అందగాడేనే!"

"ఔను. కానీ శ్రీమతి అందానికి మెరుగులు దిద్దగల స్తోమతూ, లోటు లేకుండా అందలాలు ఎక్కించి ఆనందింప చేయగల తాహతూ లేవు! ఆఫ్టారాల్ అయిదువందల జీతగాడు."

"ప్రారంభంలోనే ఎవరికీ వేల కొలది జీతాలుండవు కదా! ఈ సంవత్సరమేగా అతడుద్యోగంలో జేరింది?"

"నన్ను కవ్వించకు జలజా," కసినంతటినీ ఆడుతూన్న పింగ్ పాంగ్ బాల్‌పై చూపింది. "ఆడపల్ల అమ్మానాన్నల అభీష్టానికి తల ఒంచి మనం ఆడుతూన్న ఈ బంతిలాగే అత్తింటికీ పుట్టింటికీ-ఇటు కొడితే అటూ-అటు కొడితే ఇటూ వచ్చి పడే రోజులు గతించాయి."

"ఔను. ఇంతకూ ఎవరేమిటి ఆ శ్రీమంత్?"

"మా ప్రక్కింటివాళ్ళ అబ్బాయి. పెద్దపేరు నామాలేం లేవు. ఇక ఎవరని చెప్పేది? మా నాన్నగారి దయాధర్మాలతో చదువుకొని నేడు మనిషి అయ్యాడు. పోనీయ్."

"ఓహో! అందుకే నీకంత చిన్నచూపు. సరే. పోనీ....నీ ఊహాలోక రాజకుమారు డెలా వుండాలి?"

"ఊహాలోకమేం ఖర్మ? నిజలోకంలో నే వున్నాడు!"

"ఎవరో?"

"అడుగుతావని తెలుసులే. వేచివుండు. బై!"

4

"ఎవరూ, ఎక్కడున్నాడూ, ఏంచేస్తున్నాడూ" అని అడిగే ప్రశ్నలకు ఒకే బాణం సమాధానం కావాలి మహేష్."

"అది ఏమిటో కూడా నీవే చెప్పు."

తన ఒడిలో ఒయ్యారంగా వాలి వున్న ఆమె ముంగురులతో ఆడుకుంటూన్న మహేష్ అన్నాడు.

"మన పరిచయప్రణయాలను పరిణయరూపంలో ప్రపంచానికి చాటటమే!"

"............"

"ఏం మాట్లాడవ్?"

"నా ఉద్దేశ్యంలో పరిణయం ప్రణయానికి సమాధి!"

"వ్వాట్?" అదరిపడి ఒక్క ఉదుటున లేచి కూర్చున్నది శశిరేఖ.

"ఔను రేఖా, పెళ్ళయితే బాధ్యతలేగానీ సరదాలేముంటాయి?"

శశిరేఖకళ్ళలో తత్తరపాటూ, కలవరంతో కూడిన అనేక ప్రశ్నలూ కదలాడాయి.

"ఏమిటి, కంగారు పడుతున్నావా? నో డార్లింగ్," ప్రసన్న వదనంతో ఆమెను దగ్గరగా తీసుకున్నాడు మహేష్.

"మన యిద్దరి పెళ్ళి ఖాయం! సరేనా?"

"ఎప్పుడని?"

"అరే? ముసలాళ్ళలా ఆ తొందరపాటేమిటి?"

"వాళ్ళ గురించే కదా మరి ఈ హడావుడి?"

"ఏదో సర్ది చెప్పేయి: వాళ్ళ గురించి మన ఆనందం వదులుకుంటామా? రోజులు మారాయి. పెళ్ళి తర్వాత విహారాలు పూర్వం, పెళ్ళి ముందు ఈ రహస్యంగా కల్సుకోవడంలో 'థ్రిల్' వాళ్ళకేం తెలుసు? ఈ థ్రిల్ వీలైనంత ఎక్కువ అనుభవించాలని నా కోరిక."

"రోజులూ మారాయి, మనమూ మారాము, కానీ పెద్దలే మారలేదు. అంచేత మనం ఆశించే ఈ థ్రిల్సూ, డ్రీమ్సూ మన పిల్లలకు అందుతాయి. మనం పాత దారిన నడవ్వలసిందే."

"స్టాప్ స్టాప్, ప్లీజ్." చెవులు మూసుకున్నాడు మహేష్.

"ఏమిటి? ఏమన్నా న్నేను?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఇంకా ఏమన్నానంటున్నావా? అప్పుడే పిల్లల వరకూ వెళ్ళిపోయావ్, చూశావా? అంతే పెళ్ళి అనగానే ఇక అవన్నీ ఆటోమాటిక్, 'జోజో హాయీ' అంటూ ఒడిలో పసివాడితో నువ్వు—ఓ!-హారిబుల్! ఇప్పట్లో ఆ దృశ్యం మనసులో కూడ నేనూహించలేను."

అతడు చెబుతూన్న తీరు శశిరేఖను పకపకా నవ్వించింది.

మహేష్ శృతి కలిపాడు.

నవ్వి నవ్వి ఇద్దరికీ అలసట వచ్చింది.

"చూశావా? ఇంత హాయిగా నిశ్చింతగా నవ్వుకోనిస్తారా మనని పిల్లలు? ఉండటానికైతే ముద్దొస్తూ బొమ్మలల్లేనే వుంటారు, 'మమ్మీ అది కావాలి' 'డాడీ ఇదితే అవితే' అని అప్పులాళ్ళకు మల్లే పీక్కు తినేస్తారు. ఒక్క ఘడియ అయినా మనని ఇలా గడపనిస్తారా?"

శశిరేఖ మరలా నవ్వసాగింది. హాయిగా నిష్కల్మషంగా నవ్వుతూన్న శశిరేఖను మురిపెంగా చూశాడు మహేష్.

మరి నవ్వే ఓపిక కూడా లేని శశిరేఖకు తన ఒడిలో ఆలంబన యిస్తూ అన్నాడు చెవిలో అతి మంద్ర స్వరాన!

"ఇదిగో.... ఈ మాధుర్యం కొన్నేళ్ళు మన స్వంతం. అందుకే ఇప్పట్లో మూడు ముళ్ళ బంధం మనకు దూరం!"

సమంజసమే అనిపించిన శశిరేఖ మరి తర్కించలేదు. (సశేషం)

బాబాయి హేతునామా

డాక్టర్ పరుచూరి రాజారామ్

అసలు బాబాయి ప్రవర్తన అంతా వింతగానే వుండేది. బాబాయిది బ్రహ్మచారి బతుకేమో కాస్త రసవుగా కష్టం సుఖం చెప్పుకుంటే నాతోనే. అంతా నన్నాయన పెంపుడు కొడుకనేవారు. నాకుమాత్రం ఆయనలో నన్నేకాదు ఎవర్ని పెంచుకునే లక్షణాలూ ఎప్పుడూ కనపడలేదు. ఒక ముసలావిడ వంట చేసి పెట్టేది. బంగళాలాంటి పెద్ద కొంప. అద్దెకుకూడా ఇచ్చేవాడు కాదు. ఒంటిపిల్లి రాకాసిలా వుండే బాబాయిని చూస్తే వూళ్ళో జనానికి భయంకూడా! పలుకరిద్దామన్నా 'భయమే' ఒడ్డెమంటే తెడ్డెమనే బాబాయితో మాట్లాడటానికి ఎవరికీ సహనం వుండేదికాదు. పెంపుడుకొడుకని వచ్చిన అపప్రథ వల్లగానీ, మరెందువల్లైనాగానీ నేనుమాత్రం బాబాయితో నిర్భయంగా వుండేవాణ్ణి. బాబాయికూడా నా నిర్భీకతని మెచ్చుకునేవాడు. కుర్రతనం! బాబాయి మెచ్చుకోలు నాసరా చేసుకుని బాబాయినే విమర్శించేవాణ్ణి. నేనొక్కణ్ణే ఆమాత్రం దగ్గర కాగలిగింది.

బాబాయి తాను హేతువాదినని చెప్పుకునేవాడు అలా చెప్పుకోవటం ఫ్యాషన్ కనుక చెప్పుకునేవాడని నా అనుమానం! అదొక్కటే కాదు స్వేచ్ఛా సమానతల గురించి తరచు చింకిలెక్చర్లు దంచేవాడు. ఏదైనా అడిగామో! ఇక ఓగంట లెక్చరు. అయినా నేను వూరుకునేవాణ్ణి కాదు. అన్ని పనులూ వింతగా కనబడేట్లు చేయాలన్నదే బాబాయి అభిమతం అనుకుంటాను. సంచలనం సృష్టించి నలుగురి దృష్టిలోనూ పడాలన్న తాపత్రయం హెచ్చు.

హేతువాద సంఘంలో బాబాయి సభ్యుడు కూడా! "బి రేషనల్... వై డోంట్ యు థింక్?" అంటూ మొదలెట్టేవాడు ప్రతిదానికీ! ఉత్తి సెన్సేషన్ కాక, బాబాయిలో హిపోక్రసీ కరుడుకట్టి వుందని నాకు అనుమానం. అనుమానం పూరికే రాలేదు. బాబాయిగారింటికి తెల్లవారుతూనే వెళ్తే, ఆత్రేవనే వూళ్ళోవున్న రెండు దేవాలయాల పూజార్లూ వెళ్తూ కనిపించేవారు. శుచిగా స్నానం చేసి దైవపూజ కోసం ఆత్రంగా వెళ్ళే వాళ్ళిద్దరిలోనూ పూరందరికీ ఏదో పవిత్రత గోచరించేది. సగౌరవంగా, వినయంగా ప్రవర్తించే వాళ్లు. బాబాయి మాత్రం పనిగట్టుకుని "షికారెళ్దాం రారా!" అంటూ నన్ను వెంట పెట్టుకుని వాళ్ళ వెనకాలే బయల్దేరి లెక్చర్లు దంచేవాడు.

"అసలు యీ దేశం ఎందుకు నాశనమైందంటావ్?" అని ప్రశ్నించి, తానే "మతమూ పూజార్ల మూలంగానే" అనేవాడు.


"ఏ దేశమైనా, ఏ వ్యవస్థ అయినా ఎందుకు నాశనమవుతుందంటావ్?" అని అడిగి "మతమూ పూజార్లే నాశనం చేశారు! చేస్తారు!" అనే వాడు. మతాన్నీ, దేవుణ్ణీ, పూజార్లనీ తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టేవాడు పాపం! ఈయన ఆరడుగుల భారీకాయాన్ని నిగనిగలాడే నల్లటి ముఖంతో ఎర్రటి జీరల్తో మెరిసే కళ్ళనీ చూసి పూజార్లు తలవంచుకు వెళ్ళిపోయేవారు.

అసలు సంగతి మరచిపోయాను. అదే బాబాయి హిపోక్రసీ గురించి. మతాన్నీ దేవుణ్ణీ యిన్ని తిట్లూ తిట్టేవాడు, ప్రొద్దున్నా, సాయంత్రం ఏదో గొణుగుతున్నట్లుండేవాడు. మొదట్లో వడ్డీ లెక్కలు గుణించుకుంటున్నాడనుకున్నాను. తరువాత అతి మెల్లగా పాడుకుంటున్నాడేమో అనుకున్నాను. రానురాను



నా క్యూరియాసిటీ పెరిగింది. బాబాయిగుణించుకోవటంలేదు. పాట అసలే కాదు. జాగ్రత్తగా బాబాయి నన్ను గమనించకుండా నేను బాబాయిని గమనించాను. ఈ గొణిగేటప్పుడు ఉద

కవితకి కార్టూన్ :



బ్రతికి చచ్చియు ప్రజల కెవ్వడు
ప్రీతి కూర్చునొ వాడె ధన్యుడు.
—గురజాడ

యం తూర్పుకేసీ, సాయంత్రం పడమర కేసీ నిలుచుంటున్నాడు బాబాయి. రోజూ వరండాలో నిలబడి గొణుక్కునే వాడు. ఒక రోజున బాబాయి వరండాలో కొచ్చే ముందే నేను పక్క గదిలో దూరాను. కిటికీ పక్కగా కూర్చున్నాను. నా రాకను బాబాయి గమనించలేదు. గొణుక్కోవటం మొదలు పెట్టాడు దొంగ దొరికి పోయాడు. "ఓం! భూర్భువః! స్వః! తత్సవితుర్వ రేణ్యమ్!...." నిత్యం గాయత్రి జపిస్తాడన్నమాట! చెప్పొద్దూ నా కొళ్లు మండింది. బయటేమో నాస్తికుడి కబుర్లూ హేతువాద సంఘాలూ, లోపలేమో గాయత్రి జపాలూ, అష్టోత్తర శత నామాలూ, సుప్రభాతాలూ!

నా కూరుకోబుద్ధి కాలేదు బయటకొచ్చి ఝూడించాను. "ఏంటి! బాబాయ్! నువ్ చెప్పేదేమిటి? చేసేదేమిటి?". బాబాయి అవతార పురుషుడిలా నవ్వాడు. ఆ నవ్వుని మళ్ళా సుస్మితంగా రెట్టించాడు. రెండవసారి నవ్విన నవ్వు నన్ను కొన్ని సెంటీమీటర్లు కుదించి హీనపరచినట్లు కనిపించింది.

"ఒరేయ్! నువ్వేం విన్నావ్? గాయత్రి జపిస్తు న్నగా... అంతేనా! అందులో ఏముంది? సూర్యుడి ప్రసక్తి ప్రశస్తిని! సూర్యుడు దేవుడేమిటి? ఎదురుగా కనపడుతుంటేను! భూమి మీద మనం నిలబడి వుంటేను! ఇదంతా సహేతుకమే!" అన్నాడు. నేను నోరు తెరిచాను! "అయితే బాబాయ్! నీ నాస్తికసంఘమూ హేతువాదసంఘమూ వప్పుకుంటాయా దీనికి?" అన్నాను కోలుకుని.

"ఒరేయ్! వాళ్ళొప్పుకునేదేమిటి? ఇది వాళ్ళ పరిధికి మించిన ఆలోచన! వాళ్ళను ఎదగనివ్వు! అప్పుడు వాళ్ళకు సరైన భాష్యం చెప్తాను. అర్థమవుతుంది. అయినా గాయత్రీ జపం నిర్హేతుకమా?....?" అంటూ దంచటం మొదలెట్టాడు. బాబాయిని హిపోక్రైట్ అన కూడదు. ఏదో శానీ మొత్తం మీద పెద్దపదమో కొత్తపదమో వాడాల్సిందేననిపించింది. (రాస్కెల్! అనలేకపోయాను. ఏమూలో ఆస్తి నాకు రాస్తాడన్న ఆశ వుండేమో!).

ం ం ం

అందరి కంటే బాబాయి ద్వేషించే వాడొకాయన వుండేవాడు. బాబాయి కంటే చిన్నవాడే - సుబ్బయ్య. సుబ్బయ్యకు రెండు, మూడెకరాల పొలం వుంది. పిల్లలు లేరు. బాబాయి బంగళాకు కొద్ది దూరంలోనే సుబ్బయ్య పెంకుటిల్లు. ఊళ్లో చటకారీ దేవతలకు పూజాలూ, పునస్కారాలూ, బలులూ

కవితకి కార్టూన్ :




అన్నీ సుబ్బయ్య ఆధ్వర్యాన్నే జరిగేవి. ఆ ఇద్దరు పూజారుల తరువాత సుబ్బయ్యే 'బాబాయి పీడితుడు'. క్షుద్ర దేవతారాధకుడని కాబోలు బాబాయి నోరు మరీ ఛండాలంగా వెళ్తుండేది. నాలుగైదుసార్లు బాబాయి ప్రక్కన నడవటానికి కూడా సిగ్గేసింది నాకు. ఒక రోజు నాకు చిర్రెత్తుకొచ్చింది. దానికి పెద్ద కారణమే వుంది. ఆ రోజు బాబాయి ల్యాండ్ సీలింగ్ ఆఫీసర్లను కొంతమందినీ, హేతువాద సంఘం కార్యదర్శినీ, నాస్తిక సంఘంఅధ్యక్షుడినీ, అర డజను మందిని విందుకు పిలిచాడు. పరిచయం కొద్దీ కొందరూ, పలుకుబడికి దడిసి కొందరూ—అంతా వచ్చారు. ఆ రోజు ఏకాదశీ....పుణ్య దినం. ఉపవాసాలు చేసే రోజు. బాబాయి బ్రహ్మాండంగా కోళ్లూ, కొక్కిరాయిలూ కోయించి స్కాచ్ విస్కీతో విందు ఏర్పాటు చేశాడు. పంతం కొద్దీ ఆ రోజున అవన్నీ ఏర్పాటు చేసినందుకు హేతువాద సంఘం కార్యదర్శీ, నాస్తిక సంఘం అధ్యక్షుడూ బాబాయిని అభినందించారు వచ్చిన వాళ్ళల్లో ఒకాయన మాత్రం—పాపం బాబాయి సంగతి తెలీక అడిగేశాడు. "విందు వరకూ ఫరవాలేదు! ఏమిటండీ! ఈ తాగుడూ, మాంసాహారమూ?" అన్నాడు. బాబాయికి ఆయనతో పనుంది. అందువల్ల దూకుడుగాపోక "మీ మూఢనమ్మకాలు. వమ్ముచేయాలనే తపన. ఇవేళ తిండికీ, తాగుడికీ పరిమితుల్లేవు ఏమౌతుందో చూడండి!" అన్నాడు. ఆ మర్యాదస్తుడు నిక్కచ్చిగా తాను తాగననీ మాంసాహారం తీసుకోననీ చెప్పేశాడు. బాబాయి విజయం సాధించినట్లు ముఖం పెట్టాడు. హేతువాద సంఘ కార్యదర్శిగారూ, నాస్తిక సంఘం అధ్యక్షులూ బాబాయిని పుబ్బేశారు. బాబాయి రెచ్చిపోయాడు. అధ్యక్ష, కార్యదర్శులూ బాబాయీ వుండిపోయారు. డోస్ ఎక్కువైంది. బాబాయికి ఎగపూపిరీ, దిగపూపిరీ. పెద్దగా మూలుగుతున్నాడు. కూర్చోమంటే కూర్చోడు. పడుకోమంటే పడుకోడు. గోలా....మూలుగు....గోలా.

ఎందుకోగాని బాబాయిని ఏడిపించటానికి

ఇదే అదననిపించింది ఆ ఊహే రాకూడదు. వచ్చింది. ఇంక నాకు దాన్ని ఆచరణలో పెట్టి దాకా తోచలేదు. అతిథులు వెళ్ళగానే బాబాయిని జాగ్రత్తగా పడుకోబెట్టి సంసారి

కవితకి కార్టూన్ :




సంపాదకుడంటే నా
కింపారెడు భక్తిగలదు, ఎంచేతనగా
సంపూర్ణ మనుజుడాతడు
చింపాంజీకన్ననయము సిరిసిరిమువ్వా!!

— శ్రీశ్రీ

కవితకి కార్టూన్ :

నా రాతలు శ్రోతల్లో
పుట్టించాయంట రోత
అయితే నా ఉద్దేశం
నెరవేరిందన్నమాట

— శ్రీశ్రీ



సుబ్బయ్యదగ్గర కెళ్ళాను. సుబ్బయ్య అర్ధ రాత్రిపుడు నారాక చూచి ఆశ్చర్యపోయాడు. సుబ్బయ్యకు అంతా వివరించాను. "చిన్న తమాషా చేద్దాం సుబ్బయ్యగారూ! మీకు రోజూ బాబాయి తిట్లూ తప్పుతాయి, నాకు బాబాయి కవచం బద్దలుకొట్టిన ఆనందమూ దక్కుతుంది" అన్నాను. సుబ్బయ్య సరే నన్నాడు. నేను వీధిమలుపులో వంతెనమీద కూరుని అంతా చూస్తున్నాను. నా లెక్క ప్రకారం సుబ్బయ్య ఒక గంటలో వచ్చెయ్యాలి. తన్నులు తిని ముఖం వేళ్లాడేసు కొచ్చేసినా ఆశ్చర్యంలేదు! గంట అయింది. రెండు గంటలైంది. సుబ్బయ్యరాడు. వంతెన మీదే కునికాను. తెల్లవారు ఝామునే మెలకువ వచ్చింది. పూజార్లు వెళ్లారు. సుబ్బయ్య మాత్రం వెళ్ళలేదు. నాక్యూరియాసిటీకి నేనే తిట్టుకున్నాను. ఏమైందీ లోపల....సుబ్బయ్యేడీ? బాబాయికెలా వుంది? టిఫిన్ తినొచ్చి మళ్ళీ అక్కడే కూచున్నాను. వెళ్దామంటే ఒక వేళ సుబ్బయ్య బాబాయికి అంతా చెప్పేశాడేమోనని భయం. ఇంటికి పోదామంటే ఏమైందోననీ ఆత్రుతా! మధ్యాహ్నం భోజనం చేసి మళ్ళీ వస్తూ సుబ్బయ్య ఇంటి మీదుగానే వచ్చాను. సుబ్బయ్య జాడలేదు.

సూర్యుడు పడమటికి వాలాడు. సుబ్బయ్య బాబాయి ఇంట్లోంచి నిండుగా హాయిగా తృప్తిగా నిర్లక్ష్యంగా వెళుతున్నాడు. సుబ్బయ్య అలా వెళ్ళటం నా క్యూరియాసిటీని మరీ పెంచింది. "సుబ్బయ్యగారూ!" పిలిచాను. ఆయన వేదాంతిలా చిరునవ్వు నవ్వి ఆగకుండా వెళ్ళిపోయాడు. ఏదైతే అదవుతుందని నేను గబగబా బాబాయిగారింట్లోకివెళ్ళాను.

బాబాయి కొద్దిగా బలహీనంగా వున్నాడు. మంచం చుట్టూ నాలుగు ప్రక్కలా ప్రమిదల్లో వేసిన సాంబ్రాణి ఇంకా పొగ వస్తూనే వుంది. బాబాయి ప్రపంచంలోని ప్రశాంతినంతా పుక్కిటపట్టి తాగేసిన వాడిలా నిశ్చలంగా పడుకుని వున్నాడు.

"ఏం బాబాయ్! ఎలా వున్నావు? నేనొకటే మొద్దు నిద్రపోయను" అన్నా.

"అంతా పోలేరమ్మదయ! సుబ్బయ్య మహానుభావుడు!" అన్నాడు బాబాయి.

మూర్ఛపోతే నీళ్లు చల్లే వాళ్లు లేరనిగానీ లేకపోతే మూర్ఛ వచ్చేదేమో నాకు!

"ఏంటి బాబాయ్?" అన్నాను ఆశ్చర్యంగా. "అంతా పోలేరమ్మదయ! రాత్రి అతలాకుతలమయ్యానా? సుబ్బయ్య అర్ధరాత్రి దాటాక వచ్చాడు. నేను చావు బతుకుల్లో వున్నానని మంత్రజలం ఇచ్చి బ్రతికించమనీ నిద్రపోతున్న సుబ్బయ్యకు పోలేరమ్మ కలలో కనిపించి చెప్పిందట పాపం! దేవుడల్లే వచ్చాడు గనుక సరిపోయింది. లాగుడెక్కువై ఊపిరందలేదు. చచ్చానే అనుకో! సుబ్బయ్య పోలేరమ్మ ఆసరాతో ఒడ్డున పడేశాడు!" అన్నాడు.

బాబాయి హేతువాదంమీద నాకెన్నడూ నమ్మకం లేదు. తమాషాకు చేసిన చిన్న ఎక్స్పెరిమెంటుకు ఇంత మారకాడనీ అనుకోలేదు. వీటివల్ల వచ్చిందీ పోయిందీ కూడా ఏమీ లేదు. నేను దెబ్బతిన్నదల్లా ఒకటికి!

బాబాయి పోయాడు. కర్మకాండలన్నీ ముగిశాక ప్లీడరుగారు బాబాయి ఆస్తి అంతా సుబ్బయ్యగారికి పోలేరమ్మ గుడికీ రాసేసి పోయాడని చెప్పినప్పుడు నానోట మాట రాలేదు!!

(ఆధారం: మొపాసా)

కవితకి కార్టూన్ :

బారెట్లా అయితే సాం
బారెట్లాచెయ్యగలడు? భార్యయెదుట తా
నోరెట్లా మెదలించును?
చీరెట్లా బేరమాడు? సిరిసిరిమువ్వా?

— శ్రీశ్రీ

ఆ వాగుడంతా నోర్ముల్లో!!
లెక్కించిందా??



దేశభక్తి

మూలం: హావర్డ్ ఫాస్ట్
తెలుగు: ఎమ్. పార్థసారథి

ఫ్యాక్టరీకి ఎనిమిదిబ్లాకులవతల వుంటాడు మార్టిన్ ఆండర్సన్. అందువల్ల రోజూ సాయంత్రం పనినుండి యింటికి నడిచే వస్తాడు. ఎప్పుడైనా వర్షమో, మంచో కురుస్తుంటే మాత్రం తోటి పనివాళ్ళ బండి మీదో, లేదా అందరూ కలిసి వచ్చే కార్లోనో సర్దుకుంటాడు. అతితంటే వాళ్ళకిష్టం. అతడి కోసం కార్లో మరికాస్త ఒదిగి కూర్చోవటానికి వాళ్ళేమీ యిబ్బంది పడరు. రవాణా ఖర్చులు తగ్గించుకోవటంవల్ల భార్యకూ, పిల్లలకూ మరిన్ని సౌకర్యాలు కల్పించే వీలైందతనికి.

ఆ తర్వాత రోజంతా ఫ్యాక్టరీలో కాలు కదల్చకుండా నిలబడి పెట్రోలు వాసనా, కరుగుతున్న లోహం వాసనా, చెమట వాసనా పీల్చిన శరీరం సరదాగా నడుస్తూ, స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవటంవల్ల ఆరోగ్యం కూడా బాగుపడింది. ఎనిమిది బ్లాకులంటే నడకకు సరైన దూరం. ఆలోచించటానికి, ఊహించటానికి తీరిక. ఫ్యాక్టరీలో దొరకని తీరిక. భార్యకు ఏమేమి కబుర్లు చెప్పాలో ఎంపిక చేసుకోవటానికి తీరిక.

ఒకసారి యిల్లు చేరితే మళ్ళీ బైటికి రాడు ఆండర్సన్. కొన్నాళ్ళక్రితం తాగడం మానేశాడు. భార్యతో ఎటైనా పోవాలన్నా బేబీ సిట్టర్స్ ఖరీదు మరీ ఎక్కువైపోవటంతో వారానికే ఒకటి రెండుసార్లో తప్ప అదీ వీలుపడదు. అతడి సరదా అంతా పిల్లల్తో గడపటం, టివి చూడటం. వయసు గడిచి పోతోందని తెలుసు. కాని అందులో విచారంగానీ, పశ్చాత్తాపంగానీ లేదు.

ఇబ్బందుల్లేవనికాదు. కాని ఆ యిక్కట్లు భార్యాపిల్లల్ని బాధించేలాంటివి కావు. ఇంటికెళ్ళి పిల్లల్తో ఆడుకోవాలా, భార్యకు యింటిపనిలో సహాయపడాలా అని ఆలోచిస్తూ నడుస్తున్న అతను కాస్త ఆలస్యంగా, తనపక్కనే నడుస్తున్న యిద్దరు వ్యక్తుల్ని గమనించాడు. ఎందుకోగాని, వాళ్ళను చూడగానే భయం వేసింది. అడుగులో అడుగు వేస్తూ నడుస్తున్నారు. ఆ భయం శారీరకంకాదు. ఆండర్సన్ బలిష్ఠకాయుడు. ఆ యిద్దరూ తనకన్నా సైజులో చిన్నవాళ్ళు. వయస్సుకూడా 25-26కు మించదు. ఖరీదైన దుస్తులు, హాట్లూ పెట్టుకున్నారు. ఆండర్సన్‌కు, ఆ ఎనిమిళ్ళ దూరమూ చాలా ఎక్కువనిపించింది. ఆ యిద్దర్లో ఒకడు.

'హల్లో, మార్టీ' అంటూ పలకరించాడు.


'సాయంత్రం హాయిగా వుందిగదూ!' అన్నాడు మరొకడు.

'ఏం కావాలి?" అన్నాడు ఆండర్సన్.

"మీ పేరు మార్టిన్ ఆండర్సన్ కదూ?"

"ఐతే?"

"అలా కోప్పడకండి సార్. ఇవన్నీ రొటీన్ విషయాలు. మేం ఎఫ్. బి. ఐ. వాళ్ళం. ఇదిగో కార్డు చూడండి."



ఆండర్సన్ కార్డులు చూశాడు. వాళ్ళిద్దరూ అలా నడిచినప్పుడే అతడికి అవమానం కలిగింది. పోలీసులు తప్ప ఎవరూ అలా అడుగులో అడుగు వేస్తూ నడవరు.

పక్కన బిల్డింగ్ చూసి, 'ఇంకా ఎనిమిదిళ్లున్నాయి' అనుకున్నాడు.

"మీరు రోజూ యింటికి నడిచివెళతారని తెలుసు. ఓ రోజు మీతోపాటు నడుద్దామని యిలా వచ్చాం."

"అంతే. అంతే. ఇంకేమీలేదు. ఏదో కాస్త కబుర్లు చెప్పుకోవచ్చని."

"మార్టీ, మీ దేశభక్తి గొప్పది. ఆ విషయం మాకందరికీ తెలుసు యుద్ధంలో మీరు చేసిన సాహసకృత్యాల రికార్డు మా వద్ద వుంది. అసలు మీ గురించి మాకెంత తెలుసో చెబితే ఆశ్చర్యపోతారు. తెలుసుకోవటం మా వృత్తి. అందువల్లే మాకు బాగా తెలుసు, మీరు మంచి అమెరికన్ పౌరులని."

"మీ గురించి ఎక్కడైనా, ఏదైనా విన్నప్పటికీ అదివశ్లీ మిమ్మల్నడిగి రూఢి పరచుకోవటం మంచిది గదా. ఎందుకంటే, విషయాలన్నీ ఓ పద్ధతిలో పేర్చిచూస్తే తప్ప అర్థం కావు. మాకు జాన్సన్, లెపీ. కర్టిస్‌ల గురించి కూడా తెలుసు. వాళ్లు మీ స్నేహితులుగదూ. వాళ్లు గులాబీ కన్నా ఎరుపని* తెలుసు. ఊం. గులాబీ కన్నా ఎరుపు. అందువల్లే వాళ్ళతో మీకు ఎటువంటి పరిచయ ముందో తెలుసుకోవాలని వచ్చాం. మీరు కూడా గులాబీ కన్నా ఎరుపని అనుకోవటం లేదు. మీరు మంచి అమెరికన్ పౌరులనే మా అభిప్రాయం"

"అందువల్లే ఈ విచారణలో మాతో సహకరిస్తారని ఆశిస్తున్నాం. మాకు చాలా తెలుసు. కాని పూర్తిగా తెలియదు. ఫాక్టరీలోని ఎరుపు మనుషులు ఆ ముగ్గురేకారు. యూనియన్లో యింకా చాలా మంది వున్నారు. బహుశా వాళ్ళ గురించి మీకు బాగా తెలిసి వుంటుంది. ఈ దేశాన్ని ప్రేమించే మీరు, చట్టరీత్యాఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం చేస్తున్న ముఠాలను ఏరివేయడానికి మాతో సహకరిస్తారుగదూ!"

---

*కమ్యూనిస్టులు—(అను)

"మార్టీ, మాతో ఎవరెవరు సహకరిస్తారనుకున్నారు? ఇంచుమించు అందరూ. చాలా మంచి పౌరులు. మాతో సహకరించేవాళ్లు భయపడవలసిన అవసరమే లేదు. వాళ్ల పూర్తి భద్రతకు మాదే పూచీ. దేశభక్తిగల అమెరికన్ పౌరులందరూ మావద్దకు వస్తారు. మేం వాళ్ళను చేరదీస్తాం. ఆహ్వానిస్తాం."

"నిజానికి అలాంటివాళ్లు భయపడాల్సిన అవసరంలేదు. ఎఫ్. బి. ఐ. అంటే కొందరు సందేహిస్తారు. వాళ్లేవేవో కథలు వినివుంటారు. కాని అదంతా వట్టి నాన్సెన్స్. అసలు సంగతేమిటంటే ఎఫ్. బి ఐ. మీ సంస్థ. మీ కోసం, మీ సేవకోసం ఏర్పాటైన సంస్థ."

తమాషా రంగుల్తో ఆకాశంలో చీకటి ముసురుకుంటోంది.

"అదీ సంగతి. అందరు మంచి అమెరికన్ పౌరుల్లాగే మీరుకూడా మాతో సహకరించాలని...."

"గో టు హెల్." అన్నాడు ఆండర్సన్.

"అలా మాట్లాడితే అర్థంలేదు. మనం ఎంతో సన్నిహితంగా మాట్లాడుకుంటున్నాం. కనీసం మాలాగే మర్యాదగా మాట్లాడొచ్చుగా."

"గో టు హెల్."

"మీరు తొందర పడుతున్నారు మార్టీ, వాళ్లు మీకిలాంటి తర్ఫీదు యివ్వటం మంచిదే గాని మేమడిగితేనేమో 'గో టు హెల్' అంటారా? కేవలం అలా అన్నందుకే మేం మిమ్మల్ని 'కమ్యూనిస్ట్'గా ఆరోపించొచ్చు తెలుసా! కాని అప్పుడే మీ మీద అలాంటి ఆరోపణలు చెయ్యటం మా వుద్దేశం కాదు. మీరు 'కమ్యూనిస్టు' కాదని నమ్మటానికి మేం రెడీగా వున్నాం. ముందే చెప్పాంగా, మాకు అన్ని విషయాలూ తెలియవని. మీరు ఔనో, కాదో కాస్త ఆలోచించుకుని మరీ చెప్పండి. ఇదంతా తొందరపడి తీసుకోవలసిన నిర్ణయం కాదు."

ఇవతల్ది పెద్ద దెయ్యం -
అవతల్ది చిన్న దెయ్యం!!!



దెయ్యాలను చూపిస్తా
నయ్యారమ్మనుచు నొక్క ఆసామీ నా
కయ్యా తన కూతుళ్ళను
చెయ్యూపుచు పిలిచి చూపె సిరిసిరి మువ్వా!

— శ్రీశ్రీ

"పోనీ యిలా చూడండి. మేం ఎంతో మర్యాదగా మిమ్మల్ని మాతో సహకరించమని అర్థించాం. ఒక మంచి అమెరికన్ పౌరుడు పరో సాటి పౌరుణ్ణి అలా "గో టు హెల్"! అనగలడా? మీ కమ్యూనిస్ట్ దోస్తులు మీకు 'ఇన్‌ఫార్మర్' వగైరాల గురించి ఏదో నూరిపోసి వుంటారు. నిజాయితీగల అమెరికన్ పౌరులుగా ప్రభుత్వంతో సహకరించే వ్యక్తులందర్నీ ఇన్ఫార్మర్లనీ, స్టూల్‌పిజిన్లనీ అనటం తప్ప ఆ వెధవలకు మరేం చాతనవును! లేక, మీరు మంచి అమెరికన్ పౌరులనుకోవటంలో మేం పొరపాటు చేశామా? మేం పొరపాటు చేశామని చెప్పటంలేదు, చేసి వుంటామేమోనని అంటున్నాం."

"తప్పేమో?"

"తప్పే."

"మీ గురించి నిజంగానే తప్పు అంచనా వేసుకుని వుండొచ్చు. మా అంచనాకు ఆధారమే లేకపోవచ్చు."

"మా అంచనా తప్పు అనుకోవాలంటే మీ మీద కొన్ని బాధ్యతలు వచ్చి పడుతున్నాయి మార్టీ. మీరు పనిచేసే ఫాక్టరీలో కేవలం ట్రాక్టర్లు మాత్రమే తయారు కావు. కొన్ని టాంకుల భాగాలు కూడా అక్కడ తయారవుతాయి. ఈ ఎడ్రసేల్ని నలిపివేసే టాంకులు. మరి మా అంచనా తప్పైతే మీకుద్యోగాలిచ్చిన వాళ్లు కూడా మళ్లీ ఆలోచించుకోవాల్సి వుంటుంది. ఎందుకంటే వాళ్లూ మిమ్మల్ని మంచి అమెరికన్ పౌరులనే అనుకున్నారు."

"ఉదాహరణకు, ఆ ఫాక్టరీ మేనేజర్ని తీసుకోండి. అతడికి మనదేశ వ్యవహారాలంటే ఎంతో శ్రద్ధ. తన ఫాక్టరీలోని ఓ వుద్యోగి ప్రభుత్వంతో సహకరించటంలేదని అతడికి తెలిసిందనుకోండి. అతడు చాలా బాధపడవచ్చు."

"బాధపడటమేనా, వెంటనే వుద్యోగంలోంచి పీకెయ్యవచ్చు."

"మార్టీ, యిలాంటి వాళ్ళకు యింకెక్కడైనా వుద్యోగం దొరుకుతుందనుకుంటున్నావా? ఈ వూళ్లో ప్రభుత్వంతో ఏదో ఓ సంబంధంలేని ఫాక్టరీయే లేదు. హీరో కావటం బాగానే వుంటుంది. కానీ మీ పిల్లలు ఆకలితో ఏడిస్తే ఏమిస్తావు?"

"ఛ. ఛ. మార్టీ అలాంటి వాడు కాదు."

"నేనూ అలా అనుకోవటం లేదు. మార్టీ అంటే నాకెంతో యిష్టం. మార్టీ నూటికినూరుపాళ్లు మంచి అమెరికన్ పౌరుడనే నా నమ్మకం. మార్టీ, అదీ సంగతి. అందుకే మాతో సహకరించమని అడుగుతున్నాం. అర్థమైందా?"


'గోటు హెల్, వెళ్లండి. వెళ్లిపోండి." అంటూ అరిచాడు ఆండర్సన్.

ఆ యిద్దరు పోలీసుల మొహాలూ మారిపోయాయి. వారి మర్యాద బురఖా చిరిగిపోయింది. మూతులు బిగించి, తీవ్రంగా చూస్తూ.

"ఓకే మార్టీ"

"నువ్వు కోరుకున్నట్టే కానీ మార్టీ" అంటూ వెళ్లిపోయారు. ఒకే ఎత్తు. ఒకే సైజు. ఒకే నడక తీరు. కవలపిల్లల్లా వున్నారిద్దరూ.

ఆండర్సన్ యిల్లు చేరుకున్నాడు. ఆ ఇంటి కప్పటికి తొమ్మిదివేల డాలర్లు కట్టాడు. నెలకు తొమ్మిది వందల డాలర్లు-ఇల్లు తన స్వంతమయ్యేదాకా, పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయ్యేదాకా, వృద్ధాప్యంలో తనూ భార్యా సుఖంగా గడప గలిగిందాకా-స్వేచ్ఛా ప్రియులు వలస వచ్చిన ఆమెరికా తన కిచ్చిన కానుక. ఇదీ తన యిల్లు. తను రోజూ సాయంత్రం నడిచి చేరుకునే యిల్లు అతనికి యింటికి నడవటం చాలా యిష్టం. ✱





కోటలాంటి యిల్లు-

కోటగుమ్మంలాంటి గేటు-

ఆ గేటుముందు రహదారి పడవలాంటి పాల పిట్ట రంగు కారొకటి ఆగి, సన్నగా, గంభీరంగా కేకేసేక, ద్వారపాలకళ్లాంటి గూర్ఖా హడావుడిగా పరుగెత్తుకొచ్చి గేటు తీసేడు. వీటన్నిటికీ అధిపతి-(గూర్ఖాతో సహా) సభాపతి వెనక సీట్లో వెల్లింగ్టన్ ప్రభువులా కూర్చొని వుదగా-ఆలస్యంకాని ఆమాత్రం ఆలస్యానికే "క్షమించ"మన్నట్టు ఒంగి ఒంగి సలాం చేసేడు గూర్ఖా. "అలాగే" అన్నట్టు అద్దాల్లోంచి అవతలివాడికి అవుపించని సభాపతిగారు తల పంకించేరు.

కారు ముందుకు సాగిపోయింది.

"అల వైకుంఠపురమ్ములో" అన్నట్టు-ఆ సుందర సౌధంలో అమూల్య సమశీతల శయనాగారంలో-ఛేజ్ నవల్లో దాక్కున్న జేమ్స్ బాండ్‌లాంటి ఓ అందాల యువకుడి ఫోటోని తాదాత్మ్యంతో తిలకిస్తో-"హౌ సిల్లీ యు ఆర్" అనుకుంటోన్న గాయత్రి కొత్తకారు పిలుపు విని, వులిక్కిపడి లేచి, లేడిలా గెంతి క్రిందికి జారింది. జారి, కారుముందుకు చేరి

"హౌ నైసిటీజ్, డాడీ!" అంది.

డాడీగారు అప్పటికే కిందికి దిగి ఆమె కాంప్లిమెంటుకు 'కారు' నవ్వు నవ్వి, అంగ్లవాత్సల్యంతో ఏకైక పుత్రిక బుగ్గలు ముద్దులాడి-ముందుకు నడిచేరు.

వైరుధ్యాలు

కె. కె. మీనన్

సభాపతి ఏ సభకీ అధిపతి కాడు-కానీ, అన్ని సభల్లోనూ అతని మన్నిస్తుంటారు.

సభాపతి ఒక్క పారిశ్రామిక ప్రముఖుడు మాత్రమే

"ఏదేశానికో మహారాజు కావల్సినవాడు. ఈ దేశంలో భాగ్యవంతుడై పుట్టేడు" అని ఆశ్రిత జనం పొగిడినప్పుడు-

-ఏదేశానికో ప్రభువుగా పుట్టేకంటే, యీ దేశంలో భాగ్యవంతుడై పుట్టడం శతకోటిరెట్ల అదృష్టం, అని విశ్వసించిన సభాపతి-

"నాకంతటి అదృష్టమా!" అని సవినయంగా నవ్వేసోవుంటాడు.

రాజులున్న దేశాల్లో రాచరికాలు కూలిపోయి, ప్రజాప్రభుత్వాలు అవతరిస్తోన్న తరుణంలో, నిరపాయకరమైన యీదేశపు రాచరికం ఎంతటి సుఖదాయకమో ఆయన ఒక్కడికే తెల్సు.

కాని-

ఇటీవల ఓ పెద్ద రాజకీయ భూకంపం పుట్టి పాత ప్రభుత్వం పతనమై, కొత్త ప్రభుత్వం అధికారాన్ని హస్తగతం చేసుకుంది. స్వాతంత్ర్యం వచ్చేక ప్రప్రథమంగా జరిగిన యీ దురాగతానికి ఆయన అంతగా దిగులు పడేవాడు కానేకాదు. కాని, వాళ్లు ఎన్నికల ప్రణాళికల్లో పరిశ్రమల్ని జాతీయం చేస్తామనీ, గుత్తవ్యాపారాన్ని గట్టుగా చేజిక్కించుకుంటామనీ ఏవేవో పరమ ప్రజా వ్యతిరేక ప్రమాణాలు చేసేరు. ఎన్నికల ప్రమాణాలు తాగినవాడి ఒట్టులాంటివని ఆయనకు ఎంత నమ్మకం వున్నా, కొత్త



బిచ్చగాడు పొద్దెరగడని భయపడి తన దేవేంద్ర పదవికి పతనం తప్పదనుకుని-

-ఛీ, ఎందుకొచ్చిన ప్రయాస! ఉన్నది ఒక్క కూతురు. ఉన్నదంతా ఖర్చుపెట్టేద్దాం, అనుకున్నాడు.

అందుకు నాందిగా, నాలుగు లక్షలు పెట్టి 'కేడిల్లాక్' కారు కొన్నాడు.

o o o

అసలే అందమైన ఆ యింట్లో మరింత అందంగా వుంది ఆ హాలు.

అసలే అందమైన పిల్ల గాయత్రి. అధునాతనంగా అలంకరించుకుని, మెరుపు తీగలా మరింత అందంగా వెలిగిపోతో, ఆ హాలు మధ్య ఖరీదైన టేబిలు మీద వెలుగుతోన్న పద్దెనిమిది కొవ్వొత్తుల్ని అనాయాసంగా వూదేసింది.

చప్పట్లతో హాలంతా మార్మోగిపోయింది.

డాడీగారో మినీ వుపన్యాసాన్ని వ్యాసించి, కూతుర్ని ముద్దుచేసి, తాళం చెవి చేతికిచ్చేడు.

"ఏమిటి డాడీ..." అనడిగింది అందమైన అమాయకతతో.

"హా నైసీటీజ్" అన్నాడు డాడీనవ్వుతో.

"ఓహ్హో! వాట్ ఎ కాస్ట్లీ గిఫ్టీజ్ డాడీ!!" అని డాడీని మెచ్చుకుంది గాయత్రి.

సంబరం, సందడి తగ్గేక చేతిలోని తాళాలు చూసుకుంటు, కార్లో తన పక్కన కూర్చోబోయే వ్యక్తి గురించి ఆలోచిస్తూ—అలవోకగా నవ్వుకుంది.

నోటీసీయక ముందే సమ్మెను పని గట్టేయగల సభాపతి—

"అం... నాకు తెల్సలే!!" అన్నాడు.

"ఏంటి డాడీ...."

"కొత్త కార్లో పక్కన జావని వూహించుకుంటున్నావు కదూ"

నాన్నగారి సిద్ధయాలన్నీ అలాంటి మాటల్లోనే మనుగడ వేసుకున్నాయని ఎరిగిన గాయత్రి చేతిలోని తాళాలు, తెలుగు సినిమాల్లోలా అప్రయత్నంగా జారి కింద పడ్డాయి. తన జేమ్స్ బాండ్, క్రికెట్ హీరో కమలాకరం కళ్ళల్లో మెదిలి, కన్నీళ్లొచ్చాయి గాయత్రికి.

o o o

సందడంతా సద్దుమణిగిపోయింది.

సడెన్‌గా కరెంటు పోయి, మైకుసెట్టు మూగపోయినట్టు ఇల్లంతా నిశ్శబ్దం.

పని పని.... పని, ఉదయం నించీ ఒక్కటే పని. ఒళ్ళు హూనమైపోయింది మంగికి. అదేదో అయిపోయిందనుకుని తోటలో ఓ మూలగా వున్న సర్వెంట్ క్వార్టర్ వైపు నడుస్తున్న మంగి చెయ్యిని, మరో చెయ్యి లాగింది. అదెవరిదో మంగికి తెల్సు. అది లాగుతోన్న వైపే నడిచిపోయింది.

అంతా అయిపోయేక-

"ఇలాగ ఎంత కాలం సినబాబో" అనడిగింది మంగి.

"ఏదీ-ఆ డబ్బుకాస్తా చేతికి రానీ, వుడాయించేద్దాం" అన్నాడు లక్ష్మీపతి.

ఆ తర్వాత అతను చెప్పే మాటలన్నీ గుర్తొచ్చి.

—తన జీవితం ఎంత హాయిగా వుంటుందో! తనూ కార్లో తిరగొచ్చు, బంగ్లాల్లో బతకొచ్చు, తన పిల్లలు— ..

అలా మధురంగా ఆలోచించుకుంటూ కొంపకి చేరి, మరింత మధురమైన కలలు కంటూ నిద్దరోయింది మంగి.

o o o

నూతన ప్రభుత్వం పదవీ స్వీకారం చేసేక కార్మికులంతా పండుగ చేసుకున్నారు. ఇంత వరకూ తమకు ప్రతికూలంగా వ్యవహరించిన నాయకులే యిప్పుడు ప్రభుత్వాన్ని చేపట్టేరు.

ప్రేమకి నిర్వచనం అడిగావ్!
మరి పారిపోతావేం??



ప్రేమ ప్రేమను ప్రేమించడాన్ని ప్రేమిస్తుంది.
ప్రేమ ప్రేమను ప్రేమగా ప్రేమిస్తుంది
ప్రేమను ప్రేమించిన ప్రేమ ప్రేమచే ప్రేమించబడిన
ప్రేమను ప్రేమిస్తుంది! !

— శ్రీశ్రీ

ఎన్నాళ్ళగానో ఎదురు చూసిన కార్మిక రాజ్యం యిప్పుడు సంక్రమించింది.

"కామ్రేడ్స్...

ఎంతో కాలంగా ఎదురు చూస్తోన్న ఈ శుభసమయం నేడు మనముందుకు వచ్చింది. కార్మికులంతా కలలుగన్న బోనసు.... యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యం, పని గంటలలో తరుగుదల, జీవన పరిస్థితుల్లో మెరుగుదల-ఇవన్నీ మనకిప్పుడు అందుబాటులోకి రానున్నాయి. కార్మికలోకానికి అనుకూలమైన పథానల్ని చేపట్టి అమలుపరిచే ప్రభుత్వాన్ని ప్రసాదించిన భారత ప్రజలకి మనం ఎంతగానో ఋణపడివున్నాం."

ఇట్లా కార్మికనాయకులు వుపన్యసించేరు. తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర వేడుకలూ జరిగేయి. పాడిన ప్రతి పాట

లోనూ, ఆడిన ప్రతి నాటకంలోనూ తమకు కలిగిన విజయాన్నే సూచించటం జరిగింది.

ఈ విజయోత్సాహానికి మరింత క్రుంగిపోయేడు సభాపతి.

"లాభం లేదురా లక్ష్మీపతీ! ఇహ పిల్లని అదుపులో వుంచలేం. ఎనకు మనంగా యీ పరిశ్రమల్నీ, వ్యాపారాన్నీ ప్రభుత్వానికి అప్పగించేసి ఉన్నది భద్రపర్చుకోవటం మంచిది" అని వాపోయేడు.

"అంత దిగాలు పడిపోతావేం మామయ్యా! చేప నీటిలోనే యీదుతుందిగాని నేలమీద నడవలేదు. వ్యాపారంలో రెండుచేతులా ఆర్జించగలిగే నీవు తీరుబాటుగా కాలయాపన చేయలేవు" అని వోదార్చేడు లక్ష్మీపతి.

అది ఓదార్పుకాదు. కర్తవ్య బోధలా తోచింది సభాపతికి. అయినా–

"ఈ ప్రభుత్వంతో, పిల్లతో వేగలేంరా..." అన్నాడు మళ్లీ.

"వీళ్ళు స్వర్గాన్నుంచి వూడిపడ్డారనకుంటున్నావా మామయ్యా....ఇవన్నీ ఒక గూటిలోని పిట్టలే, కాకపోతే గొంతు మార్చాయి. పోనీ అదికూడా చూద్దాం... పెట్టుబడిని అటు మళ్లిస్తే పోలా..."

మేనల్లుడి సలహా సంజీవినిలా పనిచేసింది.

అవును. తీరుబాటుగా తగలేసేకంటే, వ్యాపారంలోనే పోగొట్టుకుందాం, అనుకున్నాడు.

అసలు పోగొట్టుకున్నది ఏమీ లేదు. రాబట్టుకున్నదంతా ప్రభుత్వ సబ్సిడీలతోనే.

ఒక గ్రామంలో పీచు పరిశ్రమ... మరో పల్లెలో గడ్డితో కాగితం తయారుచేసే ఫాక్టరీ.... నెలకొల్పేడు. కట్టుబాటుకాని వ్యవసాయ కూలీలు కారు చవగ్గా ఇంధనం అయేరు సభాపతి పరిశ్రమకి. ఆ జడులులేవు. అంతి అంతకంటే లేవు. అయిదేళ్ళలో అక్కడ సంపాయించలేని లాభాల్ని రెండేళ్లలో ఇక్కడ గుంజుకున్నాడు.

"ఎంత హాయిగా వుందిరా లక్ష్మీపతీ! కార్మిక సమస్య లేదు. సమ్మెలూ గిమ్మెలూ లేవు ...నీ బుర్ర బాగానే పనిచేసిందిరా..."

మేనల్లుడి తెలివిని నిర్ద్వంద్వంగా అంగీకరించేడు. అప్పట్నుంచే లక్ష్మీపతి సభాపతికి పెద్ద అండయి తన నూతన వ్యాపారసంస్థకి "పతి అండ్ పతి" అని నామకరణం చేసేడు.

ం ం ం

"లాభం లేదు లల్లీ! డాడీ వరస! చూస్తోంటే ఇదేం జరిగేటట్టు లేదు."

తన నేస్తానికి పరిస్థితి చెప్పుకుని వాపోయింది గాయత్రి.

"ఏం....ఎందుకని?" అని ప్రోబింగ్ మొదలెట్టింది లలిత.

"ఆయనకు దరిద్రం అంటే పరమ అసహ్యం"

"మరి మీబావ...."

"డబ్బు లేకపోయినా బాంధవ్య బంధనం వుందిగా... పైగా ఈ మధ్య పార్టనరు కూడా అయ్యేడు"

"అసలు నాకు తెలీక అడుగుతాను... కమలాకరం అంటే ఎందుకంత మోజు? అందగాడనా?"

"కాదు...."

"క్రికెట్ ఆటగాడనా?"

"అవును..."

"అయితే ఏం వొరిగిందట?"

"అతనితో దేశాలన్నీ తిరిగి రావచ్చు"

పగలబడి నవ్వింది లలిత.

"ఏం గొప్ప జోకు జోకావే! విదేశాలు తిరగటానికి నీకు క్రికెట్ ఆటగాడు కావాలా? మీనాన్న తల్చుకుంటే హనీమూన్‌కు ప్రపంచమంతా తిప్పేయలేడూ!"

ఇంత కారు చవక సత్యం తనకెందుకు తెలియకపోయిందా అని కాస్సేపు విచారించి,


–ఆల్రైట్ అతన్ని వదిలేస్తాను.. మరి తనలో ఘనీభవిస్తోన్న అతని రక్తం...

'చూడు కమలాకరం....నిన్ను ఒక్క రోజులో కోటీశ్వరుణ్ని చేసేయగల్ను' అని అతన్ని నమ్మించిన గాయత్రికి యిప్పుడు గొంతుకో పచ్చి వెలక్కాయగా వుంది.


అతను దరిద్రుడనే మాట గుర్తుకరాగానే మరింక ఆలోచించలేకపోయింది గాయత్రి. పరిష్కారాన్ని కాలానికే వదిలేసి హాయిగా వుండిపోయింది.

ం ం ం

ఉన్నట్టుండి ఉప ఎన్నిక రూపంలో అదృష్టం తన్నుకొచ్చింది సభాపతికి. అధికార అభ్యర్థి ఎన్నికల ఖర్చంతా తనే భరించి ఒక మెంబర్ని గెల్చుకున్నాడు. అతని సాయంతో మరింత మంది ప్రజాప్రతినిధుల్ని కొనుక్కుని ప్రభుత్వంలో ముసలం పుట్టించేడు.



కవితకి కార్టూన్ :



ఆశలకేం అనంతం !
ఆకాశం నా గుడారం! !

— శ్రీశ్రీ

అయిదేళ్ళు నిండక ముందే ప్రభుత్వానికి ఆయువు మూడింది.

ం ం ం

ఇటీవల లక్ష్మీపతి దర్శనం అరుదై పోయింది మంగికి. చాలా కాలం తర్వాత ఓనాటిగా డైనింగ్ హాల్లో చిక్కేడు. అతను తేని వెళ్లబోతుంటే, టేబిలు తుడుస్తూ—

"సిన్నమాట సినబావో..." అన్నది మెల్లిగా.

చేయి తుడుచుకుని ఒచ్చి నిలబడ్డడు లక్ష్మీపతి.

"నేను అమ్మను కాబోతున్నాను" అన్నది.

షాక్ తిన్నట్టయింది లక్ష్మీపతికి. నిల దొక్కుకుని ఆలోచించేడు.

తర్వాత—

"ఎవరికి?" అనడిగేడు నిబ్బరంగా.

"నీ బిడ్డకి...."

చెంప చెళ్ళుమంది కళ్ళు తిరిగి కింద పడబోయి టేబిలు పట్టుకు నిలబడింది మంగి.

"ఎంత ధైర్యమే నీకా మాటనటానికి? ఉన్నవాళ్ళ దగ్గర డబ్బు గుంజటానికి మీకు ఉగ్గుపాలతో అబ్బిన విద్య యిది" అని మళ్ళీ కొట్టాడు.

"శభాష్...నాకు నచ్చేవురా లక్ష్మీపతీ...." అంటూ లోపలి కొచ్చేడు సభాపతి.

ఆకస్మికమైన అతని ఆగమనానికి ఇద్దరూ నిశ్చేష్టులయేరు.

"నా వ్యాపారానికి సరైన వారసుడివి నువ్వేనని నా కెప్పుడో తెల్సురా....కాని, ఇంత వరకూ నీ ప్రతిభకి సరైన రుజువు దొరకలా.. తప్పు చెయ్యటం తప్పు కాదు. దాన్ని గప్‌చుప్ చేయకపోవటం పెద్ద తప్పు. ఊ...దాని మొగాన ఎంతో కొంత తగలేసి వెంటనే తరిమెయ్"

ఈ మాట విన్నాక మంగి తలొంచుకు బైటికెళ్లి పోయింది.

"ఎందుకు దాని మొగాన డబ్బు తగలెయ్యట? వాళ్లకిది అలవాటే"

"లక్ష్మీపతీ, బొంకుడు మంచి లక్షణమే.కాదనను కాని నిజం తెల్సిన చోట అది మంచిది కాదు. తెల్లవారగానే వ్యవహారం చక్కబెట్టు" అని వెళ్లిపోయేడు సభాపతి.

ం ం ం

లక్ష్మీపతిని కాదు, గాయత్రిని....కాదు, కాదు, ఇద్దర్నీ అలా ఒదిలేయటం యిహ మంచిది కాదనుకున్నాడు సభాపతి.

గాయత్రి అవునన లేదు.

లక్ష్మీపతి కాదనలేదు.

అయినా ఆ యిద్దరికీ పెళ్లయిపోయింది.

మంగి వ్యవహారం గాయత్రికి తెలీదు.



కమలాకరాన్ని లక్ష్మీపతి అసలు ఎరగనే ఎరగరు.

అందుకే వాళ్ళది ఆదర్శ దాంపత్యం

○ ○ ○

అదే కోట లాంటి యిల్లు.

అదే కోటగుమ్మంలాంటి గేటులోంచి మహారాణి పడవలాంటి కారు సన్నగా జారి, పోర్టికోలో ఆగి, లలితంగా పిల్చింది. పిలవడమే తడవుగా "డాడీ" అంటూ అమెరికా ఐశ్వర్యంలాంటి ఓ అబ్బాయి పరుగెత్తుకొచ్చేడు. అక్కడే అందుకే నిరీక్షిస్తోన్న నౌకరు కారు డోరు తీయగా, దాని అధిపతి లక్ష్మీపతి గారి కలలంత నిరాడంబరంగా నిర్మలంగా కారు దిగి, ఎదురొస్తోన్న కొడుకుని ప్రజాస్వామ్య సోషలిజంలా పట్టుకుని రెండడుగులు వేయకముందే ఇరాన్లో విప్లవంలా ఎదురైంది గాయత్రి.

○ ○ ○

అదే నగరం,-అంచులు చించేసి, ఎల్లలు తుడిచేసి విశృంఖలంగా విస్తరించుకుంది నలువైపులకీ. ఆ నగరానికి ఓ చివర పెద్ద ఫేక్టరీ ముందు అడుక్కుంటోంది వయస్సుమళ్ళిన ఓ ముసిల్ది. ఎర్రటి పొడవాటి కారు, ఆ ఫేక్టరీ గేటుముందు ఆగగా అందులోని వ్యక్తిని ఆసక్తిగా చూస్తోంది.

"అమ్మా ఆకలే..." అన్నది చెయిపట్టుకున్న బిడ్డ.

అందుకు సమాధానం దొరక్క, కార్చటానికి కన్నీళ్ళు లేక, ప్రజాస్వామ్యంలా పొడిగా ఏడ్చింది ఆ తల్లి. ✳

శ్రీశ్రీ పదబంధ ప్రహేళిక

ఈ సంచికలో శ్రీశ్రీ గారి పదబంధ ప్రహేళిక ప్రచురించలేకపోతున్నందుకు చింతిస్తున్నాము. శ్రీశ్రీ గారు విదేశాలలో వున్నారు. జనవరి, ఫిబ్రవరి సంచికలలో ప్రచురించిన ప్రహేళికలు శ్రీశ్రీ గారు లండన్‌నుంచి పంపినవే.

ఫిబ్రవరి ప్రహేళిక సమాధానాలూ, విజేతల పేర్లూ యిక్కడ ప్రచురిస్తున్నాము.

—ఎడిటర్

ఫిబ్రవరి 1981 ప్రహేళిక సమాధానాలు

అడ్డం: 1. జిన, 3. ఓశి, 5. ఉన్నాడు, 6. పంకజం, 8. తిప్ప, 9. మగడు, 11. పస, 13. భారమా, 15. వినతి, 16. నల్లబజారు, 17. విరసం, 19 పునీతం. 22. నావ, 23 గిన్నెలు, 25. కాజా, 26. దేవుడు, 28. లులాయం, 30 లాగు, 31. లువి.

నిలువు: 1. జిన్నా, 2. నడుమ, 3. ఓ పండు, 4. శిక, 5. ఉప్పర, 7. జంపన 8. తిఖా, 10. గడబన్నె 12. సతి, 14. మానసం, 15. విరవు, 17. వినా, 18 రవడే 20. నికాయం. 21. తంజా, 23 గొడుగు, 24. లులులు, 27. వులా, 29 లాలి.

ఫిబ్రవరి '81 విజేతలు

1. ఆర్. కమల, హసన్‌పర్తి. 2. ఎన్. రామశాస్త్రి, వరంగల్ 3 బి ఆర్. కృష్ణమూర్తి, టెక్కలి.

బహుమతి మొత్తం రు 100 విజేతలు ముగ్గురికీ సమానంగా పంచబడుతుంది.

[గత సంచిక తరువాయి]

శ్రీ రావుగారి ఇంట్లో మరో పెద్ద జీతగాడు వుండడంచేత, వాడి పేరూ సుబ్బాయే అవడంచేత చిన్న జీతగాడ్ని రావుగారు "చిన సుబ్బాయి" అనీ, "చిన్నోడా" అని పిలుస్తా వుంటారు.

చిన్న జీతగాణ్ణి ఇంటికి తరిమి, శ్రీ రావుగారు భూషయ్యను వెంటపెట్టుకుని తమ ఇటుక ఆము దగ్గరకు వెళ్లారు. ఇటిక ఆమూ, గుడిశలు కలయతిరిగి పరీక్షిస్తుండగా, ఆము దగ్గర కాపలావాడు చేతులు నలువుకుంటూ వచ్చి రావుగారిముందు నిలబడ్డాడు.

"ఏంరా? అప్పుడే కూలీలంతా వెళ్ళిపోయారా?" అన్నాడు యజమాని.

ఇటిక ఆమునుంచి కాలిబాటన కొంతదూరం నడచి రోడ్డు ఎక్కి ఊరువైపుకు రావుగారు నడుసున్నారు. వెనక భూషయ్య మౌనంగా నడుస్తున్నాడు.

రావుగారికి వళ్ళంతా చిరాగ్గా వుంది. మట్టి, చెమటతో తడిసి చొక్కా మురికిగా వుంది. చల్లటి గాలి ముఖానికి తగలగా రావుగారికి ఆనాటి శ్రమదాన మహోత్సవ సంఘటనలన్నీ ఒక్కొక్కటే కళ్ళముందు తిరగసాగాయి. శ్రమించి పనిచేయడంలో వున్న గౌరవం, ఆత్మతృప్తి రావుగారికి నరనరాన ఎక్కుతోంది.

"భూషయ్యా!" అన్నారు రావుగారు.

"అయ్యా!" అన్నాడు అణకువతో భూషయ్య.

శ్రీవారి శ్రమదానం

'వసుశ్రీ'

"ఆ! ఇప్పుడే దొరగారు! వెళ్ళిపోయారు?"

"పోతారు! పోతారు! ఒక్కొక్కళ్ళకూ వళ్లు బలిసిపోతూందిరా. ఎవర్ని చూసినా పనికి వళ్ల దాచుకునేవాడే కనబడుతున్నాడేంరా? ఊర పొద్దు కూకలేదు; అప్పుడే వెళ్లిపోయారు!"

"ఇవ్వాళ కొత్తేముందిలే బాబుగారూ! మామూలు వేళకే వెళ్ళారు కూలీలంతా!" అన్నాడు భయం భయంగా.

"మామూలు వేళట! ఒళ్లు కొవ్వెక్కి చస్తున్నారు. రేపట్నుంచి కూలీలంతా తెల్లవారి ఏడుగంటలకు రావాలి; మళ్ళీ రాత్రి ఏడుగంటలదాకా పోవటానికి వీల్లేదని చెప్పు!" అని రావుగారు గిర్రున వెనక్కి తిరిగారు.

"దేశంలో సోమరిపోతులు ఎక్కువయిపోతున్నారు భూషయ్యా!"

"అవునవును!" అని తల ఊగించాడు భూషయ్య. రావుగారి మాటలు అర్థంకానపుడు అవునని తలకాయ ఆడించడం భూషయ్యకు అలవాటు.

"పనంటే ఎవడికి గౌరవం వుంది చెప్పు!"

"అవునండీ! ఎవడికి గౌరవముంది?" ప్రశ్నార్థకం గుర్తులా ముఖం పెట్టాడు భూషయ్య.

"ఆ కూలీలు వున్నారే చూడూ! అంతా వళ్లు దాచుకునే రకమే! పనిలోకి వచ్చిందగ్గర్నుంచీ పొద్దెప్పుడు వాలుతుందా, కూలీ డబ్బులు ఎప్పుడు గుంజుకుపోదామా అన్న

ఆలోచన తప్ప పనిమీద ధ్యాసే లేదుగదా వీళ్ళకు?". రావుగారి పాదరక్షలు రోడ్డుమీద దుమ్ము లేపుతున్నాయి. గాలివాటుకు ఆ దుమ్ము రావుగారి వెనక నడుస్తున్న భూషయ్య ముఖాన్ని తాకిపోతోంది.

"అవును! అవును! యీ రోజుల్లో వళ్ళొంచి పనిచేసే కూలోడెవడండీ! అందుకే గాదుటండీ మనం యీ శ్రమదానోద్యమాన్ని నడపడం?" అంటూ భూషయ్య ముఖం మీదకు వస్తున్న దుమ్మును తప్పుకోవడానికి, రావుగారికి ఒక పక్కగా నడవటానికి ప్రయత్నం చేశాడు.

"ఆఁ! అవును భూషయ్యా! యీ శ్రమదానోద్యమం బాగా ముందుకు పోతే యీ మాలోళ్ళందరికీ బుద్ధొస్తుందనుకుంటా!"

"బుద్ధిరాదుమరీ! ఇందాక మట్టిపల్లికమోస్తున్న మిమ్మల్ని చూచినవాడెవడికైనా బుద్ధొచ్చి తీరాలి! జనం ముక్కుమీద వేలేసుకుని నుంచున్నారంటే నమ్మండి!" అన్నాడు.

రావుగారి హృదయం డన్‌లప్ ట్యూబులా ఉబకసాగింది.

"అసలు తేడా అక్కడే వుంది భూషయ్యా! కూలీడబ్బులకోసం పనిచేసేవాడికీ, ఫలితం ఆశించకుండా పనిచేసేవాడికి భేదం అదే! శ్రమదానం చేయటం అంటే ఆ మనిషికి ఒక ఆశయమూ, త్యాగబుద్ధి ఎన్ని వుండాలి మరి! పావలా డబ్బుల కాసించి పనిచేసేవాడికీ, శ్రమను త్యాగం చేసేవాడికీ అసలు పోలికేమిటి భూషయ్యా."

"అంతే! అంతే! అదిసరేగాని మీరు గమనించారో లేదో? మట్టి మోస్తున్నప్పుడు మిమ్మల్ని చూసి మంత్రిగారు చిత్తయిపోయారంటే నమ్మండి! ఈసారి అసెంబ్లీ టికెట్ తమకు ఖాయం." అన్నాడు భూషయ్య ముసిముసి నవ్వులు నవ్వుతూ.

"వెధవది ఎసెంబ్లీ టికట్ ఏమిటి భూషయ్యా! పార్లమెంటుకు పార్టీ టికట్ ఇవ్వమంటే మాత్రం కాదంటారా ఏమిటి?"

"అవునవును! పార్లమెంటేమిటీ—" ఆ తర్వాత ఏమనడానికి తోచక భూషయ్య తికమక పడ్డాడు.

రావుగారు భూషయ్య భుజం తట్టుతూ 'బెక బెక' నవ్వేరు. రావుగారు, భూషయ్య వస్తూంటే, వీధి అరుగులమీద కూర్చున్న వాళ్లు రావుగారిపట్ల మర్యాద సూచకంగా లేచి నిలబడ్డారు.

రావుగారు తమ ఇల్లు సమీపించగానే ఆగి "భూషయ్యా! ఇక నువ్వెళ్ళు! ఆఁ! చెప్పటం మరిచాను! రేపు ఉదయం ఒకసారి ఇటిక ఆము దగ్గరకెళ్ళి చూడు! నెలరోజుల్నుంచీ ఏభై వేల ఇటిక కూడా ఎత్తలేకపోయారు?" అన్నాడు.

"రేపట్నుంచీ కూలోళ్లను నడుంమీద తన్ని పనిచేయించనూ! ఈసారి ఇటుక పౌరుగూరు తీసుకుపోయి తక్కువ ధరకు అమ్మాల్సిన పనిలేదులేండి! ఇప్పుడున్న ఇటుకంతా దేవాలయం కట్టడానికి సరిపోతుంది! వసూలయిన డబ్బులో సగానికి పైగా మన ఇటుక ఖాతాలోనే జమ! ఇంకేం?"

"సరే? నువ్వెళ్ళిరా!" చిరాగ్గా అంటూ రావుగారు ఇంట్లోకి దారితీశారు.

"మరి! మరి! మీటింగుకు అయిన ఖర్చులూ—" సాగదీసాడు భూషయ్య.

లోపలకు వెళ్తున్న రావుగారు టక్కున ఆగి వెనక్కు తిరిగి భూషయ్య ముఖంలోకి చూశారు.

"ఆఁ! ఆఁ! అదేనండీ! పల్లెలోనుంచి కొంతమందిని రోజుకూలీమీద పిలిపించాంగా!"

"రేపు చూద్దాంలే! ఇప్పుడేం తొందర! అసలు నీకు సమయమూ సందర్భమూ తెలియకుండా పోతూంది!" రుసరుసలాడుతూ అన్నారు రావుగారు.

"ఇటికాం కూలీ ఖర్చులో రాయమంటారా?"

"నీ కన్నీ చెప్పాలయ్యా! ఆ మాత్రం తెలియదూ?" అని విసవిసా లోపలికి వెళ్ళారు రావుగారు.

రావుగారు ఇంటికి చేరేసరికి ఎనిమిది గంటలయింది. వరండాలో వున్న పడక



కుర్చీలో జారగిలబడి— "ఒరే చిన్నోడా?" అని కేక వేశారు. పొయికింద కందికట్టె మంట పెడుతూన్న సుబ్బాయి పరుగెత్తుకువచ్చాడు.

"నీళ్ల కాగినయ్యా" అడిగాడు యజమాని.

"ఆఁ! బాగినయ్ దొరగారు! నీళ్లతోడ మంటారా?" అన్నాడు జీతగాడు.

"తోడుదువుగానిలే! ముందు నువ్వుపోయి మంగలాణ్ణి పిలుచుకురా? తలంటి పోసుకోవాలి!"

"ఇప్పుడా అండీ?"

"మరింకెప్పుడనుకొన్నావురా? పో! తొందరగా పోయి మంగల్ని పిలుచుకురా."

నీళ్ళ కాగుకింద నాలుగు కట్టెలు తోసి చిన్నోడు మంగలి రత్తయ్య ఇంటికి బయలుదేరాడు!

పడక కుర్చీలో అలసిపోయి పడుకొన్న రావుగారికి వళ్ళంతా విరగొట్టినట్టుంది! కళ్ళు చింత నిప్పుల్లా మండిపోతున్నాయి. [బాగా వేడి చేసినట్టుంది. మాడు కూడా మంటగా వుంది. "వెధవ పల్లెక!" అనుకొన్నారు రావుగారు.

ఈ పూట వళ్లు పట్టించుకోకపోతే నెప్పులు తగ్గవే! గిన్నెడు ఆముదం తలకూ, అరికాళ్ళకూ అరిచేతులకూ మర్దన చేయించి గంగాళం వేన్నీళ్ళు పోసుకుంటే హాయిగా నిద్రపడుతుంది! కష్టేఫలి అని ఊరికనే అన్నారా పెద్దలు? మహానుభావుఁడు?

శ్రమదానోద్యమాన్ని కనిపెట్టినందుకు చెప్పుకోవాలి? రెండు చేతులు ఎత్తి దణ్ణం పెట్టొచ్చు.

వెనగ్గా వచ్చి నుంచొన్న శ్రీమతి అడుగుల సవ్వడికి రావుగారి ఆలోచన సరిగా కాలని ఇటుకలా విరిగిపోయింది.

"ఏవండీ, మట్టి తెగ మోసేరంట్గా?" కిలకిల నవ్వుతూ శ్రీమతి అన్నది.

లోలోపల ఆనందిస్తో— "ఎవరు చెప్పారూ!" అన్నారు రావుగారు దీర్ఘం తీసి.

"ఇంకెవరు? మన చిన సుబ్బడు! చెప్పి విరగబడి నవ్వాడు వాడి దుంపతెగ!" అని పకపకా నవ్వింది శ్రీమతి. శ్రీమతి నవ్వులో తనూ కలిసి నవ్వారు రావుగారు.

రొప్పుకుంటూ, రొజుకుంటూ పరుగెత్తుకొచ్చిన చిన జీతగాణ్ని చూసి రావుగారు అన్నారు.

"ఏడిరా? రత్తాయీ?"

"ఇంటి దగ్గర లేడండీ! పొలం పోయాడంట! వాడి పెళ్లాం చెప్పింది!" అన్నాడు చిన సుబ్బాయి.

"అన్నీ దొంగ వేషాలు! వాడు ఇంట్లో వుండే అలా చెప్పించి వుంటాడు. పనంటే సరి! ప్రతివాడు ఏదో వంకపెట్టి తప్పుకుంటాడు!" అంటూ రావుగారు లాల్చీవిప్పి అవతల పారేసి ముక్కాలి పీటమీద కూర్చున్నారు.

"నీళ్ల తోడమంటారా?" అడిగాడు చిన్నోడు.


"ఆముదం సీసా తీసుకు రారా! నువ్వన్నా అంటుదువుగానీ! ఏం చేసాం మరి ఆ రత్తి ముండా కొడుకుని యీ సారి ఇంటి చాయలరానియ్! మక్కెలు విరగతంతా!" రావుగారికి మంగలి రత్తయ్య మీద వల్లమాలిన కోపం వచ్చింది.

-అసలు మంగలిపని చేసేవాడికి పొలం పనేమిటంట? వాడికి ఆ రెండెకరాలూ మగతాకు ఇవ్వడం తనదే బుద్ధితక్కువ! వచ్చే ఏడు పొలం అంతా తాను స్వయంగా చేయించుకొంటాడు. లేకపోతే ఈ కౌలుదారీ బిల్లూ-యీ గొడవలూ తను పడాలా? చేయగలిగినంతా తనే స్వయంగా చేయించుకొనేది మిగతా పనికిరాని దేమన్నా వుంటే భూదానం చేస్తే సరిపోతుంది! కీర్తికి కీర్తి దక్కుతుంది. కౌలుదార్ల పీడా విరగడై పోతుంది. నిన్నటి శ్రమదానంతో తనకి తెలిసింది, పని చేయడం ఎంత తేలికో! ఆలోచిస్తూ పీటమీద కూర్చున్న రావుగారు జీతగాడు ఆముదం సీసా తీసుకుని పక్కన నుంచున్నదే గమనించలేదు.

"దొరగారూ! నూనెకాయ తెచ్చా" అన్నాడు జీతగాడు.

"ఊఁ తెస్తే చూస్తా నుంచుంటావేంరా? అంటూ!" అన్నాడు.

సుబ్బాయి చేతినిండా ఆముదం తీసుకొని రావుగారి నెత్తిన రుద్దటం మొదలు పెట్టాడు. ఎంతసేపు రుద్దినా చాలనకుండా తాపీగా కూర్చున్నాడు యజమాని. సుబ్బాయికి



కొంచెం సేపటికి చేతులు చచ్చుబడ్డాయి. పైగా వాడికి అలవాటులేని పనాయె.

"ఊ! గట్టిగా రుద్దరా గాడిదా!" కళ్ళ మీదకు కారుతూన్న నూనె తుడుచుకొంటూ అన్నారు రావుగారు.

వంట్లో సతువంతా చేతుల్లోకి తెచ్చుకొని తపతపా అంటుతున్నాడు సుబ్బాయి.

"ఆ! ఆహా! హాఁ! అంటూ కళ్ళు అరమూతలు వేసి కూర్చున్నాడు రావుగారు.

సుబ్బాయకి అరి చేతులు మంట లెక్కుతున్నాయి. విపరీతపగా అలుపు వస్తుంది. వళ్ళంతా చెమటలు పట్టిపోతోంది కుర్రాడికి.

"ఊ! చాల్లే! మంచినూనె తీసుకొని వంటికి మర్దన చెయ్యరా!" అంటూ మొలపంచె మోకాళ్ళ మీదకి లాక్కున్నారు రావుగారు.

యజమాని వంటికి సుబ్బాయి మంచినూనె మర్దనం చేయసాగాడు. ఆ పసివాడి చేతులకు యజమాని శరీరం చిన్నగున్న ఏనుగు పరిమాణాన తగులుతూంది.

దాదాపు ఆరడుగుల పొడుగు మనిషి, కండలు తిరిగిన శరీరం, అరటి స్థంభాల్లావున్న రావుగారి చేతుల మీదా, కాళ్ళమీద సుబ్బాయి సన్నని వేళ్ళు బలహీనంగా పాకుతున్నాయి.

"ముప్పూటా పెద్ద గిన్నెడు అన్నం తింటావే! సత్తువలేదేంరా? ఊ! గట్టిగా రుద్దు! ఆ నూనంతా వంట్లో యింకి పోవాలి! రుద్దు!" గదమాయించాడు యజమాని.

"చేతులు నొప్పెడుతున్నాయండీ?" అన్నాడు బిక్కమొఖం వేసి చిన్నోడు.

"పుట్టాయిరా? పుట్టాయి! పూటకు సోలెడు బియ్యపన్నం తినడానికి చేతులు నొప్పులు పట్టవేం?"

"చంకలో గడ్డ లేచిందండీ! నొప్పిగా వుంది!" ఏడుపు గొంతుతో అన్నాడు చిన్నోడు.

"ఒరే! యీ దొంగ మాటలు ఎప్పట్నుంచి నేర్చుకున్నావురా? రోజూ తెగతిని పడుకో మరిగిన నీకు యివ్వాళ వళ్ళొంగమంటే వంగుతుందా? ఊఁ! మోకాళ్ళ మీద. మడేల మీద గట్టిగా రుద్దూ!" అన్నారు రావుగారు.

కిక్కురుమనకుండా చేతినిండా నూనె పోసుకుని యజమాని మోకాళ్ళమీద సత్తువ


ఏది ముఖ్యం?

జీవితంలో మానవులు ఎంతకాలం జీవించారు? అనేది ముఖ్యం కాదుగాని వారు ఎలా జీవించారు అనేది చాలా ముఖ్యం. జీవితానికి పొడవు మాత్రం వున్నా ప్రయోజనం లేదు. వెడల్పుకూడా వుండాలి. తినటలో, త్రాగటలో మితముగా నుండి దేహానికి హాని కలిగించే త్రాగుడు, వ్యభిచారం, నల్లమందు, పొగాకు, మత్తుమందు ఇలాటి అలవాట్లకు దూరంగా నివసించే వ్యక్తికి దీర్ఘాయువు గల జీవితం మట్టుకే కాకుండా అతని జీవితం ఆనందంతో నిండివుంటుందని చెప్పటకు సందేహం లేదు. యాభై సంవత్సరములు దాటిన తరువాత నీవు ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలనుకొంటే ఆ యభై సంవత్సరాలకు ముందు నీ జీవితములోని ఆహారం, పానీయం, ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించటం ఎంతైనా అవసరం. ఏదైన అతిగా చేయుటవలన ఆరోగ్యము దెబ్బతింటుంది మన ఆలోచనల్లో, ఆహారంలో, పాటల్లో, మాటల్లో, పనుల్లో మితంగా ఉండటం మానసిక ఆరోగ్యానికి, దైహిక ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడుతుంది.

వృద్ధాప్యం ఆవరించడానికి కాలంతో ప్రమేయం లేదు. దైహిక వృద్ధాప్యము ఆలస్యముగా వచ్చినా మానసిక వృద్ధాప్యము కొంతమందికి చాలా త్వరగానే వచ్చేస్తుంది. మనోవేదన, భవిష్యత్తు గూర్చిన భయాలు, హృదయంనిండా నింపుకొన్న ద్వేషాలు, అసూయలు, నిరాశలు మానవులు ఏ వయస్సులో నున్నా అవి వారి ఆత్మానికే ముసలితనం కలుగచేసాయి. కొంతమందికి లోకమంతా చెడుగులోనే నిండియుంటుందనే నమ్మకం. అందులో వారొక్కరే సత్పురుషులు అనే భావంతో అందరిని ద్వేషించటం, అనుమానించటం అలవరచుకొంటారు. ఇలాంటివారికికూడ వృద్ధాప్యము త్వరలోనే వస్తుంది.

ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, ఇలాటి దైవగుణములకు హృదయము నిండా నింపుకొని వారి జీవితంలోకూడా అలవరచుకొన్నవారు కాలక్రమానుసారంగా వచ్చే వయస్సులో ముసలివారుగా కన్పించకుండా దీర్ఘకాలం యౌవనులుగానే కనిపిస్తూవుంటారు. అసహ్యకం, అనుమానం, అసంతృప్తి, ఆవేశం వీటితో మనస్సును నింపుకొంటే వృద్ధాప్యం ఆవరించుటకు క్షణం కూడ పట్టదు. మానవుడు చెడుగుమీద తన హృదయాలోచనలను ఏ క్షణంలో కేంద్రీకరిస్తాడో అపుడే మరణాన్ని కలిగించే విషఫలములు ఫలించుటకు మొదలౌతాయి. మానవ దేహమనే ఈ ఆలయానికి మరామతు అప్పుడప్పుడు అవసరమేగాని తగిన గాలి వెలుగు ధారాళంగా ప్రవేశిస్తుంటే ఆ ఆలయం ఆరోగ్యకరంగా ఉంటుంది. బాల్యంలో ఇన్‌ఫెంటాయిల్ పెరాల్‌సిస్ అనే వ్యాధికి గురియై చేతికర్రలతో నడుస్తున్న విద్యార్థిని ప్రశ్నించాను. ఇంత నిశ్చింతగా, ఇంత ఆనందంగా, ఇంత స్నేహపరుడుగా వుంటూ ఇంత ఉన్నతమైన విద్యను ఈ వికారమైన అవిటికాళ్ళతో ఎలా సాధించావని ప్రశ్నించాను. "ఆ వ్యాధి నాహృదయాన్ని ఎన్నడూ తాకలేదని" ఆయన బదులిచ్చాడు. వ్యాధులు, బాధలు, కష్టాలు, కన్నీళ్లు మానవ జీవితంలోని ఒక భాగము. వీటిని ఎవ్వరుకూడ తప్పించుకొనలేరు. వర్షం వర్షించకుండ ఆపగలిగేవారు ఎవరున్నారు. అయితే క్రీస్తు బిడ్డలు వర్షంలోకూడ హర్షించగలరు. ఆ క్రీస్తును గూర్చి తెలుసుకొన్నారా?

—శ్రీమతి చదలవాడ చంద్రమతీదేవి.



కొద్దీ రుద్దడం మొదలు పెట్టాడు సుబ్బాయి.

మోకాళ్ళు రుద్దించుకుంటూంటే రావుగారికి హాయిగా వుంది. దివ్యమైన వూహలు మెదడులో అల్లిబిల్లి తిరగసాగాయి.

ఆ రోజు తను చేసిన శ్రమదానం ఆ కూలీ ముండాకొడుకులు ఎవరైనా చేయగలరా? తను ఎంత బాధపడి వంగని మోకాళ్ళను బలవంతంగా వంచి బలవంతంగా మట్టిపల్లిలు తలకెత్తుతున్నాడు? ఎన్నిసార్లు మట్టి మోశాడు? ఆ మాటకొస్తే ఎక్కువ మట్టి మోసింది నేనేనేమో? తన వయసులో ఆ పని, అందునా అలవాటులేని ఆ మట్టి పని ఎప్పుడు చేయగలుగుతాడు? తనకు పనిలో గౌరవమూ, ఆత్మ విశ్వాసమూ ఉండబట్టే అంతపని తను చేయగలిగాడు. అంతగా కష్టపడ బట్టే తన మోకాళ్ళు ఇంతగా పట్టుకపోయాయి. సమయానికి అందరతాయి గాడేమో ఎగగొట్టాడు. యీ కుర్రసన్నాసేమో ఊరికే చేతులాడించటం తప్ప వంటికి ఆనేట్టు రుద్ది ఏడవలేకపోతున్నారు.

చిన్నాడి ముఖమంతా చిరచెమటలు కమ్మింది, నోరు తెరిచి గాలి పీలుస్తున్నాడు. చేతులు వంగడంలేదు. రుద్దీరుద్దీ అలసిపోయాడు. కళ్ళు బైర్లు కమ్ముతున్నట్టయింది! తన చేతులు ఎక్కడ వున్నాయో, ఏం చేస్తున్నాయో వాడి మనసుకి తెలియడం లేదు. యంత్రంలా తన చిన్న చేతుల్ని రావుగారి శరీరం మీద పైకీ కిందకీ ఆడిస్తున్నాడు.

"ఒరేయ్ సుబ్బా! నువ్వు వళ్ళు పట్టడం ఏడ్చినట్టే వుందిగాని ఇక ఆపు. కాస్త వేణ్ణీళ్ళు లాగిపోయి వేడి నీళ్లు బయటపెట్టు!" అని కాళ్లు చాచి పాదాలు సుబ్బాయి ముందు పెట్టారు రావుగారు.

రావుగారు స్నానానికి కూర్చున్నారు. శ్రీమతి తల అంటుతూంటే సుబ్బాయి కుంకుడు రసం పోశాడు. తర్వాత సుబ్బాయే వీపు అవీ రుద్దాడు. మూడు కాగుల వేడినీళ్ల పోసుకొని రావుగారు స్నానం పూర్తిచేశారు.

రావుగారు భోజనం చేసి వచ్చేసరికి సుబ్బాయి పక్కవేసి మంచందగ్గర మంచినీళ్లు, పొగాకు కట్టా, అగ్గిపెట్టె సిద్ధంగా వుంచాడు.

రావుగారు మంచంమీద కూర్చొని గ్రీవున తేపి చుట్ట వెలిగించారు.

చుట్ట దమ్ములాగి పొగ వదులుతూ మధ్య మధ్య ఖాండ్రించి ఊస్తూ కూర్చున్న రావు గారికి పొలానవున్న పెద్ద జీతగాడు గుర్తు కొచ్చాడు.

పెద్ద జీతగాడు ఉదయం అన్నం తినిపోయి తూర్పు పొలాన నారుమడిదగ్గర కాపలా వున్నాడు. రేపోమాపో కాలవ వదలతారని తెలిసి జీతగాణ్ణి పొలాన్నే రాత్రి కూడా వుండమని చెప్పారు వాడికి అన్నం పంపే సంగతి ఇంతవరకూ తనకు జ్ఞాపకమే రాలేదు సుమా! వాడు ఇంకొంచెం ఆలస్యమయితే నారుమడి వదిలేసి ఇంటికి వచ్చేరకం! పట్టి తిండిపోతువెధవ! ఒక్కపూట తిండి తక్కువయితే వాడుండలేడు.

"ఒరే సుబ్బా! ఏం చేస్తున్నావురా? ఇట్లారా?" అని బిగ్గరగా పిలిచారు రావుగారు.

కడిగి తెచ్చుకొంటూన్న గిన్నె చావిట్లో పెట్టి యజమాని దగ్గరకొచ్చి నిలబడ్డాడు సుబ్బాయి.

"ఏంటి దొరగారు"? అన్నాడు సుబ్బాయి.

"ఏం చేస్తున్నావ్‌రా?" ఆప్యాయంగా అడిగాడు యజమాని.

"అన్నం తినబోతున్నానండీ" అన్నాడు సుబ్బాయి.

"తర్వాత తిందువుగానీ, తూర్పు పొలం పోయి పెద్ద సుబ్బడికి అన్నం యిచ్చిరా ముందు"

చిన్నోడికి నోట పెగల్లేదు! మౌనంగా నుంచున్నాడు.

"ఏం రా? మొద్దులా నుంచున్నావే పోయి వాడికి అన్నం యిచ్చిరా మళ్ళొచ్చి తిందువు గానిలే నువ్వు!" అని రావుగారు భార్యను పిలిచి అన్నం మూటకట్టి యివ్వమని చెప్పారు.

"ముందు పిల్లోణ్ణి తిననీయండీ! చిన్నసన్నాసి పాపం! తర్వాత తీసుకు వెళ్తాడులే వాడికి అన్నం! పెద్దాడికి వాడికేం రోగమా?" చిన్న జీతగాణ్ణి వెనకేసు కొచ్చి అన్నది రావుగారి భార్య.

"మహా చెప్పావు లెద్దూ! నీ మాత్రం నాకు తెలియదంటావా? వీడు అన్నం తినిపోయే లోపల వాడిక్కడకు రానే వస్తాడు! నారు మడి దగ్గర మనిషి లేకపోతే కాలవకు నీళ్ళొచ్చే రోజుల్లో యింకేమయినా వుందా? ముందు అన్నం మూట గట్టియ్ వాడికి!" అని చుట్ట అవతల పారేసి దోసకాయ చెంబెడు నీళ్ళు గడగడ తాగాడు రావుగారు. రావుగారి భార్య అన్నం మూట తెచ్చి సుబ్బాయి చేతికిచ్చింది. మూటభుజాన వేసుకొని సుబ్బాయి దీనంగా యజమానికేసి చూశాడు.

"చిన్నోడా! ఇంకెందురా ఆలస్యం? అడ్డ దాటిన వెళ్ళావంటే అరగంట కూడా పట్టదు! ఎంత దూరం రా మన తూరుప్పొలం! ఊ! చప్పున పోయిరా!"

సుబ్బాయి తటపటాయిస్తూ నిలబడటం చూసి మళ్ళీ అన్నారు రావుగారు—


"ఇదిగో! ఏమేవ్! సుబ్బాయి పొలం నుంచి రాగానే యివ్వాళ పెరుగేసి అన్నం పెట్టూ!"

"పెరుగు అన్నం" మాటవినగానే సుబ్బాయికి కొత్త ఉత్సాహం వచ్చింది. రోజూ సాయంకాలం పులిమజ్జిగ తాగే వాడి జిహ్వకు తియ్యటి పెరుగు తాలూకు రుచులు మధురానుభూతులు కలుగజేశాయి. ఉన్నపాటున సుబ్బాయి అన్నం మూట భుజాన వేసుకొని పరుగు లంకించుకున్నాడు.

అలా ఉత్సాహంతో పరుగెత్తి పోతూన్న చిన జీతగాణ్ణి చూసి రావుగారు సంతృప్తి పడ్డారు. వారి పెదవులపై కదలిన మందహాసం మీసాలమధ్య చిక్కుకుని బయటికి రాలేక పోయింది.

చిన్నోడు లేడిలా, తాచులా పరుగెడుతున్నాడు. కాళ్ళు భూమ్మీద ఆనీ ఆనకుండా లేచి పడుతున్నాయి, యజమాని ఇల్లూ-గ్రామ చావడి-శిథిల దేవాలయం-శ్రీవారు శ్రమదానం చేసిన చరిత్రాత్మక స్థలమూ, యజమాని ఇటిక ఆవుము వరుసగా దాటిపోయినై.

-సుబ్బాయి ఊరుదాటి, పొలిమేర దాటి-



రోడ్డు దిగి కాలిబాటన పరుగులు తీస్తున్నాడు.

సుబ్బాయికి బాల్యం వీడీవీడని వయస్సూ, తెలిసీ తెలియని ఊహలూ, చాలీచాలని తిండీ, ఉన్నా లేని అపులూ-పాపం పన్నెండేళ్ళ సుబ్బాయి అన్నం మూట భుజాన వేసుకొని వెలిగే కడుపుతో ఒంటరిగా రాత్రిపూట దిక్కు-దిక్కు-మంటూ చెట్టు దాటి గట్టు దూకి, చేలకు అడ్డంపడి ఉరకలు తీస్తున్నాడు. వాడి గుండెల్లో భయం ఓతుకబికుతు మంటోంది వాడు పరుగెత్తటానికి కారణం సగం భయమే! ఊళ్ళోనుంచి దూరంగా కుక్కల మొరుగు వినపడుతోంది. పొలాలమీదనుంచి నక్కల ఏడుపు వినపడి ప్పుడల్లా చిన్నోడికి గుండెలు అలసిపోతున్నాయి.

ఏటి గాలి రయ్యిన విసురుగా వస్తోంది. సీటి మబ్బులు చంద్రుడ్ని తరిమితరిమి కొడుతున్నాయి. చీకటి వెలుగుల దోబూచులాటలో, గచపొదల కీచు శబ్దంతో, హోరుగాలిలో వేగంగా-శరవేగంగా పరుగులు తీస్తోన్న చిన్నోడి హృదయంలో ఎంత భయాలు విషసర్పాలై బుసలు కొట్టగా, ఏవేవో చిన్నెన్నో భ్రమలు రాబందుల రెక్కల సవ్వడిలా వాడి బుర్రలో కదిలి లేచి పడుతున్నాయి.

"అమ్మోవ్!" బిగ్గరగా వెర్రిగా అరచి తక్కిన నిలబడిపోయాడు సుబ్బాయి.

కళ్ళు, రెండు చేతులతో గట్టిగా మూసుకు నిలబడ్డాడు! కాళ్ళు గజగజా వణుకుతున్నాయి. పాదాలకు భూమ్మీద పట్టుతప్పి పోతున్నట్లయింది!

చిన్నాడి చెవులు చిన్నోణ్ణి మోసం చేశాయి. వాడికళ్ళు వట్టే మోసం చేశాయి, వాడి స్మృతి వాణ్ణి మోసం చేసింది

కళ్ళు చెదిరాయి——

"ఎంత స్వరూపం' భయంకర ఆకారం! తాటిచెట్టంత పెద్దది!"

చెవులు భ్రమించాయి.

గలగల శబ్దం! గాజుల శబ్దం? లంబాడీ గాజుల శబ్దం!! పెనకాలవ కట్టకు అల్లంత దూరంలో ఒక రావిచెట్టూ, రావిచెట్టు కింద ఒక సమాధి——ఆ సమాధిలో నుంచీ-ఆ ఆకారం ఆ శబ్దమూ——సుబ్బాయి లేత మనస్సుతో హత్తుకుపోయిన గాధ

*   *   *   *

అది చిన సుబ్బాయికి పెద సుబ్బాయి చెప్పిన కథ——

ఒకరోజు రాత్రి చిన సుబ్బాయి పెద సుబ్బాయి శ్రీవారి గొడ్ల చావిట్లో పడుకున్నారు రోజూ మామూలుగా చెప్పినట్టే, పెద సుబ్బాయి పేదరాశి పెద్దమ్మా, రాజకుమారుడూ, మంత్రి కుమారుడూ కథ చెపుతూ ఉంటే "ఊఁ" కొట్టూన్న చినసుబ్బాయి వుండీ వుండీ అన్నాడు గదా——"ఒరే పెద సుబ్బా? పెద సుబ్బా! నువ్వెప్పుడైనా దయ్యాన్ని చూసివుంటారా?"

"ఓ! సూసా-సూసా- సూశానా! సూట్టం సూట్టం లంబాడీ దయ్యాన్నే చూశాన్రా సిన్నోడా!" అన్నారు పెద సుబ్బాయి

"పెనకాలవ కట్టుంది సూశావా? ఆడో రాయిసెట్టుంది సూశావా? ఆ సెట్టుకిందో సమాధుంది సూశావా? అదుగల్లదా సమాదిలో వుండిరా లంబాడీ దెయ్యం! అన్నాడు పెద సుబ్బాయి.


"నిజంగా నా?" ఇంత తకళ్ళు చేసుకొని అడిగాడు సిన్నోడు.

"నిజమేందిరా, నిజం? ముమ్మాటికీ నిజమైతేనూ?" అన్నాడు పెద్దోడు.

"ఆ దెయ్యం ఆడెందుకుందీ? ఏంది సంగతి?" అన్నాడు చిన్నోడు పెద్దోడికి దగ్గరగా జరుగుతూ.

బీడీ ముట్టించి పెద్దోడు చెప్పటం మొదలు పెట్టాడు.

"ఇది మా తాత నాకు సెప్పాడు. అప్పుడు నేనూ నీయంత వుండేవాణ్ణంటరా! అప్పుడు సెప్పాడ్రా మా తాత నాకు దీని కత! మన యజమానయ్య తాత, మా తాతకు బాగా ఎరిక టా! అప్పుడు మా తాత ఆయన కంటే కూస్త సిన్నోడట లే! మన యజమాని తాత ఎంకయ్యా మా గొప్ప పెద్దమనిసంట!



అప్పుడు ఎంకయ్యకు మా తాతకు మల్లేనే సెంటు పొలం లేదంట! ఇప్పుడు మన ఆసామి పొలాలున్నసోట పెద్ద సిట్టడవుండేదంటరా, ఎంకయ్యేమో అడవిలో పుల్లా పుడుగు కొట్టుకొని బతుకుతూండేవాడంటరా, మా తాతోళ్ళకు మల్లేనే!" పెదసుబ్బాయి బీడీ దమ్ముపట్టటానికి ఆగాడు

చినసుబ్బాయి "ఊఁ"కొట్టూ వింటున్నాడు.

"ఇట్టావుడగా, ఓ రోజున ఊళ్ళోకి ఓ లంబాడి తండా వచ్చిందిరా! ఆళ్ల పొలిమేర్లో గుడిసె లేసుకొని ఉండారు. రోజూ ఆళ్ల దగ్గరికి ఎల్లెసా ఎంకయ్యా లంబాడోళ్ల తండాతో సక్యెం సేసుకొన్నాడ్రా! ఓ రోజున అల మందల తోలుకని అరణ్యంలోకి లంబాడోళ్లు ఎల్లగానే పెద్ద గాలొచ్చింది! గుడిసెల దగ్గర ఒక ముసల్దాన్ని కాపలా పెట్టి ఆడాళ్ళు మగాళ్ళు అంతా పనిమీద ఎల్లిపోయారు. ముసిల్దొక్కతీ గుడిశలో కూకుంది! ఝుయ్ ఝుయ్న గాలోన ఇసరూంది. ముసల్ది గుడిసెలో ఓమూల గొయ్యిమీద కూకుంది. తండాలోళ్ళు, ఆళ్లదగ్గరున్న వరాలన్నీ సంచుల్లో ఏసి కుట్టి, సంచులన్ని గుడిసెలో గొయ్యితీసి పాతపెట్టారంట ఓరికి తెలవకుండాను. ఆ గొయ్యిమీదే ముసల్ది కూకుని కాపలా కాత్తుందన్నమాట! ఇది ఇట్టు ఉగా, ఏడ్నుంచి వచ్చాడో సర్రున ఎంకయ్యా ముసల్ది కూకున్న గదిలో కొచ్చాడు లంబాడోళ్ళతో సక్యం సేత్తున్నట్టు సేసి ఆళ్ళు డబ్బు దాసుకొన్నట్టు పసిగట్టేశాడ్రా ఎంకయ్యా! ఎట్టా కనిపెట్టేశాడో గాని!

"రావటం రావటం ఎంకయ్యా ముసలమ్మ మీదకు దూకి, దాని గొంతుపిసికి సంపేశాడు! సంపేసి, ముసల్దాన్ని పక్కకు లాగి గొయ్యి తీసి ఆమున్న వరాల సంచులన్నీ తీసుకొన్నాడు! పోతూ పోతూ ఎంకయ్యా ముసలమ్మను ఆ గోతిలోకే తోసి పైన మట్టికప్పి ఎల్లిపోయాండట!"

"ఆళ్లోళ్ళు వచ్చేదాక ముసలమ్మ ఆ గోతిలోనే కూకుందా?" అన్నాడు చిన్నోడు.

"ఇంకేక ముసలమ్మరా సచ్చి కూకుంటేను! గాలోన ఎలవగానే లంబాడోళ్ళు వచ్చి సూసుకుంటురుగందా, వరాల సంచీలన్నీ మాయ

మయి పోయినై! సంచీలున్న చోట్లో ముసలమ్మ పీనుగు కూకోని ఉంది! తబ్బిసంచులు తీసుకొని ఎంకయ్య పరారి అయిపోయాడు. లంబాడోళ్ళు గోడుగోడున ఏడుస్తూ ఊరొదిలి పెట్టి ఎల్లిపోయారు. లంబాడి తండా ఎల్లిపోయిన కొంతకాలానికి ఎంకయ్య ఊళ్లోకి తిరిగొచ్చాడు. పెద్ద ఇల్లు కట్టి. సూపుకానినమట్టుకు నిట్టడవి సొంతం సేసుకొని, ఏంపీలేని ఎంకయ్య, మారాజు ఎంకయ్య అయిపోయాడంటశ! ఇప్పుడు మన ఆసామి వుంటూన్న ఇల్లూ, అరి భూమీ అంతా ఆళ్ళ తాత ఎంకయ్య సంపాయించిందేనంటరాసినోన్నడా!"

"మరి లంబాడీ దెయ్యమో?" చిన సుబ్బాయి మధ్యలో అందుకొని అన్నాడు.

"ఉన్రా! తొందర పడుతున్నావేం సెప్పుతున్నాగా? ఎంకయ్య పాతేసిన ముసిల్ది లంబాడి దెయ్యం అయి ఎంకయ్య పెళ్ళాన్నీ, ఊళ్ళో వాళ్ళను పట్టుకొని ఏడిపిచటం మొదలు పెట్టింది అం వతుస ఎంకయ్య అదిరిపోయి మంత్రగాళ్ళను పిలిపిచ్చి లంబాడి దెయ్యాన్ని సీసాలోకి ఎక్కించి రావిచెట్టు కింద భూస్థాపితం చేయించాడంట! ఎందుకైనా మంచిదని ఎంకయ్య ఆ రావిచెట్టుకింద సమాధి కట్టించి ఏటేటా లంబాడీ దెయ్యానికి పూజలు చెయించాలని మా తాత సెప్పాడురా! ఎంత సేసినా, దాని సిగదరగా దెయ్యం అప్పుడప్పుడు రావి చెట్టుకింద సమాదిమీద లేచి నుంచుని సిందులేస్తా వుంటదంటరా?"

పెద సుబ్బాయి బీడి ముక్క అవతల పారేసి చెప్పసాగాడు-

"నిరుడొక రోజున నాన పొద్దుపోయి తూరుపొలాన్నుంచి తిరిగి వత్తావుంటే కాలవ కట్ట పక్కన రావిసెట్టుకింద-అబ్బో ఏం సెప్పేదిరా సిన్నోడా? తాటిపమానాన లంబాడి దెయ్యం జుట్టు ఇరపోసుకొని గల గలా-గల గలా——"

కెవ్వున కేకేసి తత్తరపోయి చిన సుబ్బాయి, పెద సుబ్బాయిని వాటేసుకొన్నాడు.

"ఓరి పిరికి నాయాలగదరా! దడుసుకొన్నావేందిరా? ధైర్యంగా నుంచొని లంబాడి దెయ్యాన్ని నిప్పుడిగితే అదే పరుగెత్తదిరా చిన్నోడా?" అని చిన్నోడి వీపు తట్టి చెప్పాడు పెద్ద జీతగాడు.

కాని చినసుబ్బాయి కళ్ళముందు లంబాడి దెయ్యం కదులుతూన్నట్టుగానే వుంది. కళ్ళు గట్టిగా మూసుకొని పెద్దోడి పక్కలో ఆనుకొని పడుకొన్నాడు

* * * *

చిన సుబ్బాయి గట్టిగా కళ్లు నలుపుకొని చూశాడు. దూరంగా కాలవకట్టా-కట్టమీద తుమ్మచెట్టూ-చెట్టుకింద మసక మసకగా కనబడుతోన్న సమాధి-

చిన్నోడికి కాళ్ళు భూమిలో పాతుకుపోయినట్టుగా వుంది. బలవంతంగా కాళ్ళు కదిలించాడు. బొల్లిగా కాలవకేసి నడుస్తున్నాడు.

తను ధైర్యంగా ఉండాలి. ధైర్యంగా వున్నోళ్ళని దెయ్యం ఏమీ చెయ్యలేదట! ఈ సారి కనపడితే నిప్పడుగుతాను, దాని సిగ కోసి చేతులో పెట్టుకుంటే సరి! దాని తిక్క కుదురుతుంది చిన్నోడు తనకు తానే ధైర్యం చెప్పుకొంటున్నాడు. లోపల్నించి అజ్ఞాత శక్తులేవో భయాన్ని తెరలు తెరలుగా చిన్నోడి గుండెల్లో విసురుతున్నాయి.

తను పరుగెత్తకూడదు! పరుగెత్తితే దయ్యం తను భయపడి పారిపోతున్నాడనుకుని వెంటపడుతుంది-అలా ఆలోచిస్తూ వెనక్కు తిరిగి చూసుకొన్నాడు చిన్నోడు. ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తోన్నాడు. భుజం మీద అన్నంమూట బరువు తగులుతూంది. మనసులో గుబులూ, భయమూ గూడు కట్టుకుంటూంది. పైకి బింకంగా రొమ్ము విరుచుకొని నడుస్తున్నాడు ఉషారుగా, సరదాగా. ధైర్యంగా శూరాధి శూరుడులా ఉండాలి తను! సన్నగా కూనిరాగాలు తీయడం మొదలుపెట్టాడు. లోపల భయం పెరుగుతూంటే చిన్నోడి గొంతు పెద్దదవుతూంది. గొంతు విప్పి పాడసాగాడు.

"నాయుడోళ్ళింటికాడ నల్లతుమ్మచెట్టు
కింద-
నల్లతుమ్మ చెట్టు కింద-
నాయుడేమన్నాడే బుల్లే?
నాయుడేమన్నాడే బుల్లె!"

చిన్నోడు రెండు చేతులు జోడించి రావి చెట్టుకేసి చూస్తూ మనసులో దెయ్యాన్ని బతిమాలుకొన్నాడు.

రయ్యిన వీచే ఏటిగాలి హోరులో, తుమ్మ చెట్ల గచ్చపొదల కీచు ధ్వనుల్లో చిన్నోడి గొంతు కలిపి పాడుతున్నాడు.

కొద్ది క్షణాల్లోనే చిన్నోడి గొంతు ఎండి పోయింది. పాట గొంతులోనే కొట్టుకోవడం తప్ప బయటికి రావడ లేదు——

ఉప్పెన నాటి రాత్రి సముద్రం పొంగులా చిన్నోడి గుండెల్లో భయం ఉబుకుతూ వుంది. సిమెంట్ రోడ్డుమీద శ్రీవారి బండి గుర్రం డెక్కల చప్పుడులా చిన్నోడి లేత మనసులో భయం కొలిపే వింత ధ్వనులు లయయుక్తంగా మోగుతున్నాయి.

చిన్నోడు రెండు చేతులు జోడించి రావి చెట్టుకేసి చూస్తూ మనసులో దెయ్యాన్ని బతిమాలుకొన్నాడు.

"-ఓ లంబాడి దెయ్యమా! కాదు కాదు! దెయ్యంగారూ. నా జోలికి రావొద్దు; నిన్ను చంపింది మా తాతగాదు, మా యజమాని తాత ఎంకయ్య; నీ డబ్బంతా వాళ్ళ దగ్గరే వుంది! కావాలంటే ఆసామిని విరుచుకొని తిను! నేను చిన్నోణ్ణి! నన్నేం చేయమాక! నీకు చిన్నోణ్ణే కావాలంటే ఆసామి కొడుకున్నాడు! వాడూ నా యీడువాడే! వాణ్ణే తిను! నీకు ఇంకా కావాలంటే పొలాన వున్నాడు, పెదసుబ్బాయి ఆడ్ని కూడా తినేయ్; నన్ను మాత్రం వదిలేయ్; నీకు రేపు మూడు కొబ్బరికాయలు కొడ్తాను."

దెయ్యాన్ని ప్రార్థిస్తూ, ప్రాధేయపడుతూ మెల్ల మెల్లగా అడుగులు వేసుకుంటూ చిన్నోడు తూరుపొలంవైపు నడుస్తున్నాడు. అన్నంమూట భుజంమీదగా తిరిగి వీపుమీద వేలాడుతూ వుంది.

-అన్నంమూట అక్కడ పారేసి ఇంటికి తిరిగి పోతే? యజమాని అన్నం ఇచ్చి వచ్చావురా అని అడిగితే? ఏం? ఇచ్చొచ్చానని అబద్ధం ఆడేస్తాను! అమ్మో! తెల్లారి పెద సుబ్బాయి పొలాన్నించి వచ్చి చిన్నోడు అన్నం తేలేదని చెప్తే? ఇంకా తను బతుకుతాడా? వొళ్లు పంబరేగదూ! తన రక్తం కళ్ళ చూడడూ?

-తను అయ్యదగ్గరికి పారిపోతేనో? అయ్య మాత్రం ఊరుకొంటాడా? తన్నుకొంటూ తీసుకొచ్చి యజమానికి అప్పచెప్పడూ? ఎటన్నా పారిపోతే?

-అయినా, ఇంకెంతదూరంలే! కాలవ దగ్గర కొచ్చేస్తోంది. కాలవ దాటాడంటే ఒక్క పరుగులో వెళ్ళి సుబ్బాయిదగ్గర పడొచ్చు; యీ రాత్రి ఆడిదగ్గరే పడుకుని తెల్లారి ఆడితో పాటు ఇంటికొస్తే సరి! తను ఇంకా అన్నం తినలేదుగా? కడుపులో పేగులు మెలితిరిగి పోతున్నాయి. ఆం! పెదసుబ్బాయి నడిగితే సరి! ఆడి అన్నంలోనుంచి కాస్త పెడాడ్లే! ఆడు చాలా మంచాడు! ఆడికీ మాలావు ఆకలేస్తూండాలి! పొద్దునెప్పుడో తిన్నాడు? తొందరగా అన్నం మూట తీసుకెళ్తే ఆడెంతో సంబరపడతాడు.

అలా ఆలోచిస్తూ నడుస్తూ చిన్నోడు రావి చెట్టుదగ్గర కొచ్చాడు. చెట్టుకిందవున్న సమాధి చూసేసరికి వొళ్ళు జలదరించిపోయింది.

సుబ్బాయి మొండిధైర్యం చేసి తెగించి పరుగు లంకించుకొన్నాడు. రావిచెట్టు దగ్గర లేచిన లేవడం కట్టమీదకొచ్చి వాలాడు.

అన్నంమూట నెత్తిన పెట్టుకొని, మూట కట్టిన పంచ అంచు జారకుండా మెడచుట్టు తిప్పి కట్టుకొని, సర్రున కట్ట మీద నుంచి కాలవలోకి దూకి పరుగులేశాడు సుబ్బాయి. కట్టమీద నుంచి దిగిన విసురుడికి సుబ్బాయి కాలవలో నాలుగైదు గజాల దూరంలోపోయి పడ్డాడు; రొమ్ములుదాటి కంఠం వరకూ నీళ్ళొచ్చేసరికి చిన్నోడికి అంతా అయోమయమయి పోయింది.

నిన్నటి వరకూ కాలవలో నీళ్ల పూర్తిగా

తగ్గిపోయి వున్నాయి. కాలవ రెండు కట్టలకు ఆనుకొని నీళ్ళులేవు. పది గజాల పాటు దూరంలో కాలవ మధ్యలో మాత్ర పాయగా మోకాటిలోతు నీళ్ళు మెల్లగా పారుతూండేవి ఇప్పుడు కాలవ అలాగే వుందనుకొని కాలవ దాటటానికి వచ్చాడు సుబ్బాయి. కాని యీ మధ్యలో కాలవ వదిలారు. పై నుంచి వరదలు వచ్చి ఏరు నిండింది. ఏరు పొర్లుతూండగా పెద్ద కాలువ తలుపులు పూర్తిగా ఎత్తబడినాయి. నిమిష నిమిషానికి కాలవ ఉబుకుతుంది! షావుకారు — ఇనసకట్టూ చక్రవడ్డీలా క్షణక్షణానికి కాలువనీటిమట్టం పెరుగుతూంది.

లంబాడి దెయ్యం ఊహంతో తత్తరపాటుతో వున్న సుబ్బాయి కళ్లు చీకట్లో ఉబికి ఉబికి ఉరవళ్ళు పరవళ్ళతో ప్రవహిస్తున్న కాలువను చూపలేకపోయినై!

అకస్మాతుగా గొంతు వరకు నీళ్ళొచ్చేసరికి చిన్నోడికి మతిపోయింది, ఇదంతా లంబాడి దెయ్యం చేస్తున్న పనే అనుకున్నాడు. దూరంగా కట్టమీద తుమ్మచెట్ల వెనగ్గా రావిచెట్టు తలలు విరబోసుకుని కన్పిస్తోంది. గగ్గోలు పెట్టి అరిచాడు. ప్రవాహ వేగం చిన్నోడి శరీరాన్ని లోపలకు లాగివేస్తోంది. కాళ్ళ కింద ఇసుక తప్పుకొని సుడులు తిరుగుతోంది.

సుడిగుండంలో ఇరుక్కున్న సుబ్బాయికి చెయ్యీ, కాలు ఆడలేదు. గుండంలో పడి మునుగుతూ, తేలుతూ ప్రవాహ వేగంతో కొట్టుకుపోతున్న అన్నం మూట చిన్నోణ్ణి కిందకు లాగివేస్తుంది. తన తలమీద ఏదో విపరీతమయిన శక్తి కూచుని లోపలికి తొక్కుతూన్నట్టూ, గొంతుపట్టుకొని లోపలకు గుంజుతుంటో ఎట్టుగా అయిపోయింది చిన్నోడి పని!

చిన్నోడి ఖాళీ పొట్టలో కొత్తనీరు చేరింది! చిన్నోడి ఊపిరితిత్తుల్లోకి కొత్తనీరు చిమ్ముతోంది!

చిన్నోడు కళ్లు తేలవేశాడు. కాళ్లు, చేతులూ కొట్టుకోవడం మానివేసినయ్ —

నంగనాచిలా, తనకేమి తెలియనట్టే శ్రీవారి చిన్నజీతగాణ్ణి పొట్టలో దాచుకొని ఒడ్డునవున్న మట్టికోస్తూ కాలువ ప్రవహిస్తూ వుంది.

* * * *

సూర్యుడు కరకరా పొడిచి రెండు బారలు పైకి ఎక్కాడు శ్రీ రావుగారు వళ్లు విరుచుకుంటూ నిద్రలేచారు

నిన్న చేసిన శ్రమదానానికి వళ్లంతా విరగ్గొట్టేసినట్టుంది. అయితే ఏం? కష్టేఫలే! అన్నారు. రేపు ఉదయం పేపర్లలో తన చిత్రం....మట్టితట్ట మోస్తోన్న చిత్రంతో సహా ఉల్లిపాలెంలో జరిగిన శ్రమదాన కార్యక్రమం తాలూకు వార్తలన్నీ వస్తాయి. లక్షలాది ప్రజలు చదువుతారు. మహామహానాయకులంతా తన చిత్రాన్ని చూస్తారు! ఈ దెబ్బతో తన నియోజకవర్గంలో ఎదురు ఎవరు నిలవగలుగుతాడు తనకు?

అలా ఆలోచిస్తూ మంచం దిగి శ్రీవారు బయట అరుగుమీద కొచ్చి కూర్చుని—

"ఒరే! చిన్నోడా? నీళ్ళు, వేప పుల్లా పట్టుకురారా!" అని బిగ్గరగా సాట్లోకి చూసి అన్నాడు.

చిన్నోడు రాలేదు! పలకలేదు!

శ్రీవారికి కోపం వచ్చింది. పిలవంగానే మనిషి హాజరవకపోతే రావుగారికి చెడ్డ చిరాకు కలుగుతుంది నిద్రలేచేసరికి ముఖానికి నీళ్ళు, వేపపుల్లా సిద్ధంగా అరుగుమీద వుండాల్సింది యీ రోజు లేవు, పైగా జీతగాణ్ణి పిలిసే పలకడు! కోపం వచ్చిందంటే రాదు మరి!

"ఒరే! సుబ్బాయ్? ఎక్కడ చచ్చావురా? పిలుస్తుంటే పలకవేరా" గర్జించారు శ్రీవారు.

నీళ్ళు తాగి వుబ్బి తేలి కొట్టుకొచ్చిన చిన్నోడి శవం ఉల్లిపాలేనికి రెండు మైళ్ళ దిగువనున్న కాలవలాకుల దగ్గర ఆగింది! శ్రీవారి శ్రమదానాన్ని గురించి కిలకిల పలపలుగా చెప్పుకొంటూన్న జనం లాకుల దగ్గర తేలిన కుర్రాడి శవాన్ని చూసి బయటికి లాగారు.

శ్రీవారి గొంతు మళ్ళీ గర్జించింది—

"ఒరేయ్! చిన్నోడా! ఎక్కడ చచ్చావురా? నిన్నేరా పిల్చేది? వినబట్టంలా!......"

వినడానికి అక్కడ చిన్నోడు లేడు!

కనడానికి దేవుడూ లేడు!

(వనశ్రీగారి కథా సంపుటి 'శ్రీవారి శ్రమదానం' నుండి పునర్ముద్రితం.) ✻

దాసు మధుర భారతి

మినీకథ

దర్జీవాడు

బొమ్మల పండగొస్తోంది, సోఫాలకు కొత్త కవర్లు కుట్టించాలని ఎన్నాళ్ళుగానో అనుకుంటున్నాం. పేపరు తెరిస్తే చాలు ఎగ్జిబిషన్‌లు, రిడక్షన్‌లు, డిస్కౌంట్‌లూ అంటూ కన్నుల పండుగ్గా వుంటాయి రకరకాల ప్రకటనలు. అందులో ఇక్కడ ఢిల్లీలో సంవత్సరం పొడుగునా ఏవో ఎగ్జిబిషన్‌లు జరుగుతూనే వుంటాయి.

పది పర్సెంటన్నా సరే పరుగులు పెడారు జనం. తీరా వెళ్తే ఏడు పర్సెంట్ టాక్సు. చివరకు మిగిలేది రూపాయికి మూడు పైసలు. కరువు రోజుల్లో కొద్దిగా మిగిల్చినా గొప్పే. ఎలాగో తిరిగి తిరిగి కొన్ని గుడ్డ నచ్చక, కొన్ని డబ్బు నచ్చక వదిలేసి చివరకొక కొట్లో కొన్నాం గుడ్డ. కవర్లు కుట్టటానికి కొట్టువాడే మిషనువాణ్ణి పంపిస్తానన్నాడు.

సాయంత్రానికల్లా దర్జీవాడు వచ్చాడు భుజాని గదలాగా మిషను భుజాన పెట్టుకుని. పేరేమో కరార్‌సింగ్‌ట. ఎర్రటి కళ్ళు, పాన్ వేసుకున్నాడేమో గారపట్టిన పళ్ళతో ఎర్రటి నోరు, పెద్ద మీసాలూ వాడూ, చూట్టానికేమో అచ్చం సినిమా విలన్‌లాగా వున్నాడు.

వస్తూనే ఇల్లంతా దొంగచూపులు చూట్టం మొదలెట్టాడు నాకూ, మా అమ్మాయికీ వాణ్ణి చూస్తుంటే దొంగాడేమోనని భయం పట్టుకుంది. మావారేమో "వెధవ భయాలూ మీరూనూ, అందరిమీదా అనుమానాలే, నేనున్నాగా మీ రవతలికెళ్ళండి" అన్నారు తనేదో వాణ్ణి పొడిచేసేటట్టు.

సోఫాలు బరబరా లాగాడు టేపు తీశాడు జేబులోనుంచి. పైకి క్రిందికి కొలతలేసి చకచకా కత్తిరిస్తున్నాడు. మధ్యమధ్య మా వంక చూస్తున్నాడు తమాషాగా. మేం తెలుగులో వాణ్ణిగురించి మాట్లాడుకుంటున్నాం. 'ఇలాంటివాళ్ళే పగలు ఇల్లంతా తనిఖీచేసి, రాత్రికి దొంగతనానికి వస్తారట....వాడేమిటి అలా దొంగచూపులు చూస్తాడు. కళ్ళన్నీ బయటపెట్టి దొంగనవ్వు నవ్వుతాడు.' అని పెద్దగానే అనుకుంటున్నాం.

వాణ్ణి మాట్లాడిద్దామని "కహాఁకే రహనే వాలే హై" అన్నా. అంతే, ఆపకుండా వాగటం మొదలెట్టాడు హిందీలో. వాడిది మీరట్‌ట. వాళ్ళ నాన్నేమో ఆర్మీలో పనిచేశాట్ట అందుకని ఇండియా అంతా చూసేశాట్ట. సికిందరాబాద్ చాలా నచ్చిందట ఇడలీ (ఇడ్లీ) చాలా ఇష్టంట. డోషాలు (దోసెలు) డజనైనా లాగించేస్తాడట ఏవేవో చెప్తూ కత్తిరించటం పూర్తి చేశాడు.

ఒక కవరు కుట్టేడో లేదో 'అభీ ఆయేంగే దస్ మినిట్ మె' అంటూ బయటికెళ్ళిపోయాడు. పది నిమిషాలు, పావుగంట, అరగంటవుతోందిగాని వాడుమాత్రం పత్తాలేడు. మా భయం ఎక్కువవటం మొదలయింది. 'వీడు తప్పకుండా దొంగే అయివుంటాడూ, ఇంకా యిద్దర్ని తేవటానికి వెళ్ళాడేమో, వచ్చాక ఏ పిస్తోలో చూపిస్తే ఏం చెయ్యాలి?'


అని గాభరాగా వుంది. మావారికేమో నవ్వు, అ వసరంగా మేం గాభరాపడి తనని గాభరా పెట్టేసున్నామని చీవాట్లు పెడుతున్నారు.

నేనూ, మా అమ్మాయి కలిసి మా కున్న వన్నీ దబదబా పప్పుల డబ్బాల్లో, బియ్యపు డబ్బాలో దాచేశాం. కారం రెండు పొట్లాలు కట్టుకుని చెరొకటి చెంగుచాటున వాడికి కన బడకుండా చేతుల్లో దాచుకుని జాగరపడ్డాం. మావారికి ఏమేం చెయ్యాలో చెప్పి పెట్టాం. నాలుగు లావాటి కర్రలు వాడికి కనబడకుండా కర్టెన్ల వెనక దాచాం.

మా హడావిడంతా చూసి మావారికి, వాడు నిజంగా దొంగేమోనని అనుమానంగా వున్నట్టుంది. కాని పైకిమాత్రం కనపడకుండా "అయితే మీరిద్దరూ కలిసి వాడి కంట్లో కారం కొట్టి, కర్రలతో తలకాయ పగలకొడ్తారన్న మాట" అనటం, నవ్వటం.

మామూలప్పుడయితే, మేమూ ఎగతాళి పట్టించేవాళ్ళమేగాని, మా గాభరాలో నవ్వులు గివ్వులూ మా చెవికెక్కడంలేదు. ఎందుకంటే ఇంట్లోకి ఎలకొస్తే, వెళ్ళగొట్టటానికి మావారు చేసే 'కథాకళి' ఫిలిం తీయాల్సిందేగాని, వర్ణించటానికి మాటలు చాలవు.

ఇంతలో తలుపుమీద 'టకటక'మని చప్పుడయింది. భయంవల్లో యేమో మగ్గురం



వొక్కసారే 'కోన్‌హై' అని కోరస్‌లాగా అరిచాం. 'మైహూ కర్తార్‌సింగ్' అన్నాడు.

తలుపు తియ్యగానే, పళ్ళికిలిస్తూ లోపలి కొచ్చి కట్టడం మొదలెట్టాడు. నేనూ, మా అమ్మాయి వాడికి వెనగ్గా ఒకళ్ళు, ముందు వైపు ఒకళ్ళు కొద్దిగా దూరంగా కూచున్నాం. నాకు పిస్టల్ చూపిస్తే కంట్లో కారం తన్ను కొట్టేట్టు, తనకు చూపిస్తే నేను కొట్టేట్టు, పెద్ద గానే మాట్లాడుకుంటున్నాం.

ఆఖరి కవరు కుడుతున్నాడు. మధ్య మధ్యలో మా యిద్దరివంకా చూస్తున్నాడు గమ్మత్తుగా. కుట్టటం అయిపోయినట్లుంది, అన్నీ సర్దుకుంటున్నాడు కత్తెరా, టేపు, దారాలు అన్నీ సంచీలో వేసుకుంటున్నాడు. మా అమ్మాయి "అమ్మా జాగర్త. ఇప్పుడే తీస్తాడు పిస్టల్ సంచీలోంచి. రెడీగా వుండు" అంటోంది.

నాకు టెన్షనెక్కువయి కాళ్ళు, చేతులు వణకటం ప్రారంభించాయి. ఆ వొణుకుడికి కారం పొట్లం వొదులయి చిన్నగా రాలటం మొదలయింది. కారం కొరుకి వాడు, మావారు పోటీలు పడ్డట్టుగా తుమ్మటం మొదలెట్టారు.

ముక్కు తుడుచుకుంటూ "అచ్ఛా సాబ్ పైసా దేదీజియే" అన్నాడు. అన్నడే తడవుగా డబ్బు వాడిచేతిలో పెట్టి దబదబా వీధితలుపు తెరిచారు మావారు "వెళ్ళరా వెధవాయీ" అంటూ.

వాడు వెళ్ళటానికి రెండు మెట్లు దిగి, మా వైపుతిరిగి "దర్జీవోల్లంతా దొంగోల్లుగారండీ" అని తెలుగులో అంటూ గబగబా మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

"ఓరి వెధవయ్యా! నువ్వు కొన్నాళ్ళ సికింద్రాబాద్‌లో వున్నావన్న సంగతి మర్చిపోయ్యాంరా బాబూ" అనుకున్నాం. ✱

సంతోషం

జె. సుబ్బలక్ష్మి



రాత్రి పదకొండుగంటల సమయం. ఇరుగు పొరుగు ఇళ్లల్లోవాళ్లంతా అప్పుడే లైట్లార్పేసి పడుకున్నారు. కాని గోపాలం ఇంట్లో మాత్రం ఇంకా లైటు వెలుగుతూనే వుంది. అంత పెద్ద ఇంట్లో బిక్కుబిక్కుమంటూ తనొక్కడే ఒంటరిగా కాలం గడపడానికి చాలా కష్టంగా వుంది గోపాలానికి.

బయట వర్షం కుంభవృష్టిగా కురుస్తోంది. ఆకాశం ఉరుములు, మెరుపులతో నానా బీభత్సంగా వుంది. "ఈ వర్షం ఇలా ఇంకా ఎన్ని గంటలసేపు కురుస్తుందో ఎప్పుడు వెలుస్తుందో తెలీదు. తెల్లారేసరికైనా తగ్గిపోతే బావుణ్ను! అనుకున్నాడు.

అసలు మామూలుగా ఉన్నప్పుడైతే-వర్షం కురుస్తుంటే తనకు ఎంతో హాయిగా, ఆనందంగా ఉంటుంది. ఆ వర్షధారలను చూస్తూ గంటలు గంటలు గడిపేయాలనిపిస్తుంది. కాని ఈరోజు మాత్రం ఎందుకో అలా అనిపించడం లేదు, పైగా చిరాకనిపిస్తోంది.

ఏమైనా తెల్లారేసరికి ఈ వర్షం తగ్గిపోవాలి. లేకపోతే హేమ రాదు.

ఛ! తన పిచ్చిగాని వర్షానికి భయపడి రాకుండా వుంటుందా ఎక్కడైనా? ఆమె వస్తుంది, తప్పకుండా వస్తుంది. అలా అని మాటిచ్చింది కూడా. వచ్చి తడివేళ్ళతో సుతారంగా తలుపు తడుతుంది. తను వెంటనే తలుపు తీస్తాడు. గుమ్మందగ్గర ఒక్క క్షణకాలం ఆగి, తడిసిపోయిన పైటకొంగును సర్దుకుంటూ అడుగులు తడబడుతుండగా లోపలికి వస్తుంది హేమ. వీధితలుపు గడియ పెట్టేసి తనూ ఆమె వెనకాలే ఇంట్లోకి వస్తాడు....

అదంతా రేపు తెల్లవారిన తరువాతి మాట! అసలీ రాత్రి గడచి తెల్లారుతుందా అని? ఇంకా పన్నెండయినా అవలేదు. పడుకుంటే నిద్దుర రావడం లేదు. ఏంచేయాలో తోచడంలేదు, ఏం చేయడానికి పాలుపోవడంలేదు.

గోపాలం సిగరెట్టు వెలిగించాడు. గట్టిగా దమ్ము పీలుస్తూ గదిలో పచార్లు చేయడం మొదలెట్టాడు.

అసలు నిజంగా చూస్తే ఈరాత్రి తనకు బాగా నిద్రపట్టాలి. ఇన్నాళ్లూ అనుభవించిన నరకయాతననుండి విముక్తి కలిగినందుకు సంతోషించి హాయిగా, సుఖంగా ఆదమరచి నిద్రపోవాలి. తన జీవితంలోని అతి ముఖ్యమైన సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకో గలిగినందుకు - తనదారిలో వున్న ముల్లును తొలగించుకోగలిగినందుకు-తనపాలిటి శనిగా దాపురించిన నాలుగేళ్ల క్షుద్రవెధవ బెడద వదిలించుకోగలిగినందుకు - ఈ రోజు అతి నిశ్చింతగా నిద్రపోవాలి. కాని ఏదీ...కును కంటూ పడితేగా!

గోపాలం కళ్ల ముందు నాలుగేళ్ళ పసివాడు మెదిలాడు. వాడు మరెవరో కాదు, తన కొడుకు మురళి.

—మంచం మీద హాయిగా నిద్రపోతున్న మురళిని భుజాన వేసుకుని తీసుకెళ్లి తుల సత్తయ్యకు అప్పజెప్పి వచ్చేశాడు. కాని ఆ అప్పజెప్పడం అంత సులభంగా జరిగిందా? లేదు. తన భుజం మీది కుదుపుకు నిద్రలేచిన వాడు దారిపొడుగునా ఒకటే ఏడుపులంకించుకున్నాడు. దారినపోయే వాళ్ళంతా తనకేసి అదోలా చూస్తూంటే తనకు తల తీసేసినట్లయింది. సొంత తండ్రి భుజం మీద వుండీ కూడా తననెవడో బూచాడు ఎత్తుకు పోతున్నట్టు వాడలా గుక్కపెట్టి ఏడుస్తుంటే చెప్పలేనంత కోపం వచ్చింది వాడి మీద. వెంటనే గట్టిగా రెండు తగిలించాడు. అంతే, వాడి రాగాలాపన ఆగిపోయింది. కాని వెక్కిళ్లు మాత్రం ఆపలేదు.

కాసేపటికి ఆ వెక్కిళ్ళ మధ్యే అడిగాడు:

"నాన్న...మనం ఎక్కడికెళుతున్నాం నాన్నా....?"

"ఎక్కడికా?...వల్లకాట్లోకి! నోరుమూసుకుని భుజం మీద పడుకో. ఇక నుంచీ నువ్వు మళ్ళీ అమ్మమ్మగారింట్లోనే వుండాలి. తెలిసిందా? పేచీ పెట్టావంటే చంపేస్తాను జాగ్రత్త!"

"ఊహుఁ...నేను రాను నాన్నా. వాళ్ళింట్లో వు తను."

వాడి మాటలు పట్టించుకోకుండా ముందుకు సాగిపోతూనే వున్నాడు తను.

తులసత్తయ్యగారిల్లు దగ్గరపడుతున్న కొద్దీ మురళి తన మెడను గట్టిగా యింకా గట్టిగా వాటేసుకున్నాడు. వాడి పట్టు వదిలించుకునే సరికి తల ప్రాణం తోకకొచ్చినంత పనయింది. ఎలాగో అతి కష్టం మీద వాణ్ణి తులసత్తయ్యకు అప్పగించాడు.

అంత రాత్రివేళ వాణ్నలా తీసుకెళ్ళినందుకు ఆవిడకు కంగారు, ఆశ్చర్యం, అనుమానం—అన్నీ ఒకేకాలంలో కలిగాయికాబోలు, తనవంక ప్రశ్నార్థకంగా చూసింది.

అంతలో మురళి తిరిగి తన దగ్గరికే వచ్చేశాడు.

"నాన్నా....నేనిక్కడుండను నాన్నా... నీతో వస్తా నాన్నా..." అంటూ తన కాళ్ళను పెనవేసుకున్నాడు.

తనకు కోపం ఆగలేదు. వెంటనే వాడి చెంప ఛెళ్ళుమనిపించాడు.

కెవ్వుమన్న వాణ్ణి దూరంగా తోసి తులసత్తయ్యకేసి తిరిగాడు.

"అత్తయ్యా....నీతో అన్ని విషయాలూ ముందే మాట్లాడానుకదా!....పసితనంనుంచీ నువ్వే పెంచావు వీణ్ణి. అలాగే ఇంకొన్నాళ్ల పాటు నీదగ్గరే వుండనీ. ఖర్చులకు నెలనెలా డబ్బు పంపిస్తూనే వుంటాను. ప్రస్తుతం ఇది వుంచండి" అంటూ జేబులోంచి ఒక వంద రూపాయల నోటు తీసి ఆవిడ చేతిలో పెట్టాడు.

ఆ నోటు అందుకుంటూంటే తులసమ్మగారి చేతులు వణికాయి. చెమ్మగిల్లిన కళ్లను పైట చెంగుతో అద్దుకుని తనవంక కృతజ్ఞతగా చూసింది.

ఆవిడ తనకు దూరపు బంధువు. తన తండ్రికి చెల్లెలి వరసవుతుంది. భర్త లేడు. కొడుకున్నా వాడివల్ల కష్టనష్టాలే తప్ప సుఖ సంతోషాలు లేవు. అందువల్ల ఆవిడకి అడపా దడపా డబ్బుసాయం చేసే తనంటే ఎంతో ఇష్టం.

తను చెప్పిన పనిని కిమ్మనకుండా చేసేటంతటి కృతజ్ఞతాభావం! అందుకే తను చెప్పిన వెంటనే మురళిని తనదగ్గరుంచుకోవడానికి ఒప్పుకుంది.

'హమ్మయ్య!' అనుకుని తను వెనుదిరగబోయేంతలో మురళి మళ్ళీ గబగబా డేక్కుంటూ వచ్చి "నాన్నా...." అంటూ తన కాళ్ళకు చుట్టుకుపోయాడు.

తనకు ఒళ్ళు మండిపోయి ఎక్కడపడితే అక్కడ ఎడాపెడా కొట్టడం మొదలెట్టాడు.

తులసత్తయ్య పరుగున వచ్చి విడిపించుకోకపోయినట్లయితే ఇంకా ఎంతగా కొట్టేవాడో?

వాళ్ళింట్లోంచి బయటికొచ్చి వీధిలో నడుస్తున్నా ఎంతోదూరంవరకూ వాడి ఏడుపు వినిపిస్తూనేవుంది.

ఆకాశంలో మబ్బులు దట్టంగా అలుముకుపోయి, ఉరుముడం ప్రారంభించగానే తను నడకవేగం హెచ్చించాడు. అసలే మనసంతా ఉద్వేగంగా వుంది. దానికితోడు వర్షం కురుస్తుందేమోనన్న భయంకూడా కలిసి తనను నిముషాలమీద ఇంటికిచేర్చింది. అంతవేగంగా, అంతత్వరగా ఎప్పుడూ నడవలేదు తను.

ఇంటికి వచ్చి చేరాడో లేదో పెద్దపెట్టున వర్షం ప్రారంభమైంది. అప్పటినుంచి ఇప్పటి వరకూ ఇంకా కుండపోతగా కురుస్తూనేవుంది. తన మనసుకూడా ఆకాశంలాగే అల్లకల్లోలంగా తయారయి, ఆలోచనలు తనను వెంటాడి నిద్రపట్టకుండా చేస్తున్నాయి...

గోపాలం పచార్లు ఆపి సిగరెట్టు పీకని అవతల పారేశాడు. నోరంతా దాహంతో ఎండిపోయినట్టనిపించి, మంచినీళ్ళు తాగుదామని వంటగదికేసి నడిచాడు. దారిలో కాలి కింద మెత్తని పదార్థమేదో తగిలి కిచుమంది. ఉలిక్కిపడి లైటువేశాడు. గోపాలం వంగి ఆ వస్తువును చేతిలోకి తీసుకుని చూశాడు— అది మురళికి చాలా ఇష్టమయిన రబ్బరు బొమ్మ. బొద్దుగా ముద్దులొలికేలావున్న ఆ బొమ్మ కాస్తా ఇప్పుడు తనకాలి బరువుకు నొక్కుకుపోయింది. ముక్కు లోపలికి పోయి మొహం వంకరగా తయారైన ఆ బొమ్మను చూస్తూంటే మురళి మళ్ళీ మళ్ళీ గుర్తుకొచ్చాడు. తమకు పుట్టబోయేబిడ్డ రబ్బరు బొమ్మలా బొద్దుగా, అందంగా, ఆరోగ్యంగా వుండాలని తనూ, శ్యామలా ఎన్నెన్నో కలలు కన్నారు. కాని, చివరకు పుట్టిందేమో ఈ నొక్కుకుపోయిన బొమ్మలాంటి వికృత రూపంలో వున్న కొడుకు. ఎడమకాలును లాగిలాగి వేస్తూ, నోట్లోంచి చొంగకారుస్తూ, మెడ వేలాడేసుకుని నెమ్మదిగా నడిచివచ్చే మురళిని చూస్తే జాలితో బాటు జుగుప్సకూడా కలగడం సహజం. కళ్ళు రెండూ వెళ్లకాబట్టి వాడు ఎటు చూస్తున్నాడో ఎవరికీ అర్థంకాదు. తమలాంటి చక్కని అందమైన జంటకు పుట్టిన పిల్లవాడంటే ఎవరూ నమ్మరు. ఎవరిమాటో ఎందుకు, తనే నమ్మలేదు మొదట.

చూట్టానికలా వున్నా తెలివితేటలు మాత్రం అమోఘంగా వున్నాయి వాడికి. తను బయటికి వెళ్ళేటప్పుడల్లా 'నేనూ వస్తా' నని మారాం చేసేవాడు.

వాడి పోరుపడలేక ఎప్పుడైనా ఓసారి వాణ్ణి బజారు తీసుకెళ్ళేవాడు తను. ఇంకేముంది దారినపోయేవాళ్ళందరి చూపులూ వాడిమీదే. కాస్త పరిచయమున్నవాళ్ళయితే ఒకటే ప్రశ్నలు! "మీ అబ్బాయా? పాపం! ఎప్పట్నుంచీ ఇలా వున్నాడు? ఎక్కడైనా చూపించారా? వాళ్లేమన్నారు?"

"ఊహుఁ....వీడిక బాగవడు. వీడిగతి ఇంతే" అని అరిచి చెప్పాలనిపించేది తనకు. మురళిని చూపించని డాక్టరు లేడు. ఇప్పించని ట్రీట్‌మెంటులేదు. అంతా తన కర్మ! నలుగిరిలోనూ పరువు తీయడానికే పుట్టుకొచ్చాడు వెధవ! వాణ్ణి చూసిన వాళ్ళందరూ ఎక్కడలేని సానుభూతి ఒలకబోసారు, తనమీద జాలి కురిపిస్తారు. అంతటితో ఊరుకుంటారా? ఊహుఁ....వీవేవో ఉచిత సలహాలిచ్చి తననీ వాణ్ణీ ఉద్ధరిస్తున్నట్టు పోజు పెడతారు. అది భరించడం తనవల్ల కాదు. అందుకే ఒకరోజు-ఇక చచ్చినా మురళిని ఎక్కడికీ తీసుకెళ్ళకూడదు అని గట్టిగా నిశ్చయించుకున్నాడు....



రచయిత్రి పరిచయం

నివాసం : హైదరాబాదు. సామాన్య గృహిణిని.

18 సంవత్సరాలకు పైగా కథలు రాస్తున్నాను. వివిధ పత్రికలు నిర్వహించిన కథల పోటీల్లో పాల్గొనడం వల్ల యింత వరకు (ప్రథమ, ద్వితీయ తృతీయ, కన్సొలేషన్ బహుమతులు కలుపుకొని) 12 బహుమతులు లభించాయి. ఇవికాక చాలా కథలు వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి నేను రాసిన మూడు నవలల్లో ఒక నవలకు (మేరేజ్‌డే) రెండవ బహుమతి లభించింది. నేను 18 సంవత్సరాల క్రితం రాసిన రెండవ కథ (వాసుదేవరావు)కు ప్రథమ బహుమతి నిచ్చి ప్రోత్సహించిన అప్పటి ఆంధ్రసచిత్ర వారపత్రిక సంపాదకులు కీ॥ శే॥ శివలెంక శంభు ప్రసాద్‌గారికి నేనెప్పుడూ కృతజ్ఞురాలిని

నేను యిప్పటికీ కథల పోటీల్లో పాల్గొనడానికి కారణం—నేను రాసిన ప్రతి కథనూ పరీక్షకు పెట్టాలనే!

నా 'సశేషం' కథకు ప్రత్యేక బహుమతినిచ్చి ప్రోత్సహించిన 'జ్యోతి' సంపాదకులకు కృతజ్ఞురాలిని.

గోపాలం చేతిలో వున్న బొమ్మనుదూరంగా విసిరేశాడు. గబగబా వెళ్ళి గ్లాసెడు మంచి నీళ్ళు గటగటా తాగేశాడు. అయినా ఎందుకో దాహం తీరినట్టే అనిపించలేదు. ఇంకో గ్లాసు తాగాడు. తరువాత ఓ సారి చుట్టూ కలయ చూశాడు. ఇంట్లో ఎక్కడ చూసినా మురళి ఆట వస్తువులే. చిందర వందరగా పడివున్న వాటిల్లో ప్రతి ఆట వస్తువు వెనకా ఒక్కో జ్ఞాపకం ఇమిడి వున్నది ...

మురళి చాలా పెంకెఘటం. ఎక్కడికి తీసుకెళ్ళ కూడదనుకున్నా ఎప్పుడో ఒకసారి తీసుకెళ్ళక తప్పేది కాదు. అలా తీసుకెళ్ళి నప్పుడల్లా ఏదో ఒక ఆటవస్తువు కొనందే ఊరుకునే వాడు కాదు. ఎంత నచ్చజెప్పినా, బుజ్జగించినా మంకుపట్టు వదిలే వాడు కాదు. ఇదుగో యిక్కడ పడివున్న ఎర్రకారు కొన్నప్పుడూ అలాగే జరిగింది...


ఆ రోజు బొమ్మల షాపులో ఎర్రకారు చూసి అది కావాలని పట్టుబట్టాడు మురళి. 'ఇంటి నిండా ఆట వసువు లున్నాయి. ఇంకా ఎందుకు అనవసరంగా?' అని నచ్చజెప్ప బోయాడు కాని వాడు వింటేనా? షాపులోనే గొడవ చేయడం ప్రారంభించాడు. తనకు ఒళ్లు మండిపోయి నాలుగు అంటించాడు; చెవులు మెలేసి బుగ్గలు సాగదీశాడు. జబ్బ మీద గట్టిగా గిల్లాడు. అయినా వాడు తనపట్టు వదల్లేదు: పెంకెతనం మానలేదు.

షాపులో వున్న వాళ్ళంతా తనకేసి ఉరిమిచూశారు. వాళ్ళ దృష్టిలో తనో రాక్షసుడు. పసివాడి కోరిక తీర్చని కిరోకుడు. తనకు ప్రేమ, జాలీ ఏదీలేనట్టూ, అవన్నీ వాళ్ళల్లో పొంగిపొర్లి పోతున్నట్టూ తలోరకంగా ఉపదేశాలు మొదలెట్టారు. ఇక తప్పేదేముంది? ఎర్రకారును కొని బయటికి రాక తప్పలేదు. కాని అంత మంది ముందు తనను రాక్షసుడిలా నిలబెట్టి తనకు తలవొంపులు తెచ్చిందెవరు? ఒక వేలెడు వెధవ! ఆ కోపం కొద్దీ ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు వాణ్ని ఎత్తుకోకుండా నడిపించుకునే తీసుకొచ్చాడు. దూరం నడిచే ఓపిక లేకపోయినా, ఎర్రకారును కొన్న సంతోషంలో పేచీ పెట్టకుండా కుంటుకుంటూ నెమ్మదిగా నడవసాగాడు మురళి. ఆ కారును గుండెలకు గట్టిగా అదుముకుని, మాటిమాటికీ దాన్ని చూసి మురిసిపోతూ వస్తున్న వాణ్ని వాడి మానాన వదిలేసి తను ముందుకు వడివడిగా నడుస్తూండిపోయాడు.

రోడ్డు క్రాస్ చేసేటప్పుడు కూడా వాడికి తనే పిలంగానూ సహాయపడలేదు. తనను సతాయించినందుకు అదే శిక్ష వాడికి వచ్చినటు నడిచిరానీ అనుకుంటూ అలాగే ముందుకు సాగిపోయాడు

"నాన్నా... నా చెయ్యి పట్టుకో నాన్నా.... నాకు భయమేస్తోంది" అని దీనంగా అడిగాడు కాని తనకుమాత్రం వాడిమీద ఏమాత్రం జాలి కలగలేదు సరికదా, వాడివైపు తిరిగైనా చూడకుండా ముందుకు నడుస్తూనే వున్నాడు. అంతలో కీచుమన్న బ్రేకుల శబ్దం వినిపించి చటుక్కున వెనక్కితిరిగి చూశాడు తను- రెండు బస్సులు, ఒక లారీ, ఒక కారు-అన్నీ సడెన్ బ్రేకుతో ఎక్కడివక్కడ ఆగిపోయాయి. డ్రైవర్లందరూ మురళివంక కోపంగానూ, తిరస్కారంగానూ చూస్తున్నారు. అటూ ఇటూ వున్న షాపులవాళ్లూ, రోడ్డుమీద నడుస్తున్నవాళ్లూ వాణ్నే చూస్తున్నారు. అయినా వాడుమాత్రం ఈ గందరగోళం ఏమీ పట్టించుకోకుండా తనమానాన తాను మెల్లి మెల్లిగా నడుస్తూ రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. జరగనున్న ప్రమాదం తల్చుకునేసరికి తన గుండె గుభేలుమంది. అంతక్రితం వున్న కోపమంతా ఏమయిందో గాని ఒక్క ఉదుటున పరుగెత్తుకెళ్లి మురళిని ఎత్తుకుని వచ్చేశాడు. అంతసేపూ ఊపిరి బిగపట్టుకున్నట్టు ఆగిపోయిన వాహనాలన్నీ మళ్ళీ కదిలి థరుమంటూ ముందుకు సాగిపోయాయి.

ఆ రోజు కొన్న ఎర్రకారే ఇది. గోపాలం దానివైపు చివరగా చూసి ఒక్క తన్ను తన్నాడు. దాన్నయితే తన్నాడుకానీ ఇంట్లో వున్న ప్రతి వసువూ వాణ్నే గుర్తుకుతెస్తోంది. వాణ్ని మరచిపోవడం తన సాధ్యం కావడం



లేదు. పోని లైటార్పేసే అవేవీ కనిపించవు కదా అనుకుంటూ స్విచ్చిమీద చెయ్యి వేయబోయాడు. సరిగ్గా అప్పుడే అక్కడ వంకెకు తగిలించి వున్న నీలంరంగు స్వెట్టరువైపు మళ్లింది అతని దృష్టి. దాంతో స్విచ్చిదగ్గరికెళ్లిన చెయ్యి అప్రయత్నంగా అలాగే వుండిపోయింది. ఈ స్వెట్టరంటే మురళికి ఎంతో ప్రాణం. బాగా పాతపడి, అక్కడక్కడ చిరిగిపోయిన ఈ స్వెట్టరు ఇప్పుడు తనకు పట్టనంత చిన్నదయిపోయినా ఇప్పటికీ ఇదే తొడగమని పేచీ పెడతాడు. ఇప్పటి సైజులో కొత్తది కొనిపెట్టినా దాన్ని ఎప్పుడూ తొడుక్కోలేదు. ఇదంటే ఎందుకంత ఇష్టమో మరి!

చటుక్కున ఒక విషయం గుర్తుకొచ్చింది గోపాలానికి. దాంతోపాటు ఏవేవో జ్ఞాపకాలు పైకి తన్నుకొచ్చి కళ్లల్లో కన్నీళ్ళు చివ్వున ఉబికాయి. తడికళ్ళతో ఆ స్వెట్టరువంకే చూస్తూ నిలబడిపోయాడు కాసేపు.

అది శ్యామల, పుట్టబోయే తన బిడ్డ కోసం ఎంతో ప్రేమతో అల్లిన స్వెట్టరు. అప్పుడే కొత్తగా అల్లిక నేర్చుకుందేమో, ఆమె అనుకున్న సైజు సరిగ్గా కుదరలేదు. పూర్తయిన తర్వాత దాన్ని చూసి తను నవ్వాపుకోలేక పడీ పడీ నవ్వాడు. అవకాశం దొరికినప్పుడల్లా ఆమెను వేళాకోళం చేసి ఉడికించడం మొదలెట్టాడు. అయితే శ్యామల చాలా తెలివిగలది. తను చేసింది పొరపాటని ఒప్పుకోక. కావాలనే అలా అల్లానని బుకాయించింది.

"అంటే నీకు పుట్టబోయేబిడ్డ ఇంత పెద్ద సైజులో రాకాసి పిల్లలా వుంటుందన్నమాట!" అన్నాడు తనప్పుడు.

దాంతో ఆమెకు కోపం వచ్చేసింది. స్వెట్టరు తీసి మూలకు విసిరికొట్టి "నా జన్మలో ఇంకెప్పుడూ స్వెట్టరు అల్లను." అంది.

ఆ రోజు ఆమె ఏ దుర్ముహూర్తంలో ఆ మాటందోకాని అది నిజమైంది. మురళిని ఈ లోకంలోకి తీసుకొచ్చి తను మాత్రం ఏవో లోకాలకు వెళ్లిపోయింది...

గోపాలం కళ్ళు తుడుచుకున్నాడు. మనో నేత్రం ముందు ఆనాటి శ్యామల రూపం మెదులుతుంటే ఆ తీయని జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉండిపోయాడు.

శ్యామలకు ప్రసవం చాలా కష్టమయి చివరికి ఆపరేషన్ చేసి తీయాల్సివచ్చింది బిడ్డని. పురిటి స్నానం వరకూ ఆమె బాగానే

వుంది. కాని తనకు పుట్టిన అనాకారి బిడ్డను చూసి అహర్నిశలూ కుళ్లి కుళ్లి ఏడవడంతో ఆమె ఆరోగ్యం దెబ్బతిని బాగా జబ్బు చేసింది. ఆమె జబ్బు నయం చేయించడానికి తనయితే శాయశక్తులా ప్రయత్నించాడు కాని ఆమె మాత్రం అదోరకమైన వైరాగ్యాన్ని పెంచుకుని వేళకు మందులు తీసుకోక నిర్లక్ష్యం చేసింది. చివరికి పరిస్థితి విషమించి శ్యామల మరణించింది. ప్రాణం పోయేముందు ఆమె చెప్పిన మాటలు తన చెవుల్లో ఇంకా గింగిరుమంటూనే వున్నాయి.

"ఏమండీ పెళ్లయిన మూడేళ్లకే మన ముచ్చటతీరిపోయింది. మీతో కలకాలం కాపురం చేసే భాగ్యం నాకు లేకపోయింది... బాబుని మాత్రం నిర్లక్ష్యం చేయకండి. ఇలా పుట్టడంలో వాడి తప్పేముంది చెప్పండి... అదంతా మన కర్మ. అంతే! ఇన్నాళ్లలో మీరు ఒక్కసారికూడా వాడి వంక కన్నెత్తి చూడలేదు. ఇకముందు కూడా ఇలాగే జరిగితే నేను భరించలేనండీ. పసి వెధవ... వాడికేం తెలుసు....ఎంత కష్టంలో వున్నా సరే వాణ్ణి మాత్రం ఏమీ అనకండి. తల్లి ప్రేమ ఎలాగూ లేదు, కనీసం తండ్రి వాత్సల్యమన్నా వాడికి లభించేట్టు చూడండి. అసలు మామూలు పిల్లలకన్నా ఇలాంటి పిల్లలకే ఆదరణ, ఆప్యాయత ప్రేమ, వాత్సల్యం-ఎక్కువ అవసరమండీ... ఇలాంటి అనాకారి పిల్లాణ్ణికని మీ చేతుల్లో పెట్టి పోతున్నందుకు... నన్ను... క్షమించండి...!" అని ఏడ్చేసింది.

తన చేతులు పట్టుకుని ఆమె అలా దీనంగా అర్థిస్తుంటే తనకు దుఃఖం ఆగలేదు. కన్నీళ్ళ రూపంలో దుఃఖం పొంగి వస్తుంటే ఆమె చేయిమీద చెయ్యివేసి "బాబును జాగ్రత్తగా, నా ప్రాణంకన్న మిన్నగా చూసుకుంటాను. నువ్వేం దిగులు పెట్టుకోకు" అని మాటిచ్చాడు.

అది జరిగిన మర్నాడే శ్యామల వెళ్లిపోయింది. ఆమె లేని జీవితం తను ఊహించలేక పోయాడు. శ్యామల చాలా అందగత్తె, పైగా సహృదయురాలు. తనను ప్రాణాధికంగా ప్రేమించేది. అలాంటి భార్య లభించడం తన అదృష్టమని ఎప్పుడూ మురిసిపోతూ వుండేవాడు. అలాంటిది ఆమె తనను ఒంటరి వాణ్ణిచేసి అలా అర్థాంతరంగా వెళ్లిపోయేసరికి తనకు పూర్తిగా మతిపోయినట్టయింది.


ఉయ్యాల్లో నిశ్చింతగా పడుకుని నిద్రపోతున్న పసివాణ్ణి చూస్తూంటే కోపం, ద్వేషం రగిలేవి తనలో. వీడి మూలంగానే కదా తన శ్యామల తనకు లేకుండాపోయింది? వీడూ అందరు పిల్లల్లా లక్షణంగా పుట్టివుంటే శ్యామల కోరి మృత్యువును తెచ్చుకునేది కాదు. తండ్రిగా తాను కోరుకోకూడదుగాని' వీడేపోయి ఆమే బ్రతికుంటే ఎంత బాగుండేది అనిపిస్తూంటుంది ఒక్కోసారి. అలాంటి పిచ్చి ఆలోచన వచ్చినప్పుడల్లా వాడిమీద చెప్పలేనంత కసి పుట్టుకొచ్చేది.

ఇంట్లో సహాయంగా వుంటుందని వచ్చిన తులసత్తయ్య తన పరిస్థితికి జాలిపడి పిల్లవాణ్ణి తన ఇంటికి తీసికెళ్ళింది.

నెలకొకసారి వాడి ఖర్చులకు డబ్బిచ్చి వస్తూండేవాడు తను. అలా వెళ్లినప్పుడల్లా ఆవిడ మురళిని తీసుకొచ్చి తన చేతుల్లో పెట్టబోయేది-ఎత్తుకోమని. ఆవిడ ఏమన్నా అనుకుంటుందేమోనన్న మొహమాటం కొద్దీ ఓసారి చేతుల్లోకి తీసుకుని మళ్లీ యిచ్చేసేవాడు. అంతేగాని ప్రేమగా పలకరించడంగాని, ఎత్తుకుని ముద్దాడడంగాని చేసేవాడు కాదు.

రోజులు నెమ్మదిగా గడిచిపోతున్నాయి. తనూ ఒంటరితనానికి అలవాటు పడిపోయాడు. మురళి కూడా క్రమంగా పెరుగుతున్నాడు కాని తనకూ వాడికీ మధ్య నున్న బాంధవ్యం మాత్రం అంటీముట్టనట్టు అలాగే వుండి పోయింది,

అది చూసిన తులసత్తయ్యకు ఆ బాంధవ్యం ఎక్కడ తెగిపోతుందోనన్న భయం పట్టుకున్నట్టుంది-అందుకనే నడకవచ్చే ఈడు రాగానే వాణ్ణి తిరిగి తనకప్పగించేసింది. "బాబూ... పెద్దదాన్ని చెబుతున్నాను నా మాట విను. వీడు ఇక్కడే-నీకు దూరంగా వుండిపోతే నీమీద ఎప్పటికీ ప్రేమ ఏర్పడదు. కాస్త బుద్ధి తెలిసేసరికి తండ్రయినా దగ్గరుండకపోతే ఎలా చెప్పు?" అని మందలించి



వాణ్ణి ఇంట్లో దింపేసి వెళ్లిపోయింది.

ఇక చేసేదిలేక వాణ్ణి చూసుకోవడానికి రామయ్య అనే ఒక మనిషిని కుదుర్చుకున్నాడు. రామయ్య మంచితనంవల్ల మురళి అతనికి త్వరగానే అలవాటుపడిపోయాడు.

మురళి "నాన్నా....నాన్నా ..." అంటూ తనదగ్గరకు కుంటుకుంటూ వచ్చేవాడు. తనని అలా పిలవాలని రామయ్యే నేర్పించివుంటాడు బహుశా....

—"నాన్నా" అన్న పిలుపు చెవిలో ప్రతిధ్వనించినట్టయి గోపాలం ఉలిక్కిపడ్డాడు. మురళి చిన్నారి చేతుల స్పర్శ ఇంకా కాళ్లకు తగులుతున్నట్టే అనుభూతి పొందాడు. తల గట్టిగా విదిలించి ఓసారి చుట్టూ కలయ చూశాడు. ఇంట్లో ఎక్కడ చూసినా మురళి బట్టలూ, బొమ్మలూ, ప్రత్యేకంగా తయారు చేయించిన వాడి బూట్లూ కనిపిస్తున్నాయి. అవన్నీ కలిసి తనచుట్టూ చేరి వెక్కిరిస్తున్నట్టనిపించింది. మధ్యమధ్య "నాన్నా!... నాన్నా" అన్న పిలుపు కరుణాజనకంగా, ఆర్ద్రంగా వినిపించినట్టయింది.

గోపాలానికి తలతిరిగినట్టయింది. ఎవరినైతే దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నాడో, ఎవరి ఉనికిని మర్చిపోవాలనుకుంటున్నాడో వాడిగురించిన ఆలోచనలతోనే తల మునకలయిపోతున్నాడు ఇప్పుడు. అదే విచిత్రం! "కన్నకొడుకునలా చీదరించుకోవడం, దూరం చేసుకోవడం భావ్యమేనా? వాడి తల్లి బతికుంటే ఇది చూసి సహించేదా? సొంత కొడుకుని ద్వేషించి చీదరించుకునే తండ్రులు ఉంటారా ఎక్కడైనా?" అన్న ప్రశ్నలు ఉదయించాయి గోపాలం మనసులో.

వెంటనే "ఇందులో తన తప్పేముంది గనుక? తన స్థానంలో ఉన్నవాడెవడైనా ఇలాగే ప్రవర్తిస్తాడు." అని తనని తానే సమర్థించుకోడానికి ప్రయత్నించాడు.

మురళి ఉన్నంతవరకూ ఈ ఇంట్లో అడుగు పెట్టనని హేమ ఖచ్చితంగా చెప్పేసింది. మరి అలాంటప్పుడు వాణ్ణి దూరంగా వుంచడం తప్ప మరేం చేయగలడు తను? తనదారి కడ్డంగా-ముల్లులాగా ఉన్న వాడి బెడద వదిలించుకుంటేతప్ప తనజీవితంలో సుఖశాంతులు లభించవు, హేమ తనభార్య కాలేదు; ఈ రెండేళ్ళుగా కరువైన మనశ్శాంతి తిరిగి తనకు లభించదు....

'అబ్బ! ఇక ఎక్కువగా ఆలోచించకూడదు.'

అనుకుంటూ లైటు ఆర్పి ముందు గదిలో కొచ్చాడు గోపాలం. మంచం మీద వెల్లకిలా పడుకొని కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. అయినా నిద్ర మాత్రం అతని దరిదాపులకు కూడా రాలేదు. వర్షం ఎప్పుడు వెలుస్తుందా, ఈ రాత్రి ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూస్తూ అలాగే పడుకుని వుండి పోయాడు.

తెల్లవారితే హేమ వస్తుంది: ఇద్దరూ కలిసి పెళ్ళికి డేట్ నిర్ణయిస్తారు: ఆ పెళ్లి కాస్తా జరిగిపోతే హేమ తనదై పోతుంది: తనశ్యామల స్థానంలోకే రాబోతోంది హేమ.

శ్యామల పోయిన తరువాత హేమ తారసపడేదాకా యింకే అమ్మాయీ తనను ఆకర్షించలేదు. మొదటి రెండేళ్లూ శ్యామల వియోగంతో పిచ్చివాడిలా గడిపాడు తను. మళ్ళీ పెళ్లి అన్నమాటే తలపెట్టకూడదని గట్టిగా నిశ్చయించుకున్నాడు కూడా. బంధువులూ, మిత్రులూ మళ్లీ పెళ్లి చేసుకోమని ఎంత బలవంతం చేసినా తను వినలేదు.

కాని రానురాను ఒంటరితనం తనను కుంగదీస్తుంటే—ఇంట్లో బాధ్యతలు అంతకంతకూ పెరిగి బాధిస్తుంటే—తన నిర్ణయాన్ని మార్చుకోక తప్పలేదు అయినప్పటికి కక్కుర్తిపడి ఎవరో ఒకర్ని పెళ్ళాడ్డానికి తన మనసంగీకరించలేదు. ఏ అమ్మాయిని చూసినా ఆమెలో శ్యామలను చూడడానికి ప్రయత్నించి విఫలుడయ్యేవాడు. ఆమెను చూసిన తన కళ్ళకు యింకే అమ్మాయీ నచ్చలేదు. ఇంకో యిద్దరు ముగ్గురు తనకి నచ్చినా మరళీ సంగతి తెలిసి వాళ్ళు తనను నిరాకరించారు. 'అసలే తను రెండో పెళ్లివాడు. పైగా ఒక అవిటి కొడుకు కూడా వున్నాడాయె. అలాంటప్పుడు అందగత్తే కావాలని పట్టుబడితే ఎలా' అని బంధుమిత్రులంతా తననే విమర్శించే సరికి పెళ్లి పీదే విరక్తిపుట్టి తన కోసం ఎవర్నీ చూడక్కర్లేదని ఖచ్చితంగా చెప్పేశాడు. జీవితాంతం ఆమెతో కలిసిమెలిసి వుండవలసినవాడు తనేగదా....ఎవరో ఒకరు తెమ్మని ఎలా సర్దుకుపోగలడు? ఈ విషయం వాళ్లెవరూ ఆలోచించినట్టు లేదు.

అందం, చదువు, మంచి ఉద్యోగం, కొద్దో గొప్పో డబ్బు అన్నీ వుండి కూడా ఒక్క అనాకారి కొడుకు మూలంగా తనకు అందమయిన భార్య దొరకడం అసాధ్యమయిందంటే ఇక అంతకన్నా అవమానం ఏముంటుంది? అందుకని ఆ ప్రయత్నాలే విరమించుకున్నాడు.

ఈ లోగా తన ఆఫీసులో హేమ అన్న అమ్మాయి కొత్తగా ఉద్యోగంలో చేరింది. మంచి అందం, అణకువ, కలుపుగోలుతనం-అన్నీ వున్న ఆ అమ్మాయి అతి త్వరలోనే ఆఫీసులో అందరి మెప్పు సంపాదించింది. ఆశ్చర్యమేమిటంటే ఆమె దూరం నుంచి అచ్చు శ్యామలలాగే కనిపించేది. ఆ కళ్లు, ముక్కు, నోరు, అన్నీ శ్యామలవే. ఆమె నడకతీరుకూడా కాస్త అటూ ఇటూగా శ్యామల నడకలాగే వుండేది. దాంతో తను త్వరగానే ఆమెపైపు ఆకర్షితుడయ్యాడు.

ఇద్దరిమధ్యా స్నేహం పెరిగింది క్రమంగా చనువుకూడా ఏర్పడింది. ఆమెతో మాట్లాడుతుంటే శ్యామలతో మాట్లాడుతున్నట్టే అనిపించి మనసు ఆనందంతో నిండిపోయేది. ఆమెకు కూడా తనంటే ప్రేమ, సానుభూతి వుందని తెలియడానికి ఆట్టే రోజులు పట్టలేదు. ఈసారి చేతికంది వస్తున్న ప్రేమ భాండాన్ని ఏమైనా సరే వదులుకోకూడదన్న నిశ్చయానికి వచ్చేశాడు తను. దాని కోసం ఏం చేయడానికైనా తను సిద్ధమే హేమతో తనకు మొదట పెళ్లయిందనీ,భార్య పోయిందనీ చెప్పాడుకాని ఒక కొడుకున్నట్టుకాని, వాడు అనాకారి అన్న సంగతికాని చెప్పలేదు. ఆమె గనుక పెళ్లికి ఒప్పుకుంటే ఆ తరువాత సమయం వచ్చినప్పుడు ఆ సంగతి చూసుకోవచ్చు అనుకున్నాడు. అయితే ఆ సమయం అంత త్వరగా అదీ పెళ్లికి ముందే వచ్చేస్తుందని మాత్రం అతననుకోలేదు. ఆ రోజు... హేమ హఠాత్తుగా ఇంటికొచ్చేసింది, అంతవరకూ ఎప్పుడూ ఆమెను తను ఇంటికి తీసుకురాలేదు రమ్మని ఆహ్వానించనూలేదు.



అలాంటిది ఆమె అంతట ఆమె ఇల్లు వెతుక్కుంటూ రావడంచూసి తను తెల్లబోయాడు. కంగారులో అసలు నోటమాట రాలేదు తనకు. కాని ఎలాగోలా సర్దుకుని ముఖంమీద నవ్వు తెచ్చుకుని లోపలికి రమ్మని ఆహ్వానించాడు.

కాసేపు అవీఇవీ మాట్లాడుకున్న తరువాత ఆమె పెళ్లి ప్రస్తావన తెచ్చింది.

తను సందేహిస్తూ కాసేపు మౌనంగా కూర్చుండిపోయాడు. ఆ తరువాత ధైర్యం తెచ్చుకుని "పెళ్లికిముందు నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి హేమా....! అన్నాడు.

హేమ కిలకిలా నవ్వింది.

"అయితే ఇంతకాలంగా మనం చేస్తున్నదేమిటో...?

"అలాకాదు హేమా....సీరియస్‌గా చెబుతున్నా....నీతో కొంచెం వివరంగా మాట్లాడాలి."

"అబ్బ! మాట్లాడకూడదూ? దానికంత తడబాటెందుకో....!" తేలిగ్గా నవ్వుతూనే అంది హేమ.

"అబ్బే....తడబాటుకాదు...."

నా మాట ఇంకా పూర్తి కానేలేదు, అంతలో లోపలినుంచి "నాన్నా...!" అన్న పిలుపు దూసుకొచ్చింది. ఆ పిలుపు వెనకాలే మురళికూడా మేమున్న గదిలోకి వచ్చేశాడు. మట్టిలో పడి పొర్లినట్టున్న మురికి బట్టలు, చాక్లెట్లు తింటూ చొక్కామీద కార్చుకున్న చొంగమరకలు. మెడ వేలాడేసుకుని ఎడమ కాలును లాగిలాగి వేస్తూ కుంటుకుంటూ వాడలా గదిలోకొచ్చేసరికి తనకు అరికాలిమంట నెత్తికెక్కింది.

వెంటనే "రామయ్యా....!" అని ఇల్లంతా అదిరిపోయేలా ఒక్క కేక పెట్టాడు.

"వస్తున్నా బాబుగారూ" అంటూ పరుగెత్తుకొచ్చిన రామయ్యతో "పిల్లిని గదిలోకి రానీయొద్దని నీకెన్నిసార్లు చెప్పాలి?" అని గద్దించాడు.

అతను గజగజా వణికిపోతూ "పొరపాటయిపోయింది బాబుగారూ....నేను వంటింట్లో టీ కలుపుతుంటే చిన్నబాబుగారు వచ్చేసినట్టున్నారు" అంటూ మురళిని తీసుకుని గబగబా అక్కణ్నుంచి వెళ్లిపోయాడు

హేమ వాళ్లు వెళ్లినవైపు ఉత్సుకంగా చూస్తూ "ఎవరండీ ఆ అబ్బాయి?" అని అడిగింది

"మా అబ్బాయే!" ఆ మాట అంటున్నప్పుడు తన తల భూమిలోకి కుంగిపోయినట్లయింది.

హేమ ఉలికిపడింది "ఏమిటీ? మీ అబ్బాయా? మరి ఇన్నాళ్లూ ఈ సంగతి నాతో చెప్పనేలేదే?" అంది. అప్పటికే కోపం, అసహనం ఆమె గొంతులో తొంగి చూస్తున్నాయి.

"చెప్పాలనే అనుకున్నాను హేమా...." అని యింకా ఏదో చెప్పబోతున్న తనను మధ్యలోనే ఆపి 'ఇక చాలించండి మీ నాటకం. నన్ను మోసం చేయాలన్నదే మీ ఉద్దేశం కాకపోతే నా నుంచి యీ సంగతి ఎందుకు దాస్తారు? అదృష్టం కొద్దీ ముందే తెలుసుకున్నాను కాబట్టి సరిపోయిందిగాని లేకపోతే యింకేమన్నా వుందా? నిలువునా గోతిలోకి దిగేదాన్ని. మిమ్మల్ని పెళ్లాడి యీ వెర్రిబాగుల కుంటి కుర్రాణ్ని జీవితాంతం భరించే దాని కన్నా పెళ్లి చేసుకోకుండా యిలాగే వుండిపోవడం ఎంతో నయం." అంది ఆవేశంతో ఊగిపోతూ.

హేమను శాంతపరచి నచ్చజెప్పాలని ఎంతగానో ప్రయత్నించాడు. కాని ఆమె అసలు తన మాటలను వినిపించుకోలేదు. "మీరంటే నాకు ప్రేమ వున్న మాట నిజమే కాని ఆ ప్రేమ కోసం యింత పెద్ద త్యాగం చేయగల ఔదార్యం నాలో లేదు...నేను సామాన్య స్త్రీని. కట్టుకున్న భర్తతో సుఖంగా కలిసి జీవించాలన్న స్వార్థం నాలోనూ వుంది....కాబట్టిమీరు వేరే ఎవరినైనా చూసుకోవడం మంచిది..."

అని కుండ బద్దలుకొట్టినట్టు నిర్మొహమాటంగా చెప్పేసింది.

అయినా తను ఆశ వదులుకోలేక ఆమెను రకరకాలుగా ప్రాధేయపడడం ప్రారంభించాడు. మురళివల్ల తనకే యిబ్బందీ కలక్కుండా చూసుకుంటానని హామీ యిచ్చాడు.

చివరికామె కొంచెం శాంతించి, "వాణ్ని యింకెక్కడైనా వుంచే ఏర్పాటు చేసినట్టయితే పెళ్లి చేసుకోడానికి నాకేం అభ్యంతరం లేదు." అని చెప్పింది.


తను ఆమె షరతుకు అంగీకరించాడు. మొదట్లో రెండేళ్లపాటు వాణ్ని చూసుకున్న తులసత్తయ్య దగ్గరే యిప్పుడూ వుంచవచ్చని ఆలోచించి ఆమెను పెళ్లికి ఒప్పించాడు.

"అయితే రేపొద్దున్న నేనువస్తాను. ఈలోపు వాణ్ని పంపించేసినట్టయితేనే మన పెళ్ళి. అప్పటికి వాడిక్కడే వున్నట్టయితే నేనీ ఇంట్లోకి అడుగు పెట్టేదిలేదు." అని చెప్పి హేమ వెళ్ళిపోయింది.

మాట ప్రకారం ఈ రోజు మురళిని తులసత్తయ్యకు అప్పగించి వచ్చాడు. ఈ విధంగా తన రెండుసమస్యలూ తీరిపోయాయి అనుకున్నాడుగాని ఈ రాత్రి నిద్రపట్టక ఇలా అవస్థపడతాడని మాత్రం ఊహించలేదు....

గోపాలం పక్కకు తిరిగి పడుకున్నాడు. ఇక కొన్ని గంటల్లో తెల్లారిపోతుంది. తెల్లవారగానే హేమ వస్తుంది. ఇట్లో మురళి లేకపోయేసరికి సంతోషపడిపోతుంది. ఆ తరువాత ఇద్దరూ కలిసి పెళ్లికి డేట్ నిర్ణయిస్తారు....

అసలు అప్పుడు మురళి తమ గదిలోకి రాకపోయినట్టయితే ఈ గొడవంతా లేకపోయేది. హేమ వెళ్లిపోగానే తను మురళిని చావబాదేశాడు. వాణ్నలా తన గదిలోకి వదిలినందుకు రామయ్యనూ బాగా కేకలేశాడు. రేపట్నుంచి అలాంటి బాధలేంవుండవు. ఇక ఎప్పటికీ తన యింటికి రాలేడు మురళి. తనూ హేమా హాయిగా, సంతోషంగా, అన్యోన్యంగా వుండొచ్చు.



హేమ అన్నమాటలో తప్పేముంది గనుక? ఆమె ఎంతైనా పెళ్లికాని ఆడపిల్ల. భవిష్యత్తును గూర్చి ఎన్నో బంగారుకలలు కనివుండొచ్చు ఆమె అలాంటప్పుడు పరాయి పిల్లాణ్ని-అందులోనూ అవిటి పిల్లాణ్ని ప్రేమగా చూసుకోవలసిన అవసరం ఆమెకేమొచ్చింది? కన్నతండ్రి అయివుండి కూడా తనే చీదరించుకుంటున్నాడు వాణ్ని.

అయినా ఇందులో మురళిచేసిన తప్పు మాత్రం ఏముందని? వాడేమన్నా కావాలని కోరుకుని అవిటివాడుగా పుట్టాడా? లేదు. అలాంటప్పుడు వాడికి ఇంత ఘోరమైన శిక్ష విధించడానికి తనకేం హక్కుందని? కన్న కొడుకుమీద ఇంతటి అయిష్టతను ఏ తండ్రి అయినా పెంచుకుంటాడా అసలు? ఒకవేళ తనకే ఏ యాక్సిడెంటో జరిగి కాలో చెయ్యో తెగిపోయి అవిటివాడయివుంటే, శ్యామల తనను ఇలాగే నిర్లక్ష్యం చేసి వదిలేసేదా? తిరస్కారంగా చూసేదా? ఇప్పుడు తను మురళి పట్ల ఇంత కఠినంగా ప్రవర్తిస్తున్నందుకు వాణ్ణి ఇంట్లోంచి తరిమేసినందుకు ఆమె ఆత్మ ఎంత క్షోభపడుతోందో...తండ్రి ప్రేమకు వాణ్ణి దూరం చేయనని ఆమెకు మాటిచ్చాడు. కాని వాణ్ని ఏనాడూ ప్రేమగా దగ్గరికి తీసుకోలేదు. తన సుఖంకోసం, స్వార్థంకోసం ఒక అమాయక జీవిని ప్రేమ వంచితుణ్ణి చేశాడు. ఆ తేత మనసును నొప్పించి తను పొందగోరే జీవితంలో సుఖం లభిస్తుందన్న గ్యారంటీ ఏముంది?

హేమ తనకు ప్రశాంతమైన జీవితాన్నే ప్రసాదిస్తుందన్న నమ్మకం ఏమిటి? మరి నమ్మకంలేని ఆ సుఖసంతోషాలకోసం ఆశపడి, ఒక లేత జీవితాన్ని మొగ్గలోనే మాడ్చి మసిచేయడం న్యాయమేనా? ఊహుం... అలా జరగడానికి వీల్లేదు... జరగనివ్వకూడదు.

గోపాలం దిగ్గునలేచాడు. కిటికీ దగ్గరికి నడిచి బయటికి చూశాడు. వర్షం తగ్గిపోయింది. మంద మందంగా చల్లగాలి శరీరానికి తాకుతోంది.

చటుక్కున ఒక నిర్ణయానికొచ్చినట్టు చకచకా బట్టలు వేసుకుని తలుపుకు తాళం పెట్టి తులసమ్మగారింటికి పరుగెత్తాడు.

అంత రాత్రివేళ అతనొచ్చి తలుపు తడ్తే ఆశ్చర్యపోతూ తలుపు తెరిచింది తులసమ్మ. కాని గోపాలం ఆవిడతో ఏమీ మాట్లాడకుండా తిన్నగా లోపలికెళ్ళి గాఢంగా నిద్రపోతున్న మురళిని ఎత్తుకుని భుజాన వేసుకున్నాడు. కుదుపుకు నిద్రలేచిన మురళి అంత దగ్గరలో తండ్రి మొహాన్ని చూడగానే భయంతో కెవ్వున కేకపెట్టాడు. అతని చేతుల్లోంచి తప్పించుకోడానికి ప్రయత్నిస్తూ "నాన్నా....కొట్టకు నాన్నా...! ఇంకెప్పుడూ నీ గదిలోకి రాను.... పేచీలు పెట్టను." అని దీనంగా మొరపెట్టుకోసాగాడు.

అది చూసి గోపాలం హృదయం కరిగిపోయింది. కళ్ళల్లోంచి అశ్రువులు ధారకట్టి మురళి చెంపల మీద కారుతూండగా వాణ్ని గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు అతని ప్రవర్తన అర్థంకాక తులసమ్మ నోరు తెరుచుకుని చూస్తూండిపోయింది.

మురళిని తిరిగి తన ఇంటికితీసుకొచ్చాడు గోపాలం.

○ ○ ○

మర్నాడు ఉదయం ఏడుగంటల వేళ- మబ్బువీడిన ఆకాశంలోంచి లేలేత సూర్యకిరణాలు ఇంట్లోకి ప్రసరించి ఇల్లంతా వెలుగును నింపుతున్నాయి.

గోపాలం తనే స్వయంగా పాలుకాచాడు. పాలగ్లాసు, బ్రెడ్‌ముక్కలు డైనింగ్ టేబుల్ మీదుంచి మురళిని తీసుకొచ్చి కుర్చీలో కూర్చోబెట్టాడు. అయితే టేబుల్ చాలా ఎత్తుగా వుండి వాడికి పాలగ్లాసు అందకపోయేసరికి గోపాలం వాణ్ని ఒళ్లో కూర్చోపెట్టుకుని తనే తినిపించసాగాడు.

సరిగ్గా అప్పుడే తలుపుమీద టక్‌టక్‌మని చప్పుడయింది. గడియపెట్టని తలుపు తోయగానే తెరుచుకుంది. వెంటనే బయటినుంచి చల్లటి గాలి లోపలికి జొరబడి గోపాలం ఒళ్ళంతా గగుర్పొడిచింది తలతిప్పి చూశాడు, హేమ.

హేమ మురళిని చూడగానే ఆశ్చర్యం ఆపుకోలేక "ఇంకా వీడిక్కడే వున్నాడేం?" అని గట్టిగా అరిచింది.


గోపాలం మురళిని ఇంకా దగ్గరగా అదుముతూ "అవును. ఇక్కడే వున్నాడు. వుంటాడుకూడా. వీణ్ని నేనెక్కడికీ పంపదల్చుకోలేదు" అన్నాడు.

హేమ కళ్ళల్లో కోపం పెల్లుబికింది. ఆమె ఏదో అనేలోగానే గోపాలంమళ్ళీ శాంతస్వరంతో చెప్పాడు: "నేను బతికున్నంతకాలమూ మురళి నాదగ్గరే వుంటాడు. హేమా...బాగా ఆలోచించుకో... ఇంకా గడపమీదే నిలబడివున్నావు. అడుగు లోపలికి వేయాలో, బయటికో నువ్వే నిర్ణయించుకో...!"

అనుకోని ఈ పరిణామానికి విస్తుపోయింది హేమ. జవాబు ఏం చెప్పాలో తెలియక తికమక పడిపోయింది.

గోపాలం కాసేపు మౌనంగా ఆమెనే చూస్తూండిపోయాడు. ఆమె లోపలికి రాదని అతనికెలాగూ తెలుసుకాబట్టి నిర్వికారస్వరంతో అన్నాడు : "ఎందుకలా తటపటాయిసావు హేమా?....వెళ్లదల్చుకుంటే తలుపు దగ్గరికి చేరవేసి వెళ్ళు."

కోపం, ఆవేశం, అవమానం, నిరాశ- ముప్పిరిగొనగా గిరుక్కున వెనక్కితిరిగి వెళ్ళిపోయింది హేమ. ✳



శేఖరం గుమ్మందగ్గరికి వచ్చేసరికి కోటేశ్వరరావూ, సరోజినీదేవి దిగేరు. జ్యోతి దిగుతోంది వాళ్ళను చూసి తెల్లబోయాడు. వెనతిప్పి వెనకాలే వస్తున్న తల్లితో "హైదరాబాదు నుంచి కోటేశ్వరరావుగారూ వాళ్ళూ వచ్చేరు" అని వాళ్ళకి ఎదురు వెళ్ళాడు. కూడా బావి వున్నాడు.

"ఎప్పుడొచ్చారూ" నవ్వుతూ పలకరించేడు. పైకి నవ్వుతున్నాడేగాని వాళ్లు రాకూడని సమయంలో వచ్చినట్టుగా ఇబ్బందిగా వుందతనికి, వాళ్ళు ఎందుకొచ్చారో కూడా అతనికి అర్థమయింది.

శాంతమ్మగారు కూడా పలకరించి వాళ్ళని కూర్చోబెట్టి లోపలికొచ్చి "ఎవరో వచ్చేరు. టిఫిను ఎక్కువగా చేయి" అని చెప్పి మళ్ళీ వాళ్ళదగ్గరకొచ్చి కూర్చుంది.

వచ్చినవాళ్లు ఎవరా అన్న ఆసక్తి మీరాకి లేదు. ఆవిడ చెప్పివెళ్ళినప్రకారం చేయసాగింది.

శేఖరం వాళ్ళతో మాట్లాడుతున్నాడేగాని అతని ధ్యాసంతా మీరామీదే వుంది. మీరాని చూస్తూనే సరోజినీదేవి ఆశ్చర్యంగా అవీ ఇవీ అడుగుతుంది. వాళ్ళింటి కెడుతుంది. తను వెళ్ళి మీరాని వాళ్ళు చూడకుండా వెళ్ళిపొమ్మన్నా బాగుండదు. తల్లికి సమాధానం చెప్పుకోవాలి. మీరా వాళ్ళని చూసి ఒక్కసారిగా కంగారు పడకుండా, చెప్తే మంచిదనిపించిందతనికి.

శాంతమ్మగారు అరుణకి ఆడపిల్లఅనీ, పెళ్ళి నాలుగురోజు లయిందనీ-ఇంకా అవీ ఇవీ చెప్తోంది.

శేఖరం లేచి లోపల కొచ్చేడు.

మీరా గబగబా పూరీలు వత్తుతోంది. మీరాకి ఓ అడుగు దూరంలో నిలబడి "చుట్టాలు వచ్చేరు తెలుసా?" అన్నాడు.

"చెప్పేరు" తలెత్తకుండానే పూరీ వత్తుతూ బదులిచ్చింది ముభావంగా.

"వచ్చినవాళ్ళు ఎవరో కూడా తెలుసా?"

మీరాకి కోపం వచ్చింది. ఎవరయితే తనకేం. చేయమన్నది చేయటం. మీరా మాట్లాడ లేదు. మూకుడులో పూరీ తిరగేస్తోంది...

"హైదరాబాదునుంచి రావుగారూ ఆయన కుటుంబం వచ్చేరు."

చివ్వున తలెత్తింది మీరా. ఆశ్చర్యంతో-భయంతో విశాలమైన మీరా కళ్ళు ఇంకా విశాలమైనాయి. భయంతో కొద్దిగా నోరు తెరుచుకుంది. పూరీ తిరగేస్తున్నదల్లా అలాగే బిగుసుకుపోయినట్లు నిలబడిపోయింది. వాలుగా వున్న అట్లపుల్ల నుంచి స్రరున వేడివేడి నూనె కారి మీరా వేళ్ళను తాకింది.

"అబ్బా" అంటూ అట్లపుల్ల వదిలేసింది.

"కాలిందా!" కంగారుగా అడిగేడు.

లేదన్నట్లు తల వూపింది. మీరా గుండెలు దడదడ లాడాయి. కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి

మీరా ఎంత కంగారు పడుతోందో శేఖరం గ్రహించేడు.

"ఎందుకలా అయిపోయావు? ఒక్కసారిగా వాళ్ళకి ఎదురుపడితే భయపడ్తావని చెప్పేను" అన్నాడు. మీరా మాట్లాడలేదు. ఏం మాట్లాడుతుంది?

శేఖరం హాల్లోకి వెళ్ళిపోయాడు.

మీరాకి కాళ్ళూ చేతులూ పట్టు తప్పిపోయినట్టుగా అయినాయి. ఏమాలోచించటానికీ మెదడు మొద్దుబారిపోయినట్టయిపోయింది. స్థాణువులా అలాగే నిలబడిపోయింది. మూకుడలో వున్న పూరీ నల్లగా మాడిపోయింది.

శాంతమ్మగారు లోపలకి వచ్చి "అయిందా మీరా" అని అడిగింది.

"అవుతోందండి" అని మాడిన పూరీ ఆవిడ చూడకుండా పక్కన పడేసి మిగిలినవి గబగబా చేయసాగింది.

శాంతమ్మగారు మిఠాయీ, మినపసున్నీ తీసి ఇవతల పెట్టింది.

మీరా పూరీలు చేయడం కూడా అయింది.

"అయిందా! నీళ్ళు పెట్టి, టీ గబగబా పెట్టు" అని వాళ్ళని పిల్చుకురావడానికి వెళ్ళిపోయింది.

మీరా—ఒంట్లో శక్తినంతటినీ కూడదీసుకుని ధైర్యంగా నిలబడటానికి విశ్వప్రయత్నం చేస్తోంది. "తనేం కంగారుపడిపోకూడదు—జరిగేది ఎలాగూ జరుగుతుంది. అసలు ఇలా జరుగుతుందని తను కలనైనా వూహించిందా? ఎంత ధైర్యం తెచ్చుకుని మొండి తనంగా నిలబడలేదు.

శాంతమ్మగారు చెప్పిన ప్రకారం పళ్ళాలలో అన్నీ సర్దింది. మీరా మంచినీళ్లు పెట్టకుండానే వాళ్ళు వచ్చేశారు. వంటగదిలో జగ్‌లోకి నీళ్ళు పోస్తున్న మీరా వూపిరి బిగపట్టి నిటారుగా నిలబడింది.

"నీళ్ళేవీ" శాంతమ్మగారి మాటతో వులిక్కిపడి సర్దుకుంది. "తెస్తున్నానమ్మా" అంది. ఆవిడ వెళ్ళిపోయింది.

మీరా నీళ్ల జగ్గూ, గ్లాసులూ తీసుకుని వచ్చింది. గుమ్మం వరకూ వచ్చిన మీరా క్షణం సేపు ఆగి, ధైర్యం తెచ్చుకుని గుమ్మందాటి ఇవతలికి వచ్చింది.

శాంతమ్మగారు ఏదో అన్నమాటకి "అంతే అంటారా" నవ్వుతూ అంటున్న సరోజినీదేవి, శాంతమ్మగారి మాటలు శ్రద్ధగా వింటున్నట్లు కూర్చున్నా-క్షణక్షణానికి శేఖరం కేసి వోర చూపులు ప్రసరిస్తున్న జ్యోతి-మీరాని చూస్తూనే ఎగిరి పడ్డారు. శాంతమ్మగారి మాటలు అతి శ్రద్ధగా వింటున్న కోటేశ్వరరావు భార్యా, కూతురు ఆశ్చర్యంతో నోళ్ళు తెరవటం చూసి తల తిప్పి చూశాడు, మీరా ఫలానా అని ఆయన గుర్తు పట్టకపోయినా-వయసులో వున్న అమ్మాయి-గృహిణిలా నిండుగా కొంగు కప్పుకుని మంచినీళ్ళ గ్లాసుల్తూ, జగ్గూ పట్టుకొస్తున్న మీరాని చూసిన ఆయన చూపులు వెంటనే జరజర శేఖరం మీదకి సోకినాయి.

ఎడంచేయి గుప్పిటగా మార్చి చెంపకి ఆన్చుకుని కుడిచేతి వేళ్ళతో బల్లమీద రాస్తూ తలవంచుకున్న శేఖరానికి రావుగారి తీక్షణమైన చూపుల్ని ఎదుర్కొనే ప్రమాదం తప్పింది. అతను తల ఎత్తి ఎదుర్కోకపోయినా మీరాని ఇక్కడచూసి వాళ్ళెలా తల్లక్రిందులవుతారో ఇందాకనే వూహించేడు.

గుమ్మందాటి నాలుగయిదు అడుగులు వేసేదాకా తలొంచుకుని వచ్చిన మీరా యధాలాపంగా తలెత్తినట్టు ఎత్తింది. క్షణం ఆశ్చర్యపోయినట్టు నటించి పల్కరింపుగా చిన్నగా-పెదవులు విడివిడకుండా చిన్నగా నవ్వింది.

"మీరా-ఇక్కడ... ఇక్కడున్నావా?" ఏ పనయినా బయటపడిపోకుండా ఒక్క చిరునవ్వుతో హుందాగా అన్నీ ఎంతో నేర్పుతో చక్కదిద్దుకునే సరోజినీదేవి చాలా ఆశ్చర్యంగా అరచినంత గట్టిగా అడిగింది. కుర్చీలో ఇటూ అటూ కదుల్తూ.

జ్యోతి కొరగా-మింగేసేలా శేఖరంకేసి చూసింది. ఇంచుమించుగా కోటేశ్వరరావూ అలాగే చూశాడు.

సరోజినీదేవి మాటతో శేఖరం నిదానంగా తల ఎత్తేడు. "తీసుకోండి. ఏమిటి ఆలస్యం" అన్నాడు మామూలుగా. అప్పుడు శేఖరంకేసి తిరిగాయి సరోజినీదేవి చూపులు.

మీరా మామూలుగా గ్లాసులు అక్కడ పెట్టి నీళ్ళు పోస్తోంది.

సరోజినీదేవి వదిలి పెట్టదలుచుకోలేదు. కుర్చీలోంచి లేచింది. మీరా భుజం నిండుగా కొంగు కప్పుకుని వుండడంవల్ల వాళ్ళకేదీ అర్థంకాక అతలాకుతలమైపోతున్నారు.

సరోజినీదేవి మీరా భుజం మీద చేయివేసి, ఆనెపంతో భుజం మీద కొంగు కొంచెం జరిగేలా చేస్తూ "మీరా! ఈ వూళ్ళో వున్నారా, మీరు! అంత హఠాత్తుగా ఎందుకొచ్చేశారు?" అని అడిగింది.

మీరా చేయి వణికింది—గొంతు తడారి పోయింది. ఒక్క గుటక మింగి గొంతు పెగల్చుకుని ఎలాగో నెమ్మదిగా అంది "ఈ వూళ్ళోనే వుంటున్నామండీ!" అని ఆవిడని తప్పించుకుని వచ్చేసింది.

మీరా వాళ్ళకి బాగా తెలుసుకావును అనుకున్న శాంతమ్మగారు "రండి కూర్చోండి. మీరా మీకు తెలుసా?" అని అడిగింది.

సరోజినీదేవి దృష్టంతా మీరా మీద వున్నా 'సభ్యత' అనే పదానికి గౌరవం యిచ్చే సరోజినీదేవి బలవంతంగా వచ్చి కూర్చుంది. "మీరా తెలియక పోవటం ఏమిటి! వాళ్ళమ్మ మా స్కూల్లోనే టీచరుగా పని చేసేది—ఎందుకో హఠాత్తుగా రెండేళ్ళ క్రితం చెప్పకుండా వెళ్ళిపోయారు" అంది. ఆ కాస్త మాటకే రొప్పుతున్నట్టుగా అయింది. అసలే తెల్లని మనిషేమో మొహమంతా ఎర్రగా—కందినట్లుగా అయింది.



ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ



ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య

సర్వతోముఖాభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ పయనం

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ మార్గదర్శకత్వంలో శ్రీ టి. అంజయ్య ఆంధ్రప్రదేశ్ సేవలో 100 రోజులు పరిపూర్తి చేశారు. శ్రీ అంజయ్య నాయకత్వాన రాష్ట్రం సపదైశ్వర్యాల దిశగా ముందడుగు వేస్తోంది.

సాధించిన ప్రధాన విజయాలు

ప్రధాని 20 అంశాల ఆర్థిక కార్యక్రమాన్ని, సంజయ్‌గాంధీ 5 అంశాల కార్యక్రమాన్ని నిరాఘాటంగా అమలు జరిపారు.

5 ఎకరాల మాగాణి, లేదా 10 ఎకరాల మెట్టభూమి గల రైతులను భూమిశిస్తు నుంచి మినహాయించారు.

రుణాల చెల్లింపు వాయిదాలు పెంచడం, తగినన్ని ఎరువులను సరఫరా చేయడం, పంటల భీమా పథకం, ధాన్యోత్పత్తులకు మద్దతు ధర పెంచడం వగైరా చర్యల ద్వారా రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు పెక్కు ప్రోత్సాహకాలు, సబ్సిడీలు ప్రకటించారు.

- ప్రకృతి వైపరీత్యాలను, ఉపద్రవాలను అధిగమించేందుకు వీలుగా ప్రతి జిల్లాకు ప్రత్యామ్నాయ పంటల కార్యక్రమంలో ఒక అత్యవసర పథకం రూపొందించారు.
- వడ్డీపై వడ్డీ వసూలు చేయరాదని సహకార పరపతి సంస్థలను ఆదేశించారు.
- 65 సంవత్సరాల వయస్సుపైబడిన వ్యవసాయ కార్మికులకు, అనాధలకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు.
- మీటరుపై ఆధారపడిన టారిఫ్ పద్ధతికి బదులు హార్స్‌పవరుపై ఆధారపడి ఒకే పద్ధతిలో విద్యుచ్ఛక్తి రేటుపైన విద్యుచ్ఛక్తి టారిఫ్‌ను రైతులకు విధించాలని నిర్ణయించారు.
- 1.3 లక్షల ఎకరాల మిగులు భూమి పంపిణీ కార్యక్రమాన్ని ఉధృతం చేశారు.
- 1980-81లో రు. 5 వేలు ఖర్చుకాగల (ఒక్కొక్కదానికి) 50 వేల ఇళ్ళకు తోడుగా బలహీన వర్గాలకు సుమారు 3.5 లక్షల ఇళ్ళను నిర్మించాలని సంకల్పించారు.
- రాష్ట్రంలోని దుర్భిక్షపీడిత ప్రాంతాలలో ప్రజల సహాయార్థం ప్రభుత్వం ఇంతవరకు రు. 11 కోట్లు విడుదల చేసింది. త్వరలోనే మరో 16 కోట్ల రూపాయలు పంపిణీ చేస్తుంది.
- రైతులకు సేద్యపునీటి సౌకర్యాలను మెరుగుపర్చేందుకు కృష్ణానదిపైన రు. 76 కోట్లు వ్యయంకాగల జూరాల ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.
- ప్రాజెక్టులను త్వరత్వరగా ఖరారు చేయడంలో పారిశ్రామికవేత్తలకు సహాయపడేందుకు ఒక ఉన్నతాధికార కమిటీని నిర్మించారు.
- రాష్ట్రప్రభుత్వ సంస్థ అయిన ఆల్విన్ సామాన్య మానవునికి ఉపకరించే వాచ్‌లను ఉత్పత్తి చేస్తోంది. ఈ వాచ్ ఫ్యాక్టరీకి ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు.
- అనంతపురం జిల్లాలో 40 కిలోవాట్ల ఉత్పాదకశక్తి కల కొత్త జలవిద్యుత్ ప్రాజెక్టులను నిర్మించనున్నారు.
- ఎన్. జి. ఓ.ల పరిస్థితుల మెరుగుదలకుగాను ప్రభుత్వం రాయితీలను ప్రకటించింది.
- అవినీతిని తొలగించేందుకు ప్రతిజ్ఞ పూనింది.

రాష్ట్ర సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

మీరాని చూస్తూ ముగ్గురికి ముగ్గురూ అలా ఎందుకం పోయారో శాంతమ్మ గారికి అంతు పట్టలేదు.

"ముందు ఫలహారం కానీయండి. తర్వాత మాట్లాడుకుందాం" అంది శాంతమ్మగారు.

'ఇంతకీ మీరాకి యిక్కడ ఎటువంటి స్థానం?' ముగ్గురికీ అర్థంకాలేదు.

'అలా అయితే "మా కోడలు" అని పరిచయం చేయకుండా వుంటుందా?—లేకపోతే యిక్కడ ఎందుకున్నట్లు' ముగ్గురూ తమలో తాము అనుకోకపోలేదు.

ఇంత క్రితం వున్న హుషారు వాళ్ళలోలేదు. మౌనంగా ఫలహారాలు ముగిశాయి. మీరా టీ తీసుకొచ్చి అందరికీ అక్కడపెట్టి లోపల కెళ్ళింది.

మళ్ళీ శాంతమ్మగారికి హార్లిక్స్ తీసుకొచ్చి యిచ్చింది.

'ఇంత చనువుగా పిళ్ళ అవసరాలు తీరుస్తున్న మీరా—ఇక్కడ' ఇంక వుండబట్టలేక అడిగేసింది సరోజినిదేవి "మీరా వాళ్ళు మీకు బంధువులా?" అని..

అరుణ స్నేహితురాలు—మీరా చదువుకున్నది అని తెలిశాక మీరా ఎవరని యిలాగే అడిగితే మాకు బాగా తెలుసున్న వాళ్ళు అని చెప్పింది. ఇప్పుడు కూడా "మాకు తెలుసున్న వాళ్ళే" అంది.

"అంటే!..." అర్థోక్తిలో ఆగిపోయింది సరోజినిదేవి.

"నాకు ఒంట్లో బాగుండటంలేదు—సహాయంగా వుంది" అని చెప్పింది.

సరోజినిదేవి తేలిగ్గా గాలి పీల్చుకున్నా వెంటనే గుండెల్లో ఏదో గుబులు బయలుదేరింది.

కుర్చీకి వెనక్కి ఆనుకుని కూర్చున్న జ్యోతి శేఖరాన్ని నిశితంగా పరీక్షిస్తున్నట్టు చూస్తోంది. కోటేశ్వరరావు మాటలు మర్చిపోయినట్టుండి తర్వాత శేఖరంతో కబుర్లలోకి దిగేడు.

"మీరా! వక్కపొడి తీసుకురా" శాంతమ్మగారు పిలవటంతో మీరా వక్కపొడి భరిణె అక్కడ పెట్టి వెళ్ళిపోయింది. మామ్మూలుగా అయితే శాంతమ్మగారు చెప్పక్కరలేకుండా తనే తెచ్చేది.

అది వరకు హైదరాబాద్‌లో వుండగానే మీరాకి యీ కుటుంబంతో పరిచయం వున్నట్టు సరోజినిదేవికి తెలుసు. అది అరుణతో స్నేహం వరకే అనుకుంది.

సరోజినిదేవి భర్తకి వెళ్ళమన్నట్లు సౌంజ్ఞ చేసింది.

కోటేశ్వరరావు "శేఖరం, రా, వాళ్ళు మాట్లాడుకుంటారు. ఆడవాళ్ళ మాటలు మన కెందుకు" అంటూ లేచాడు.

శేఖరం లేచి ఆయన వెనకాలే వెళ్ళేడు.

సరోజినిదేవి అంది "ఎవరికో ఒంట్లో బాగాలేదని వెళ్ళేరు—ఆ వెళ్లటం వెళ్ళటం మళ్ళా రాలేదు, ఎందుచేతో" అని "మీరా" అని పిల్చింది.

మీరా వినపడినా వినపడనట్టే వుండిపోయింది.

శాంతమ్మగారు "మీరా! ఆవిడ పిలుస్తున్నారు ఇలా రా" అని పిల్చింది. దాంతో మీరా తప్పనిసరిగా యివతలకి వచ్చింది.

మీరా టేబుల్ మీద ప్లేటులు, గ్లాసులు తీయసాగింది.


"మీ అమ్మగారు ఎక్కడా" అని అడిగింది సరోజినిదేవి.

"ఇక్కడే వుంటున్నామండీ!" మీరా తలెత్తకుండానే అంది.

"ఇక్కడంటే?" ఇక్కడంటే యీ యింట్లోనా—ఈ వూళ్ళోనా అర్థంకాలేదు."

మీరా కొద్దిగా తలెత్తి కోపాన్ని అణుచుకుంటూ జవాబిచ్చింది. "ఈ వూళ్లోనే."

"మళ్ళా రాలేదేం?" మీరానే సూటిగా చూస్తూ అడిగింది.



"ఆవిడకి ఒంట్లో బాగుండటంలేదండి."

"అహా, అలాగా! నేను వస్తాను. అంత హఠాత్తుగా మకాం ఎత్తేయటంతో—ఎవరికీ అర్థం కాలేదు"

"ఎందుకండీ మీకు శ్రమ! అమ్మని నేను తీసుకొస్తాను" అని మీరా ప్లేట్లు, గ్లాసులూ తీసుకుని వెళ్ళిపోయింది.

సరోజినిదేవి మీరాని అలా గుచ్చిగుచ్చి ఎందుకడుగుతోందో శాంతమ్మగారికి అర్థం కాలేదు.

సరోజినిదేవి లేవటంతో శాంతమ్మగారూ లేచింది. జ్యోతికూడా లేచి వాళ్ళకన్న ముందే తండ్రి శేఖరం వున్నచోటికొచ్చి శేఖరంపక్క ఖాళీగా వున్న సింగిల్ సోఫాలో కూర్చుంది. శేఖరం ఇబ్బందిగా కదిలేడు.

ఆ వెనకాలే శాంతమ్మగారు సరోజినిదేవి రావటంతో శేఖరం లేచి "కూర్చోండి" సరోజినిదేవితో అని ఆ యిబ్బంది నుండి విముక్తి పొందేడు.

శేఖరం వచ్చి తల్లి పక్కన కూర్చొన్నాడు.

'ఇంకా తల్లి పక్కలో పాపాయే!—హుం! భగవంతుడు అందం యిచ్చేడు—అవసరాలకి లోటు లేకుండా ఏదో యింత యిచ్చేడు—ఏం లాభం? జీవితాన్ని ఎలా 'ఎంజాయ్' చేయాలో తెలియని మూర్ఖుడు' కసిగా అనుకుంది జ్యోతి. శేఖరాన్ని మింగేలా చూస్తూ.

ఓ అర్ధగంట లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు

అయిదు గంటలు దాటింది.

సరోజినీదేవి కోటేశ్వరరావూ వెళ్లతానే మాట్లాడుకున్నారు.

"మీ అబ్బాయికి యీ ఏడాది పెళ్లి చేయరా?" కదిపింది సరోజినిదేవి.

"నాదేముందండీ!" అంది శాంతమ్మగారు.

"మీది కాకపోతే ఎవరిది? మీరే చెప్పాలి—మీరే చేయాలి" సరోజినీదేవి వదిలి పెట్ట దలచుకోలేదు.

అసలు యీ రోజు మామూలుగా మాట్లాడి రేపు శాస్త్రిగారిని కూడా తీసుకొచ్చి పెళ్లి విషయాలు మాట్లాడాలనుకున్నారు. అందుకే ఈరోజు జ్యోతిని తీసుకొచ్చేరు. మీరాని యిక్కడ చూడగానే ఆలస్యం అమృతం విషం అనిపించింది ఆ దంపతులకి.

"మీరు చెప్పింది బాగానే వుందమ్మా! కాని విడిగా చెప్పడానికి! వింటే వాడికి నచ్చిన పిల్లని చేయడానికి నాకేం అభ్యంతరం లేదు—నా శక్తికి తగ్గట్టుగా—ఏ లోపం రాకుండా చేస్తాను" అంది శాంతమ్మగారు.

భర్త ఏదేనా అంటాడేమోనని కాస్సేపు చూసింది సరోజినీదేవి.

ఆయనా ఆలోచిస్తున్నాడు ఎలా మొదలెడితే బాగుంటుందా అని.

ఆలస్యాన్ని భరించలేని సరోజినిదేవి, "ఏదో శాస్త్రం చెప్పినట్టు చల్లకొచ్చి ముంత దాచడమెందుకూ? మీ అభిప్రాయం అడగటానికే వచ్చేము" అంది.

"అవునమ్మా! పిల్ల ఎదురుగానే వుంది. మనమేం కొత్తవాళ్లం కాము. అందుకే అమ్మాయిని కూడా అరమరిక లేకుండా తీసుకొచ్చేము—మనమీ స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకుంటే బాగుంటుంది" అన్నాడు కోటేశ్వరరావు.

జ్యోతి శేఖరంకేసి ఓరగా చూసింది.

మూలగా—నిలువెత్తు స్టూలు మీదున్న ఫ్లవర్ వాజ్ మీద నిల్చి వున్నాయి అతని చూపులు. అతనికేసి చూసిన కోటేశ్వరరావుకి అసలతను తమ మాటలు వింటున్నాడా—వినపడు తున్నాయా అన్న అనుమానం వచ్చింది.

"ఏమిటోయ్, శేఖరం మాట్లాడవు" అన్నాడు.

"ఏమిటండీ!" అన్నాడు యిటు తిరిగి సర్దుకు కూర్చుంటూ.

"బాగుంది. ఇంత వరకూ మా మాటలే వినలేదా!" నవ్వుతూ అడిగింది సరోజినీదేవి.

శేఖరం చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

ఇది నాన్నుడు వ్యవహారంగా తేల్చేయటం సరోజినీదేవికి బొత్తిగా యిష్టంలేదు. "మీరే అడగండి. మాకు చెప్పడానికి మొహమాటంగా వుంటుందికదా?" శాంతమ్మగారిని ఉద్దేశించి అంది.

ఈ పద్ధతి శాంతమ్మగారికీ నచ్చలేదు. వాళ్లు ఎదురుగా వుండి—అప్పటికప్పుడు చెప్ప మంటే ఎవరు చెప్తారు? అనుకుంది.

"ఎవరికేనా చెప్పచ్చు. ఇంకా వుంటారు కదా?" ఎటూగాకుండా అంది.

జ్యోతి లేచి వరండాలోకి వెళ్లి అక్కడ పచార్లు చేయసాగింది. వాళ్లు ఎంత నింపాదిగా మాట్లాడుకున్నా అక్కడకి వినపడతాయి.

సరోజినీదేవి భర్తకేసి భావయుక్తంగా చూసింది.

ఆయన సోఫాలో కాస్త అటూ, ఇటూ కదిలి సర్దుకు కూర్చున్నాడు. తర్వాత యిలా అన్నాడు "శేఖరం. నీయందుండే చనువుతో అడుగుతున్నాను. నీ అభిప్రాయమేమిటో చెప్పు. ఎందుకంటే ఈ విషయం ఇదివరకే నీకూ, అమ్మగారికి చెప్పేను—ఇప్పుడే మీ దగ్గర కదిపి నిన్ను యిప్పుడే చెప్పమనడం సబబు కాదనుకో!" ఆగాడాయన.

భర్త అడిగిన తీరు సరోజినీదేవికి సంతృప్తికరంగా అనిపించలేదు—ఎదుటి మనిషిని గుక్కతిప్పుకోవటానికి లేకుండా—వూపిరి కూడా పీల్చుకోడానికి వీలులేని విధంగా సమా ధానం ఆశించినట్లు అతి నేర్పుగా అడిగే భర్త—ఇంత అతి సాధారణంగా అడిగేదేమిటా అను కుంది.



A quality product of Tungabhadra Industries Ltd. Kurnool.

శేఖరం—వాళ్ళు వచ్చినప్పటినుంచీ సిద్ధంగా వుంచుకున్న సమాధానం—ఎప్పుడు ఎలా చెప్తే బాగుంటుందో—అది కూడా మీరా వుండగా—మీరాకి వినపడేలా చెప్పాలని చాలా విలువైన మాటని ఎన్నిక చేసుకున్నాడు.

'ఇదే సమయం! అది యిప్పుడు చెప్పేస్తేనే బాగుంటుంది' అనుకున్నాడు.

సరోజినీదేవి యింకా అతనేమంటాడోనని ఆసక్తిగా కొద్దిగా ముందుకి ఒరిగింది.

వరండాలో పచార్లు చేస్తున్న జ్యోతి టక్కున ఆగిపోయింది. అతను చెప్పబోయే సమాధానంకోసం ఒళ్ళంతా చెవులు చేసుకుని—వూపిరి బిగపట్టి నిలబడిపోయింది.

ముఖ్యమయిన కాగితాల మీద అతి ముఖ్యమయిన సంతకం కోసం ఆతృతగా ఎదురు చూసే వ్యాపారస్తుడిలా చూస్తున్నాడు కోటేశ్వరరావు.

"ఇద్దరు భార్యలుండటం చట్టవిరుద్ధం కదండీ!" గంభీరంగా అతని నోటివెంట వచ్చిన ఈ మాటలకి శ్రోతలు స్థాణువులే అయినారు.

సరోజినీదేవికి నెత్తిమీద మంచు పర్వతమే పడినట్టయింది—

జ్యోతి—పక్కలో బాంబు ప్రేలినట్లు అదిరిపడింది.

శాంతమ్మగారికి అంతా అయోమయంగా వుంది—

మొట్టమొదట సరోజినీదేవి తేరుకుంది.

"నీకు పెళ్ళయిందా?" అలా అంటూనే శాంతమ్మగారికేసి తిరిగింది.

"ఒక కొడుకు కూడా" వెంటనే మృదు గంభీరంగా అని, లేచి నిలబడ్డాడు. అతని చూపులు కర్టెను వెనకాల సీతకోసం వెదుకుతున్నాయి.

అతనంత ఖచ్చితంగా, నిర్భయంగా చెప్తోంటే నోటిమాట రానివాడిలా గుడ్లప్పగించి చూస్తూండిపోయాడు కోటేశ్వరరావు.

ఖంగారుగా అంది శాంతమ్మగారు "ఏమిటి చినబాబూ! పెద్ద వాళ్ళతో వేళాకోళమా?"

"అమ్మా!" ఏదో చెప్పాలన్నట్లు అన్నాడు శేఖరం.

"చాల్లే! ఇంటి కొచ్చిన పెద్ద మనుషులతో అలాగేనా మాట్లాడేది? ఇంకా చిన్నతనమే!" బలవంతంగా నవ్విందావిడ.

ఎప్పుడూ ఎవరినీ అవమానించినట్లుగాని—అమర్యాదగాగాని మాట్లాడి ఎరగని కొడుకు అలా అర్ధం—పర్ధంలేని మాటలు మాట్లాడుతోంటే ఆవిడ నమ్మలేకుండా వుంది.

"చాలా కాలంగా ఒకళ్ళుగా మసులుతున్నాము ఆ మాత్రం స్వతంత్రంగా మాట్లాడితే తప్పేంలేదు" హాయిగా నవ్వేస్తూ అంది సరోజినీదేవి.

కోటేశ్వరరావు గట్టిగా నవ్వేస్తూ "ఛలేవాడివయ్యా మొత్తానికి" అన్నాడు.

అతని మాటలు ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. ఈ సంగతి తప్పించుకోవడానికే అతను అలా అన్నాడని శాంతమ్మగారితో సహా అందరు అనుకున్నారు.


శేఖరానికి మీరాని ఒక్కసారి చూడాలని—తన మాట మీరా మీద ఎలా పని చేసిందో చూడాలని మనసు తహతహలాడుతోంది. ఆ ఆతృతని అణుచుకోలేక పోయాడు. ఇప్పటికయినా తన దృఢమైన అభిప్రాయం తెలుసుకుంటుంది—

అతను తల్లికేసి తిరుగుతూ, "అమ్మా! షర్బత్ కలిపియ్యి" అని, "నువు కూర్చో! అప్పి గ్లాసులు తీసుకురా" అని ఓకేకపెట్టి లోపలకొచ్చేడు. అతని వెనకాలే అప్పి వచ్చింది.

మీరా కనపడలేదు—

శేఖరం తనవెనకాలే వున్న అప్పికేసి తిరుగుతూ "అమ్మాయిగారేది? అని అడిగాడు.

"ఎల్లిపోయారండి" అందది.



"వెళ్ళిపోయిందా?!" అతనికి చెప్పలేనంత నీరసం వచ్చేసింది.

"ఎంతసేపయింది వెళ్ళి?" విసుగ్గా అడిగాడు.

"చాలా సేపయిందండీ! అమ్మగారితో తర్వాత చెప్పు అని ఎల్లిపోయారండీ!" సాగదీసుకుంటూ చెప్పింది.

"మీరా ఎప్పుడో వెళ్ళిపోయిందా! తను అన్న అంత విలువైన మాట-ఇద్దరిమధ్యా వున్న ఇనుప గోడల్ని ఛేదించే విలువైన మాట మీరా వినకుండానే వెళ్ళిపోయిందా? అంతమందిలో అంత ఖచ్చితంగా తన అభిప్రాయం చెప్పినందుకు-తన అభిప్రాయం ఎటువంటిదో తెలుసుకుని తనని అసహ్యించుకోకుండా తనని అర్ధం చేసుకుంటుందని తలచి అన్నమాట వినకుండానే వెళ్ళిపోయిందా!!"

"గళాసులు అక్కడెట్టమంటారాండి" అప్పి మాటతో ఉలిక్కిపడి "ఊం. నడు" అన్నాడు. అతనికి మీరామీద చాలా కోపం వచ్చింది"అతనికి చెప్పలేనంత తిక్కగా వుంది. చేతిలో వున్న షర్బత్ సీసా గోడకేసి కొట్టాలనిపించింది.

శేఖరం యాంత్రికంగానే షర్బత్ కలిపి అందరికి ఇచ్చేడు.

శేఖరం షర్బత్ కలుపుతోంటేనే జ్యోతి లోపలికి వచ్చింది.

వాళ్ళు కొంచెంసేపు కూర్చుని, వెళ్తామని లేచేరు.

"అదేమిటి, వెళ్ళిపోవడమేమిటి? మా ఇంట్లో వుండి వెళ్ళాలి" అంది శాంతమ్మగారు తనూ లేస్తూ.

"మీరు వుండేలా చేయండి. తప్పకుండా వుంటాం" అనేసింది సరోజినీదేవి.

అంకా తనదే లోపం అన్నట్లు సరోజినీదేవి మాట్లాడుతోంటే శాంతమ్మగారికి కాస్త కష్టమనిపించింది. ఆవిడ ఏదో అనబోతోంటే కోటేశ్వరరావు అన్నాడు: "మరి ఆ పనిమీద వచ్చేంకదా! కలిసితే అతకవంటారు కదండీ!"

"మనమేం కొత్తవాళ్ళమటండీ! మీరు ఉండకుండా వెళ్తే మా మనసులు బాధపడతాయి" అంది శాంతమ్మగారు.

శేఖరం కూడా చెప్పేడు వుండమని.

"రేపు మళ్ళీ వస్తాం" అన్నారు భార్యాభర్తలిద్దరూ.

శాంతమ్మగారి దగ్గర, శేఖరం దగ్గర సెలవు తీసుకుని కారు ఎక్కేరు భార్యాభర్తలు. జ్యోతి శాంతమ్మగారికి చెప్పి "నమస్కారమండీ! వస్తాను" అంది.

"మంచిదమ్మా!" జ్యోతితో అని, రావుగారి దంపతులతో అంది మళ్ళీ "రేపు భోజనాలకి ఇక్కడకే రావాలి. చినబాబు వస్తాడు."

"రావటం వస్తాం. భోజనాలసంగతి పెట్టుకోకండి. ఏవో ఆచారాలూ నమ్మకాలు వున్నాయిగా! వాటిని కాదనటం దేనికి?" అంది నవ్వుతూ సరోజినీదేవి.

"మీరలా అంటే ఏం చెప్పాలి" అంది శాంతమ్మగారు.

"మీరలా అనకూడదు" అన్నారిద్దరూ.

కారు కదిలేవరకూ అక్కడే నిలబడి వెనక్కి వచ్చి వరండాలో బల్లమీద కూర్చుంది శాంతమ్మగారు.

ఆ పూటే కాస్త లేచి తిరుగుతున్న శాంతమ్మగారికి వాళ్ళు వచ్చినప్పటినుంచీ కాస్త అటూ, ఇటూ తిరిగి ఆ కాస్త మాట్లాడేసరికే నీరసం వచ్చినట్టయిపోయింది. తల్లి వెనకాలే శేఖరం రాలేదు.

"మీరా" పిల్చింది శాంతమ్మగారు.

ఎటువంటి సమాధానం లేదు.

మళ్ళీ పిల్చింది. సమాధానం లేదు. తర్వాత "అప్పీ మీరాని పిలు" అని పిల్చింది. అప్పి వచ్చి మీరా వెళ్ళిపోయిందని చెప్పింది.

"వెళ్ళిపోయిందా! ఏం?" అంది. మీరా చెప్పకుండా ఎప్పుడూ వెళ్ళదు అనుకుంటూ.

"ఏమోనండీ తెలవదు. మీకు చెప్పమన్నారండీ"

శేఖరం వచ్చేడు. ఏం కావాలమ్మా" అని అడిగాడు.

"ఏమీవద్దు నాయనా" అని లేస్తూ అప్పిని అడిగింది "మీరా మళ్ళీ వస్తాననిచెప్పిందా?"

"ఏమోనండీ, తెలవదు" అందది.

"ఏం కావాలమ్మా! నువు కూర్చో! ఏమిటి అలా వున్నావేం" అన్నాడు.

వాళ్ళున్నంతసేపూ ఏదో ఉగ్గబెట్టుకుంది. ఇప్పుడు నీరసం ఆవిడ ముఖంమీద కొట్టొచ్చినట్టు కనపడుతోంది.

ఆవిడ మళ్ళీ కూర్చుంటూ "కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టు బాబూ" అంది.

శేఖరం గ్లాసుతో నీళ్ళు తీసుకొచ్చి ఇచ్చేడు. "హార్లిక్స్ తాగుతావా?" అని అడిగాడు. ఆవిడ గ్లాసు కిందపెడుతూ "వద్దు" అంది.

"నీరసంగా వున్నావు, బత్తాయిరసం తాగు" అన్నాడు.

"ఇప్పుడేం వద్దు బాబూ!" అని క్షణం ఆగి, అంది "వాళ్ళడిగిన ప్రశ్నలకి బాధపడిందేమో మీరా. అసలు ఎప్పుడూ అలా చెప్పకుండా వెళ్ళదే!"

వెంటనే అనేశాడు శేఖరం "అభిమానం, ఆదరణా అందిస్తే—అందుకోవటం కూడా తెలియాలి—మొండితనం" అతను అలా అనటంలో మీరా వెళ్ళటంతో అతనికెంత కోపం వచ్చిందో ముడుచుకున్న కనుబొమలే చెపుతున్నాయి.

"అదేమిట్రా!" తెల్లబోతూ అందావిడ.

"చెప్పి వెళ్ళాలని తెలియదూ! అవతల వాళ్ళు మాట్లాడుతున్నారు—ఏదేనా అవసరం వచ్చినా అంతేనా?" విసుగ్గా అని లోపలికి వెళ్ళిపోయాడు.

○ ○ ○ ○ ○

మర్నాడు ఉదయం తొమ్మిది కావస్తున్నా మీరా రాలేదు.

క్రితం రోజు మీరా చెప్పకుండా వెళ్ళటమే కాకుండా మళ్ళీ రాకపోవటంతో "ఎందుకా" అనుకున్న శాంతమ్మగారికి యీ పూట తొమ్మిది కావస్తున్నా రాకపోయేసరికి ఆవిడకి కోపం వచ్చింది. సరోజినీదేవి వాళ్ళు మీరాని చూస్తూనే అలా అయిపోవటం—ఏమిటేమిటో మీరాని ప్రశ్నలు వేయటం—మీరా చెప్పకుండా వెళ్ళి మళ్ళీ రాకపోవటం, అంతా అర్థం కాకుండా పోయింది

'తను యిలా వున్నానని తెలిసి కూడా మీరా ఎందుకురాలేదు?' అనుకుంది.

"ఇంకా ఆవిడగారు రాలేదా?' తల్లిని అడిగాడు శేఖరం.

"రాలేదు రా. ఎందుచేతో" అందావిడ.

"రాదేమో!" పేపరు చూస్తూ అన్నాడు.

"తల్లి లేవలేదేమో. కాస్సేపు చూసి కబురు చేయచ్చు."

శేఖరం మాట్లాడలేదు.

"అవునూ, నిన్ను అడగబోతే మాటల్లోదాటేసి వెళ్ళిపోయావు. వాళ్ళతో అలాగేనా మాట్లాడేది! ఇష్టంలేకపోతే యిష్టంలేదని చెప్పాలి. తప్పించుకోవటానికి పెళ్ళయింది, పిల్లలున్నారని చెప్తావా?" అని అడిగింది.

పేపరు కొద్దిగా పక్కకు జరిపి అన్నాడు. "పెళ్ళయిందని చెప్పానా?"

"ఇద్దరు భార్యలుండటం చట్టవిరుద్ధమన్నావు—ఒక కొడుకని కూడా అన్నావు. ఆ అమ్మాయిని చేసుకోవటం యిష్టంలేకపోతే మర్యాదగా ఎవరిద్వారానయినా చెప్పించాలిగాని, ఇలా అపవాదులు నీకై నువ్వే సృష్టించి చెప్పుకుంటావా? నువ్వే అంటే యింక వున్న వాళ్ళకి అడ్డేముంది! తలోమాటా అంటారు" మందలింపుగా బాధగా అంది శాంతమ్మగారు.

శేఖరం ముఖం ఎర్రగా-గీసిన కందలా అయింది.

"నువ్వు సమానూ అంటూ పుటాపుగా నీకేం కాలక్షేపం అవటంలేదని. నేను పెళ్ళి చేసుకుంటే వాళ్ళతో ఆడుకుంటాననీ" నవ్వుతూ అన్నాడు.

"బాగుందిరా నాయనా! అందుకని పిల్లనిస్తానని వచ్చినవాళ్ళ దగ్గరల్లా పెళ్ళయింది పిల్లలున్నారని చెపుతాడు. ఆ మాటలే నీ పిల్లలు. ఆ మాటల్తోటే కాలక్షేపం చేస్తాను..." బాచి రావటంతో ఆవిడ ఆగిపోయింది.

శేఖరం బాచిని వరండాలోకి తీసుకొచ్చి అడిగాడు "నీకు వాళ్ళిల్లు తెలుసుకదూ!"

"ఎవరండీ" అన్నాడు బాచి ఎవరో అర్థంకాక.

"మీరా వాళ్ళిల్లు. నిన్న చెప్పకుండా వెళ్ళిపోయిందట. మళ్ళీ రాలేదు. ఇంతవరకూ రాలేదు. వెళ్ళి అమ్మగారు లేవలేదు, రమ్మన్నారని చెప్పు."

"సరేనండి. ఒకవేళ వాళ్ళమ్మగారికి ఒంట్లో బాగుంతలేదేమోనండి. లేకపోతే అక్కమానదు" అన్నాడు బాచి.

"కబురన్నా చేయాలిగా! చెప్పందే ఎలా తెలుస్తుంది. వెళ్ళిరా."

బాచి మెట్లు దిగుతోంటే వెనక్కి పిల్చి చెప్పేడు "అమ్మ చెప్పిందని చెప్పు."

బాచి "సరే" నని వచ్చేశాడు.

మీరా సరోజినీదేవివాళ్ళు వచ్చినట్టు తల్లికి చెప్పలేదు. రాత్రంతా చాలాసేపు చెప్పడమా మానడమా అని ఆలోచించింది. వాళ్ళు వచ్చేరంటే తల్లి చాలా కంగారుపడిపోతుంది. వాళ్ళ

ఇంటికి వస్తే అప్పుడే చూసుకోవచ్చు. తను ఇంట్లోనే ఉంటుందిగా అనుకుని వూరుకుండిపోయింది.

వీధితలుపు చప్పుడవడంతో ఉలిక్కిపడింది మీరా.

"ఎవరో వచ్చేరు చూడూ" అంది కాంతమ్మ.

ఈలోగా మళ్ళీ తలుపు తట్టిన శబ్దం.

మీరా వెళ్ళి తలుపు తీసింది. బాచి "నువ్వా!" అంది తేలికపడ్డ మనసుతో. "బాచీ నల్లపూసయిపోయాడు" అంది కాంతమ్మ.

"ఈవేళ అక్క ఖాళీగా వున్నట్టుందే" అన్నాడు బాచి.

"ఏమో ఈవేళ వెళ్ళక్కరలేదంది. కూర్చో. ఇప్పుడే వస్తాను" అని కాంతమ్మ బాచికి కాఫీ తీసుకురావటానికి లోపలికి వెళ్ళింది.

"ఏమక్కా ఈరోజు వెళ్ళలేదు" అని అడిగాడు.

"ఇంక వెళ్ళను" ముభావంగా చెప్పింది.

"ఏమక్కా ఏమయిందీ? అమ్మగారు ఏమైనా అన్నారా?"

"ఛా, ఆవిడని అనుకోవడం పాపం"

"మరి..." సందేహంగా ఆగిపోయాడు బాచి.

"ఎన్నాళ్ళనుండో మానేయాలని బాచీ! అమ్మగారు ఒప్పుకోలేదు. అరుణ వస్తుందికదా అని వూరుకున్నాను. అరుణ వెళ్ళిన మర్నాటినుంచీ మానేయాలనుకున్నాను. సరే ఆవిడకి ఒంట్లో బాగు డలేదు. అప్పుడు మానేస్తే బాగుండదని వూరుకున్నాను."

"నిన్న చెప్పకుండా వచ్చేశావుట అమ్మగారు నిన్ను తీసుకురమ్మన్నారక్కా! ఆవిడ లేవలేదు."

"ఒంట్లో బాగుండలేదుట అని చెప్పు బాచీ! నేను వెళ్ళకపోతే వాళ్ళే ఇంకో మనిషిని చూసుకుంటారు."

"అలా ఎందుకూ నువ్వే వచ్చి చెప్తే బాగుంటుందేమో అక్కా! రావటం కుదరటంలేదని చెప్పు. నేనుకూడా చెప్తాను."

"నిన్న వచ్చినవాళ్ళు వున్నారా."

"వాళ్ళు మాయింట్లో వున్నారు. ఏం అక్కా" సరోజినీదేవి మాటలు అతనేం వినలేదు.

"అబ్బే. వూరికినే."

"ఆలస్యముందా బయలుదేరటానికి."

"పోనీ మధ్యాహ్నం నేను వచ్చి చెప్తాను; ఇప్పుడు నువ్వెళ్ళి చెప్పు."

నసిగేడు బాచి. "ఇప్పుడే వచ్చి చెప్తే బాగుంటుందికదా! ఆవిడ నువ్వొస్తావన్ని చూస్తున్నారు."

కాంతమ్మ బాచికి కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది.

"మీచేతి కాఫీ తాగి చాలా రోజులయిందండి పిన్నిగారూ!" అంటూ అందుకున్నాడు.

కూతురు చెప్పలేనుకోవడం చూసిన కాంతమ్మ "ఈరోజు వెళ్ళనన్నావుగా" అంది.

దానికి బాచి వెంటనే జవాబు చెప్పేడు "వాళ్ళ బాబుకి జ్వరం వచ్చిందటండీ! అక్కా అక్కా అని ఏడుస్తున్నాడట. అక్కని తీసుకరమ్మని అమ్మగారు నన్ను పంపేరు."

మీరా, బాచీ బయటకొచ్చేశారు.

(సశేషం)

అంతర్జాతీయ మేధావుల ఆలోచనా మథనం!

చేతవెన్నముద్ద

— వాకాటి

రాజులు వందల మంది వున్నారు, కానీ బీతోవెన్ మాత్రం ఒక్కడే!

అతడేమంత గొప్పగరి కాడు, సొగసరి అంతకన్నా కాడు. ధనికుడు కాడు, పెద్ద పదవి నలంకరించినవాడూ కాడు. కాని ఒకసారి ప్రష్యన్ రాజు గురించిన ప్రసక్తి అతడి ఎదుటవస్తే—అతగాడెటువంటి సంకోచమూ లేకుండా నిబ్బరంగా "నేనూ రాజునే!" అన్నాడు.

ఎవడతడు?

దేవుళ్ళనూ, దయ్యాలనూ, బానిసలనూ, యోధులను, చీకటి శక్తులతో లోకుల పోరాటాలను, ఆనందోద్రేకాన్ని, బాధాతిమిరాన్ని, కోట్లాది గుండెల చప్పుళ్ళని పిలిచి, తన ఊహతో ప్రాణంపోసి, శబ్దంతో మలిచి సంగీతంతో అందాలు దిద్ది ప్రపంచానికి వెలలేని కానుకలుగా ఇచ్చిన సంగీత సార్వభౌముడు!

ఒకసారి అతడి సంగీత రూపకం చూచి, విని తన్మయత్వంతో ద్రవించిన వందలాది ప్రేక్షకులను చూచి ఆ కళాకారుడు ఆనందంతో, కృతజ్ఞతతో తలవంచగా చూచిన ఒక శ్రోత "కళారహస్యాన్వేషణలో పండిన ఆ తలను చూస్తే, ఆ సుసంపన్నమైన సంగీత వైవిధ్యాన్ని వింటే—మంచు కప్పిన అగ్నిపర్వతం గుర్తుకొస్తుంది" అన్నాడట!

ఆ మంచుకప్పిన అగ్ని పర్వతం పేరు,

29వ యేట బీతోవెన్



పాశ్చాత్య సంగీతశిఖరాలలో ఆ ఎవరెస్టు పేరు లుడ్విగ్ వాన్ బీథోవెన్!

మొజార్ట్, హెయ్‌డన్ వంటి హేమాహేమీలున్న ఆనాడు —"ఒక రాజ్యంలో తాను రాజునని రాజుకే తెలుసు" అన్న బీథోవెన్ రాజసం చూస్తే మన శ్రీనాధుడు గుర్తుకు వస్తాడు.

కాని పేదరికంలో పుట్టి పేదరికంలోనే పెరిగి కేవలం తన సంగీతశక్తిద్వారా దేశదేశాలనేలిన ఆ ఏలిక ఏనాడూ ఎవరికీ తల వంచలేదు. తనకు సాయంచేసిన వారినికూడా, వారి మాట కాని, చేతకాని ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వుంటున్నట్టు తోస్తే విదిలించి పారేసేవాడు.

"మన రాజులకన్న అల్పులుండబోరు. ఉన్న ధనం పోతే వారు గడ్డిబొమ్మలవుతారు. డబ్బుతో, అధికారంతో ఒకణ్ణి రాజుగారి సభలో సభ్యుడిగా చేయవచ్చుగాని వారొక గెథెనిగాని, ఒక బీథోవెన్‌ను గాని చేయగలరా!" అని ప్రశ్నించిన బీథోవెనే-"ఆ కళవాడి సమాజంతో కలుస్తూ వుండాలి, కాని వారి నెత్తిని మొట్టికాయలు వేస్తూ వుండాలి!" అన్నాడు.

అతడిని ఆర్థికంగా ఆదుకుని సాయపడిన లాబ్‌కొవిట్జ్ యువరాజు ఇంట ఒకసారి బీథోవెన్ ఒక సంగీత కార్యక్రమం ఒద్దిక (రిహార్సల్స్) ఏర్పాటుచేశాడు. ఆనాడు ముగ్గురిలో ఒక బాసూన్ (నాదస్వరంలాంటిది) వాద్యకారుడు రాలేదు. "ఒక బాసూన్ లేనంత మాత్రాన పెద్ద తేడా ఏమీరాదుగా" అన్నాడు యువరాజు. అంతే బీథోవెన్ ఒద్దికనక్కడితో ఆపేసి, చరచర లేచి వెళ్లుతూ గుమ్మందగ్గర వెనక్కు తిరిగి-"లాబ్‌కొవిట్జ్ సంగీతం తెలియని గాడిద!" అని చెప్పి మరీ ఇంటికి వెళ్లిపోయాడు....


మరొకసారి సంగీత ప్రియుడు, బీథోవెన్ అభిమాని అయిన లూయీ ఫెర్డినాండ్ యువరాజు తన ఇంట బీథోవెన్ సంగీత కచ్చేరి, విందు ఏర్పాటుచేశాడు. అక్కడికి రాగానే విందుకోసం యువరాజుగారికి వారి ఇద్దరు మిత్రులకు ఒక మేజా, తనకు విడిగా దూరంగా ఒక మేజా ఏర్పాటుచేయడం చూచి ఆగ్రహంతో చెడామడా తిట్టి వెళ్ళిపోయిన బీథోవెన్‌ను ఉపశమింపచేయడానికి ఆ రాజుగారు ఇంకో విందు ఏర్పాటుచేసి తనకు రాణిగారికీ మధ్య అతడిని కూచోబెట్టుకోవాల్సి వచ్చింది.

అందుకనే అతడి మిత్రుడయిన షుప్పనిఘ్—"బీథోవెన్ ఈ భూమ్మీద వున్న అకాడెమీలన్నిటికీ రారాజూ, నియంతాకూడాను!" అని వర్ణించాడు....

ఇంతటి దూర్వాసుడూ, సంగీతంలోకి వెళ్ళిపోతే కుసుమసదృశం అయిపోయేవాడు. లాలిత్యం జాలువారే అతడి సంగీత రచనలకు ఈనాటికీ రసజ్ఞలోకం కనుల నీరు కారుస్తుంది. ధనంతో, అధికారంతో, మదంతో పొట్టేలులా ఢీకొన్న ఈ మేరువే ప్రకృతితో, పిల్లలతో, శిష్యులతో, తాను ప్రేమించిన వారితో మెలిగేటప్పుడు అతి కోమలంగా వుండేవాడు!

ఏమిటి ఈ వైరుధ్యం? ఎందుకీ సంఘర్షణ! అని తెలుసుకోవాలి అంటే బీథోవెన్ బాల్యంలోకి వెళ్లాలి. తండ్రి రోడ్డెంపట్టేవాడు, కాసీ తాగుబోతు, తల్లి పుడమితల్లివలె ఓపికగా సంసారాన్ని నడిపేది. ఎడాపెడా అప్పులు చేసి తండ్రి పారిపోగా ఒక పక్క ఆకలితో, మరోపక్క అప్పులవాళ్ళ తిట్లు అవమానాలతో కుంచించుకు పోయేవాడు బీథోవెన్. ఆ తల్లి కూడా కన్నుమూయడంతో ప్రపంచమంతా తన శత్రువులా కన్పించగా దానినెదుర్కోవడానికి వరప్రసాదము యిన తన అపూర్వ సంగీతమే ఆయుధంగా వాడుకున్నాడు బీథోవెన్ ఈ పీడకలలాటి బాల్యమే అతడినంత పెడసరంగా తయారుచేసిందనుకోవచ్చు....

అతడి తాతగారయిన లుడ్విగ్ వాన్ బీథోవెన్ (మనుమడి పేరూ అదే). చక్కటి ఫిడేలు విద్వాంసుడు, చక్కటి గాత్రసంపద కలవాడు. రాజాస్థానంలో సంగీత కళాకారుడు ఆయననుండే మనుమడి రక్తం



లోకి ప్రవహించిన సంగీతం కట్టలు తెంచుకొని పరుగులెత్తింది, పరవశంతో నాట్యం చేస్తూ రసికులను ప్రమోదంలో ముంచెత్తింది.

తన పన్నెండవ యేట కొలోన్ యువరాజు కొలువుకో ఆర్గాన్ వాద్య కళాకారుడుగా చేరాడు బీథోవెన్. క్రిస్టియన్ గాటిలెబ్ నీఫ్, హేయ్‌డన్, ఆల్‌బ్రెష్ట్‌బెర్గర్, సలియేరిల వద్ద ఆ రత్నం సానపెట్టబడింది.

బీథోవెన్‌కు పదహారేళ్ళ వయసప్పుడు సంగీత ప్రపంచంలో ధృవతారగా వెలుగొన్న 31 సం॥ల మొజార్ట్ ఒక ఇతివృత్తాన్ని ఇవ్వగా, అప్పటికప్పుడు బీథోవెన్ దానినాధారంగా ముప్పావుగంట పియానో మీద అద్భుతంగా రూపకల్పన చేసి వాయించాడు. "ఇతడొకనాడు ఈలోకమంతటినీ ఏలే సంగీతకారుడవుతాడు-" అని జోస్యం చెప్పాడు మొజార్ట్.

1770 లో పుట్టి 1827 లో కన్నుమూసిన లుడ్విగ్ వాన్ బీథోవెన్ సుమారు 200 దాక సింఫనీలు, సొనాటాలు, ట్రియోలు, క్వార్టెట్లు, బాలేలు, ఏరియాలు, పాటలు కాక "ఫిదెలియో" అన్న ఒకే ఒక ఆపెరా (సంగీత రూపకం) కూడా రచించాడు, పియానో, వయొలిన్ల మీద వాయించాడు, వాద్యబృందానికి నాయకుడిగా ఆ రచనలకు జీవంపోసి వాటిని చిరంజీవులుగా నిలబెట్టాడు. ధనికుల వద్ద, తన రచనలనచ్చు వేసిన విక్రేతల వద్ద ముక్కుపిండి డబ్బు వసూలు చేసిన యీ మహానుభావుడు తన శిష్యుల నుండి ఒక గవ్వయినా పుచ్చుకోలేదు. తాను—ఆర్జించిన దానిని దాన ధర్మాలకు వినియోగించే వాడు.

తన పైలాపచ్చీసు ముగియగానే అతడిలా రాసుకున్నాడు " పాతికేళ్ళు గడిచిపోయాయి. ఈ సంవత్సరం యీ మనిషిని తేల్చివేయాలి. శరీరం బలహీనమయినా సంకల్పం దృఢంగా వుండాలి. ఏదో ఒక ఒడ్డుకు తీరాలి —" అతడంలోని ఆత్మవిశ్వాసం అతడి రచనలన్నిటలోను ద్యోతకం అవుతుంది.

ఇంతటి సంగీత సామ్రాట్టుకు 31వ ఏటచెవుడు రావడం అన్నది కళాకారులతో విధి ఆడే ఆట కాకపోతే యింకేమిటి? ప్రేమలో వైఫల్యం, నా అన్న వారు లేరన్నబాధ ఐశ్వర్యాధికారాలతో నిరంతరం పోరాటం, ఆస్త్మా కాక చెవుడు—వీటన్నిటిని అధిగమించి కమనీయ సంగీత కళా స్రవంతులను సృష్టించిన ఆ మహోన్నత వ్యక్తిత్వానికి - ఈనాటి మరుగుజ్జులం మనం ఏమని నివాళులర్పించగలం? పదాల పరిధికిలోబడని వ్యక్తిత్వం అది....

చెవుడు వచ్చిన తర్వాత-బీథోవెన్ అనేక అద్భుతమైన రచనలు చేశాడు, కాని ఏనాడూ అతడు ఎవరినీ తన సంగీతరచన ఎలావుందని అడగనూ లేదు, అలాగని ఒక్క అప్రశతిని

కూడా పళ్ళించనూ లేదు! 'జీనియస్' అంటే ఇదే కాబోలు! తన కళలో సంపూర్ణంగా లీనమయి అంతర్ముఖుడయిన యోగికి బాహ్యేంద్రియాలతో పనిలేదు కాబోల్ను... మొదట తన చెవిటి తనం గురించి సిగ్గుపడిన బీతోవెన్ కొంత కాలానికి ఆ బలహీనత నుండి బయటికి వచ్చాడు. తన సంగీతంలో సెతయేరై అందరినీ తనలో కలుపుకుని జీవనంలో ముందుకు సాగాడు.

ఒకానొక పబ్లిషరుకు వుత్తర రాస్తూ బీతోవెన్—"కళాకారుడికిగాని, రచయితకు గాని అతడి రచనకు తగినంత పారితోషికం ఇవ్వడం కాదు, అతడు ఏ చీకూచింతా లేకుండా తనలోని కళను వెలయించడానికి, సమాజం అతడి నుండి ఏది ఎదురు చూస్తున్నదో దానిని అతను సమర్పించడానికి దోహదం చేసేలాగున అతడిని పోషించాలి, ఆదుకోవాలి-" అన్న మాటలు ఈనాటి రచయితలకు స్వప్నంలా ధ్వనించడం ఈ జాతి దౌర్భాగ్యం కాకపోతే ఏమిటి? మనిషి అంటే, పశువు కాకపోతే, ఉత్తి శరీరం కాకపోతే, మనిషంటే మెదడు, మనసు, హృదయం అయితే—కధగా, కవితగా, పాటగా, పద్యంగా, చిత్రంగా శిల్పంగా, నాట్యంగా మనిషిలోని చైతన్యాన్ని వెలిబుచ్చుతూ, ఇంకో వెయ్యేళ్ళ తర్వాతనో వందేళ్ళ తర్వాతనో రాబోయే నిండు మనిషికి విత్తనాలు వేసున్న నేటి సృజనాత్మక కళాకారులు 'దేహీ' అని చిప్ప పట్టుకు తిరిగేలా చేసే సమాజం—తన్ను తాను చంపుకుంటూంది: భ్రూణహత్య చేస్తూంది; నేటి కళాకారుడిని ఆదుకోని సమాజానికి 'రేపు' అనేది వుండబోదు.

ఈ పరమ సత్యానికి ఒక ఉదాహరణ.

—"బీతోవెన్ తన రచనలను అంకితం చేసిన ఆ ప్రభువులూ, సంపన్నులూ— బీతోవెన్ ఆ పని చేయకపోతే ఈనాడు మనకు వారి పేర్లు కూడా మిగిలేవి కావు—" అన్నాడు బీతోవెన్ జీవిత చరిత్ర రచించిన ఎమిల్ లుడ్విగ్. ఆ కళాపుష్పాలు నిలబడ్డాయి, దాంతో బాటే ఆ రాజు పేరనే దారం నిలబడింది. "కాలే రాజులో!" అన్నట్లుగా, కాలం తెర వెనుకకు రాజులు జారిపోతారుగాని పోతన్నలు, త్యాగయ్యలు, కబీర్ దాసులు, వీరేశలింగాలు, గురజాడలు, ఉన్నవలు, ఉదయశంకర్లు, పోరు; వారు అడవిమనిషి నుండి రేపటి యుటోపియా మనిషిదాకా వున్న మానవ మహా ప్రస్థానంలో మైలు రాళ్ళ వంటి మణి దీపాలు.

అందుకనే ఒక రాజుతో-"నువ్వు నీతండ్రికి కొడుకువు గనుక అదృష్టవశాత్తు రాజువయ్యావు. కాని నేను నేనుగా బీతోవెన్ అయ్యాను. రాజులకేమిటి వందల కొలది వున్నారు. బీతోవెన్ మాత్రం ఒక్కడే!" అని చెప్పగల్గిన ఘనత ఆయనకే దక్కింది.

సంగీతం ద్వారా స్థలాన్ని, కాలాన్ని నిర్జించగల్గిన వాడు గనుకనే అతడి ప్రయోగాలు అనేకం సమకాలీనులకు అర్థమయ్యేవి కావు నేటినే సరిగా చూడలేని హ్రస్వ దృష్టి విమర్శకులు బీతోవెన్‌కు ఎదురయ్యారు. ఒకానొక సంగీత రచనలో సరికొత్త ప్రయోగాన్ని ఒకరు విమర్శించగా-"అవి మీ కోసం కావు, రాబోయే తరాల వారి కోసం!" అని బీతోవెన్ చెప్పిన సమాధానం అతిశయోక్తి కాదని కాలం చెప్పింది. పియానో, వయొలిన్ల ప్రయోగాలలో కూడా పెద్ద అంగలు వేసిన సంగీతాంగదుడు బీతోవెన్.

ఒక వుత్తరంలో "నాతో ఎవ్వరూ లేకపోయినా నేనొంటరిని కాను.....నాతో బాటు నా మిత్రులు చెట్లు చేమలు, వాగులు చూడడానికి వస్తావా? అక్కడ ఈర్ష్య వుండదు, ఇసుమంతయినా మోసం వుండదు.... ఈ ఆకాశల క్రింద, తెలివి తక్కువ మనిషి వేసుకున్న ఏ కప్పులేని యీ నీలిగగనం క్రింద నా నివాసం. హృదయంలో స్పందించేదేదయినా ఆ ఎత్తు నుండే రావాలి. అలా రానప్పుడు మిగిలేవి గీతలూ, చప్పుళ్లే! ఆత్మలేని శరీరం వట్టి ముద్దే కదూ-" అని ఒక మిత్రుడికి రాసిన ఆ మహా మనిషే యింకొక చోట అంటాడు:

"ఇతటినీ సృజించిన ఆ మహా కళాకారుడి ఎదుట మన రచనలనగా ఎంత?"

ఆమెన్!

*

దొరకని దొంగ

మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ పోలీస్ స్టేషన్‌కి వచ్చేసరికే అతను ఇన్‌స్పెక్టర్ కోసం ఎదురుచూస్తున్నాడు.

"నమస్తే నా పేరు దశరథ్." పరిచయం చేసుకున్నాడు లేచి నిలబడి.

"నమస్తే కూర్చోండి" చెప్పాడు ఇంద్రనీల్ తను కూర్చుంటూ.

దశరథ్ వంక చూశాడు. రాత్రంతా నిద్ర లేనట్లుగా మొహమంతా వుబ్బివుంది. కళ్ళు ఎర్రగా వున్నాయి.

"చెప్పండి"

"రాత్రి మా ఇంట్లో దొంగలు పడ్డారు."

"ఏం పోయింది?"

"నా భార్య నగలు, వెండికంచాలు, కొంత కేష్....అది తక్కువేలెండి. తర్వాత నాభార్య పట్టుచీరలు."

"మీరుండేది ఎక్కడ?"

"సూర్యారావు పేట. ప్రెస్ సందులో,"

"మీ జాబ్?"

"మెడికల్ షాపుంది మాకు."

"రాత్రి ఇంట్లో లేరా మీరు, దొంగతనం జరిగేటప్పుడు?"

"సెకండ్ షో సినిమాకి వెళ్ళాం నేనూ, నా భార్య. ఇంగ్లీష్ సినిమా. ఇంటికి వచ్చేసరికి పన్నెండున్నర దాటింది. లోపల లైటు వెలుగుతోంది. లైటు ఆర్పడం మర్చిపోయావా అని అడిగాను నా భార్యని. ఆర్పానంది. లోపలకి వెళ్ళి చూస్తే బీరువా తలుపు బార్లా తెరచి వుంది. లోపల విలువయినవన్నీ మాయమయాయి....బాధగా ఆగాడు దశరథ్.

"మీ యింటి తాళం పగలకొట్టారా దొంగలు?"

"లేదు. వేసిన తాళం వేసినట్లుగానే వుంది. అదే ఆశ్చర్యం. మారుతాళం చెవితో తలుపు తాళం, బీరువా తాళం తీసి అంతా మూటకట్టుకుని బయటికి వెళుతూ మళ్ళీ ఇంటితాళం వేసేసి వుంటాడు."

"రాత్రే ఎందుకు రాలేదు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్.

నా భార్య భయపడింది. తనని ఒంటరిగా వదిలి వెళ్ళద్దంటే రాలేదు."

ఇంద్రనీల్ ఓ తెల్లకాగితం, పెన్ను అందించి చెప్పాడు దశరథ్‌తో.

"ముందర రిపోర్టు రాసివ్వండి. పోయిన వస్తువుల జాబితా వివరంగా....అంటే పట్టు చీరల రంగు, అంచు వగైరాలు....క్లియర్‌గా రాయండి."

కాగితం అందుకుని రాయబోతూ చెప్పాడు దశరథ్.



"అన్నట్లు నాలుగు రోజులక్రితం ఎవరో మా ఇంటికివచ్చి నేనున్నానా అని అడిగాడు. మా ఆవిడ లేరని చెప్పింది. నేను వచ్చేదాకా వెయిట్ చేస్తానంటే మా ఆవిడ షాపు అడ్రస్ చెప్పి అక్కడికి వెళ్ళమన్నదట."

"ఎవరతను?"

"నాకు తెలియదు. ఇది వాడి పనేనేమో అనిపిస్తోంది ఇప్పుడు."

దశరథ్ రిపోర్టు రాసి సంతకం పెట్టి అందించాడు ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్‌కి. ఇంద్రనీల్ లేచి నిలబడి చెప్పాడు.

"పదండి. మీ ఇంటికి వెళదాం."

ఇంద్రనీల్ మోటార్ సైకిల్ మీద పది నిమిషాల్లో సూర్యారావుపేటలోని దశరథ్ ఇంటికి చేరుకున్నారు ఇద్దరూ.

దశరథ్ భార్య మొహంమీద ఆమె బాగా ఏడ్చిన గుర్తులున్నాయి.

"మీ కెవరిమీదయినా అనుమానంవుందా?" అడిగాడు కూర్చున్నాక.

"నాలుగు రోజులక్రితం వచ్చినవాడి పనేమోనని మా ఆవిడ అభిప్రాయపడుతోంది" చెప్పాడు దశరథ్.

"ఇదివరలో ఎప్పుడయినా వాణ్ణి చూశారా?" అడిగాడు ఇంద్రనీల్.

ఆవిడ తల అడ్డంగా వూపింది సమాధానంగా.

"ఎలా వుంటాడు?"

"ముప్పై అయిదు, నలభై మధ్య వుంటాడు. గిరజాల జుట్టు ఖద్దరు బట్టలు తొడుక్కున్నాడు."

"తెలుగే మాట్లాడాడా?"

"అవును."

ఇంద్రనీల్ వాళ్ళ ఇంటిని, బీరువాని పరిశీలించాడు. బీరువామీద తాళంచెవి రంధ్రం వున్నచోట అక్కడ కూడా గీతలుండటం గమనించాడు. సినిమాకి వెళుతూ వాళ్ళు ఇంటికి వేసిన తాళంకప్పని పరీక్షించాడు. గాడ్రేజ్ నవతాళ్ అది.

"మాకు పెళ్ళయి మూడు నెలలే అయింది" చెప్పాడు దశరథ్, ఇన్‌స్పెక్టర్ పిల్లలు ఎవరూ

తేరా అన్న ప్రశ్నకి సమాధానంగా.

"మీరు వీలున్నప్పుడోసారి స్టేషన్‌కి వస్తే నాదగ్గరున్న కేడిల ఫోటోలు చూపిస్తాను. వాటిలో మీ ఇంటికి వచ్చినవాడున్నాడేమో చూద్దురుగాని."

"నేను గుర్తుపట్టలేకపోతే? ఒకటి రెండు నిముషాలకంటే ఎక్కువసేపు చూడలేదు నేను వాడ్ని" అన్నది దశరథ్ భార్య.

"ప్రయత్నించండి. వాడిని గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేయండి ఈలోగా."

"ఎన్ని రోజుల్లోగా దొరకచ్చు?" అడిగింది పక్కింటావిడ.

సమాధానం చెప్పలేదు ఇంద్రనీల్. నవ్వాడు.

నిన్నరాత్రి మీకు ఎలాంటి అలికిడి వినిపించలేదా?" అడిగాడు.

తల అడ్డంగా వూపిందావిడ. ఆ సందులో మరికొందరిని విచారించాడు ఇంద్రనీల్. కాని లాభం లేకపోయింది.

"మీరెలాగయినా ఆ దొంగని పట్టుకోవాలి సార్. పదివేలరూపాయల సామాను పోయింది మొత్తం" చెప్పాడు దశరథ్.

"ఐ షల్ డు వాట్ బెస్ట్ కెన్ బి డన్."

○ ○ ○

ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ రొటీన్‌గా చేయాల్సిన పరిశోధన చేసాడు. ఆ దొంగగురించి అంతుపట్టలేదు.

దశరథ్ తన భార్యని పోలీస్ స్టేషన్‌కి తీసుకువచ్చాడు. దొంగల ఆల్బం ఆవిడకి చూపించాడు.

ఒకరిద్దరి ఫోటోలు చూపించి వాళ్ళయి వుండచ్చనే అనుమానాన్ని వ్యక్తం చేసింది. ఇంద్రనీల్ చెక్ చేసాడు. వాళ్ళలో ఒకడు జైల్లో వున్నాడు. మరొకడు విజయవాడలోనే లేడు.

దొంగిలించబడ్డ బట్టలు కొనేవాళ్ళందరి మీదా ఓ కన్నువేసి వుంచాడు, కాని, లాభం లేకపోయింది.

దశరథ్ మొదట్లో రోజూ ఓసారి దొంగ దొరికాడా అని తెలుసుకోవడానికి వచ్చేవాడు. తర్వాత వారానికోసారి వచ్చేవాడు. నెల దాటాక యెప్పుడయినా ఓసారి ఫోన్ చేస్తూండేవాడు. అయిదారు నెలలు దాటాక ఇక ఆ సంగతి మర్చిపోయాడు.

కాని ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ మాత్రం మరిచిపోలేదు. అనేకసార్లు అడిగి తెలుసుకున్నాడు ఆ నగలు ఏ డిజైన్‌లో, ఏ రకంగా వుంటాయో. మిగతా పోలీస్ స్టేషన్లకి వాటి వివరాలు సర్క్యులేట్ చేసాడు. మరోచోట ఆ దొంగ పట్టుబడితే, అతనిదగ్గర ఇంకా ఆ నగలు వుండి వాటినికూడా పోలీసులు పట్టుకుంటారనే ఆశతో రొటీన్‌గా వాటి వివరాలు పంపాడు.

దాదాపు ఎనిమిది నెలలు గడిచాయి దశరథ్ ఇంట్లో దొంగతనం జరిగి. మరో దొంగతనం కేసు విచారిస్తూ ఇంద్రనీల్ ఓ కంసాలి దగ్గరికి వెళ్ళాడు ఆ రోజు. ఆ కంసాలి చేసిన నగలున్న పెట్టె పోయింది. వాటి వివరాల గురించి అడుగుతుండగా కంసాలి చేతిలోకి తీసుకున్న మామిడి పిందెల గొలుసుమీద పడింది ఇంద్రనీల్ దృష్టి.

"మామిడి పిందెల గొలుసు!" దశరథ్ భార్య చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయ్.

"మామిడిపిందెల గొలుసు యీ రోజుల్లో ఆర్డ్ ఫేషన్ కాదు. మా అమ్మా, మా నాన్న ఎప్పుడో చేయించి పెళ్ళిలో నాకు పెట్టారు"


ఇంద్రనీల్ దాన్ని అందుకుని పరిశీలనగా చూసాడు. అది తయారు చేసిన కంసాలి ఇన్‌షియల్స్ వున్నాయి ఆ గొలుసు మీద 'జె. బి.'

"ఎన్ని కాసులుంటుంది?" అడిగాడు.

"మూడున్నర"

"ఇదెక్కడిది మీకు?"

"ఓ కస్టమర్ దాన్ని కరిగించి చెయిన్ చేయమని మూడు రోజుల క్రితం యిచ్చారు"



"ఇదేనా లేక యింకేయినా యిచ్చారా?"

"ఎందుకు?" అనుమానంగా చూస్తూ అడిగాడు ఆ కంసాలి.

"చెప్పండి. ఇంకా ఏం యిచ్చారు?"

"రెండు జతల గాజులు, ఓ వుంగరం"

"ఎర్రరాయి వుంగరమా?"

"అవును?"

"ఏవీ"

కంసాలి అందించిన ఆ మిగతా వస్తువులు చూసాక చిన్నగా ఈల వేసాడు ఇంద్రనీల్.

"ఎవరిచ్చారివి?"

"మాచారంలో వుంటారు తాతారావుగారని. ఏదో కాలేజీలో క్లర్క్‌గా పనిచేస్తున్నారాయన"

"వాటిని కరిగించకండి. మీ దగ్గరే జాగ్రత్తగా వుంచండి. ఆయన ఎడ్రస్ చెప్పండి"

"ఆదేం?"

"ఇదంతా దొంగ సరుకు"

"ఛీ. ఆయన అలాంటి వాడుకాదు. నాకు పదిహేనేళ్ళుగా తెలుసాయన"

"ఆయనని దొంగనటం లేదు. ఇవి ఆయనకి ఎలా వచ్చాయో తెలుసుకోవాలి. ఆ దొంగ దగ్గర కొని వుండచ్చు"

ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ అరగంట తర్వాత మాచవరం టౌన్‌లోని తాతారావు ఇల్లు చేరుకున్నారు. ఆయన ఇంట్లో లేడు. ఆయన భార్య, కూతురు వున్నారు.

ఇన్‌స్పెక్టర్‌ని చూడగానే వాళ్ళ మొహాల్లో ఆశ్చర్యం తొంగి చూసింది.



ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ



ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య

గ్రామీణాభివృద్ధి పథకాలకు ప్రోత్సాహం

గ్రామాలకు శుభ్రమైన మంచినీటిని సరఫరా చేయడం ప్రభుత్వ కార్యక్రమాలలో అత్యధిక ప్రాధాన్యత పొందుతోంది.

ప్రస్తుతం 58,000 గ్రామాలు, శివారు గ్రామాలలో బావులు, గొట్టపు బావులు, రక్షిత మంచినీటి పథకాల ద్వారా 1.43 కోట్లమంది ప్రజలు శుభ్రమైన మంచినీరు పొందుతున్నారు.

ఫ్లోరైడుకు గురైన గ్రామాలలో ప్రస్తుతం 22 లక్షల ప్రజలకు ప్రయోజనం కల్పిస్తున్న 1067 రక్షిత మంచినీటి పథకాలకు తోడుగా రూ. 31.55 కోట్ల ఖర్చుతో 171 గ్రామాలలో 7.3 లక్షల ప్రజలకు ప్రయోజనం కల్పించేందుకు ఒక భారీ పథకాన్ని అమలు జరుపుతున్నారు. ఒక్క గ్రామీణ మంచినీటి సరఫరా పథకాలకే మొత్తం రూ. 87 కోట్లు కేటాయించారు.

గ్రామీణ మంచినీటి పథకాలకు రూ. 480 కోట్ల ఖర్చుతో ఒక బృహత్తర ప్రణాళిక రూపొందించారు. ఆరవ ప్రణాళికా కాలంలో నీటి ఎద్దడిగల 8,200 గ్రామాలలో మంచినీరు సమకూర్చేందుకు రూ. 173 కోట్లు ఖర్చు చేస్తారు.

గ్రామాలలో పరిశుభ్రతను పరిరక్షించేందుకు రూ. 175 కోట్లు కేటాయించారు.

"పనికి ఆహారం", పథకం క్రింద గత రెండేళ్ళలోనూ 200 లక్షల మందికి ఉపాధి కల్పించారు. రూ. 85 కోట్ల విలువజేసే 4.82 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు వినియోగించి 30,600 కి.మీ. పొడవు రోడ్లు, 2,500 పాఠశాల భవనాలు, పంచాయతీభవనాలు, బలహీనవర్గాల వారికి 98,000 ఇళ్లు నిర్మించారు.

18,500 గ్రామాలను కలుపుతూ రోడ్లు నిర్మించారు. రూ. 965 కోట్ల ఖర్చుతో 16,700 గ్రామాలను కలిపే ఒక బృహత్తర పథకాన్ని రూపొందించారు.

4,144 సామాజిక బావులు నిర్మించి 31,080 ఎకరాలకు ఆయకట్టు కల్పించడం ద్వారా సన్నకారు రైతులు, గిట్టుబాటు గాని రైతులు ప్రయోజనం పొందారు.

తుఫాను నష్టానికి గురైన ప్రాంతాలలో 2,900 రోడ్లు, 4,500 భవనాలు, 2,300 చిన్ననీటి పారుదల వనరులు పునర్నిర్మించారు.

దుర్భిక్ష ప్రాంతాలలో మంచినీటి సరఫరా కోసం 12,000 గొట్టపు బావులు త్రవ్వారు.

గత మూడు సంవత్సరాలలోనూ బలహీన వర్గాల వారికి రూ. 35 కోట్ల ఖర్చుతో 3,5 లక్షల ఇళ్ళు నిర్మించారు.

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాలు సమగ్రాభివృద్ధి పథంలో ముందడుగు వేస్తున్నాయి.

సమాచార, పౌరసంబంధ శాఖ : హైదరాబాదు.

"తాతారావు గారిల్లేనా యిదీ?" అడిగాడు ఇంద్రనీల్.

"అవును……?"

"ఉన్నారా?"

"బందరెళ్ళారు. దేనికి?"

"ఆయన కంసాలికి కొన్ని నగలిచ్చారట కరిగించి వేరేవి తయారు చేయమని. అవి ఎలా వచ్చాయో చెప్పగలరా మీరయినా?"

వెంటనే తల్లీ, కూతుళ్ళిద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. కూతురే తేరుకొని అడిగింది.

"మీకా వివరం ఎందుకు?"

"దొంగిలించబడ్డ నగలవి. ఎనిమిది నెలల క్రితం సూర్యారావుపేటలోని దశరథ్ అనే అతని ఇంట్లో అవి పోయాయి"

కూతురు చెప్పింది నెమ్మదిగా.

"కూర్చోండి"

ఇంద్రనీల్ కూర్చున్నాడు. అది పక్తు మధ్య తరగతి ఇల్లులా వుంది.

"నాకు తెలుసు. నేను చెప్తాను" అన్నదా అమ్మాయి.

"చెప్పండయితే"

"అవి మా అక్కయ్యవి."

"ఆవిడకి ఎక్కడివి?"

"మా నాన్నగారు పెళ్ళిలో పెట్టారు… పెట్టాల్సివచ్చింది."

ఇంద్రనీల్‌కి ముప్పాతిక భాగం అర్థమయిపోయింది సంగతి.

"దశరథ్ మీ అక్క మొగుడా?" అడిగాడు వెంటనే.

తలవూపి చెప్పింది.

"పదివేలు కట్నం ఇచ్చుకోలేం. కట్నం ఇవ్వకుండా మావాళ్ళు ఎంతకాలం ఇంట్లో వుంచుతారు? మా అమ్మ నగలు ఇచ్చాం. ఆ రాత్రి వాళ్ళు సినిమాకి వెళ్ళాక మా అక్క ఇచ్చిన డూప్లికేట్ తాళం చెవులు వుపయోగించి వాటిని నేనే దొంగిలించాను. మా బావగారికి తప్ప మాకు ఈ ఏర్పాటు గురించి పెళ్ళికి ముందే తెలుసు. నా పెళ్ళి సెటిల్ అయింది. కట్నం ఇవ్వాలి. పన్నెండు వేలు అడిగితే వప్పుకున్నారు నాన్నగారు…"

ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ లేచి నిలబడ్డాడు. వెంటనే.

"నన్ను అరెస్ట్ చేస్తారా?" అడిగింది భయంగా.

నవ్వి తల అడ్డంగా వూపాడు.

"నగలు కరిగించి వేరే చేయిస్తే పెళ్ళిలో ఎవరూ గుర్తుపట్టరనా?" అడిగాడు ఆ అమ్మాయిని.

అవునన్నట్లుగా తల వూపింది.

"ఈ రోజుల్లో కట్నం ఇవ్వలేని మా నాన్నగారిలాంటి పేదవాళ్ళ దగ్గర నుండి కూడా కట్నాన్ని గుంజాలనుకుంటున్నారు కుర్రాళ్లు. ఏం చెయ్యం చెప్పండి?" అడిగిందా అమ్మాయి.

"మా పెద్దల్లుడికి సంగతి చెప్తారా?"

తాతారావు భార్య అడిగింది. ఆవిడ కంఠంలో యింకా భయం తగ్గలేదు.

"కాపురాలు కూల్చడం నా వృత్తికాదు. నేనిక్కడికి రాలేదు మిమ్మల్నేం అనగలేను. అసలు ఆ నగలు ఏమయ్యాయో కూడా నాకు తెలియదు" చెప్పాడు.

"వెరీ మెనీ థాంక్స్"

"కట్నం తీసుకోవడం కూడా దొంగతనం అంత నేరం."

"కొద్దిగా కాఫీ తీసుకోండి." తల్లీ, కూతుళ్ళిద్దరూ ఒకేసారి అన్నారు.


ం ం ం


కొన్ని వారాల తర్వాత పుష్యం పోస్ట్ చూసుకుంటూండగా ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ కోసం పోలీస్ స్టేషన్‌కి ఓ అమ్మాయి వచ్చింది. చేతిలోని శుభలేఖ అందించింది సిగ్గుగా.

"నా పెళ్ళి. ఎల్లుండి. తప్పక రావాలి మీరు."

ఇంద్రనీల్ శుభలేఖ చదివి, నవ్వి చెప్పాడు.

"థాంక్స్. తప్పక వస్తాను. నేను ఇదివరలో వద్దన్న కాఫీ అక్కడ తాగుతాను… బై దిబై… హార్టీ కంగ్రాచ్యులేషన్స్." ✱





అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో

అన్నీ లోపాలేనా?

జనవరి మూడో తేదీన ప్రారంభమై జనవరి పదిహేడువరకు, ఎనిమిదవ అంతతీర్జాయ భారత చలన చిత్రోత్సవం యీ ఏడాది ఢిల్లీలో జరిగింది. విజ్ఞాన్ భవన్‌లో కొంతమంది ఆహూతులకి సీట్లు దొరకని అలజడి పెద్ద విషయంగా మారి, మిగిలిన అన్ని విషయాల్ని మించిన ప్రచారం, ప్రాచుర్యం పొందటంతో ప్రారంభమై కొన్ని వర్గాల వారికి యీ చలన చిత్రోత్సవం పూర్తిగా నిరుత్సాహం కలిగించింది.

గతంలో కూడా అనేక సార్లు భారతీయ చిత్రోత్సవాలని గురించి కొన్ని ప్రశ్నలు, సందేహాలు తలెత్తాయి. మనకి చలన చిత్రోత్సవాలు అవసరమా? భారత దేశం లాంటి బడుగు దేశం దీనికిగాను యిన్ని లక్షల రూపాయలు ఖర్చు చెయ్యటం సమంజసమేనా? అసలు చిత్రోత్సవాలు కేవలం ఒక వర్గం ప్రజల సరదాకోసమేనా? యీ ప్రశ్నలన్నీ యీసారీ వుత్పన్నమయ్యాయి.

ఏరకంగా చూసినా మన చలనచిత్ర పరిశ్రమ తక్కువదేం కాదు. క్రిందటి సంవత్సరం ప్రపంచం మొత్తంమీద ఎక్కువ చిత్రాలు నిర్మించిన దేశంగా

జ్యోతి

పేరుకూడా పొందింది. ఏ పరిశ్రమ భవితవ్యమైనా అది సముపార్జించుకునే విజ్ఞానాన్నిబట్టి వుంటుంది. అన్నిరకాలుగా చొరవ తక్కువవున్నమన చిత్రపరిశ్రమకి యేడాదికి ఒక్కసారైనా చిత్రోత్సవాల ఆధారంగా యీమాత్రం భావసముపార్జనకి అవకాశం లేకపోతే యింక మన చిత్రస్థాయి, ప్రగతి ఎలా వుంటుంది? అదీకాక కొన్ని కోట్ల రూపాయలతో నడుస్తున్న యీ పరిశ్రమ, తన ప్రగతికి, అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి యేడాదికి యాభై లక్షలు వెచ్చించటం అసమంజసమేమీ కాదు. ఈ సందర్భంలో ఖర్చుతోపాటు ఫిలిం మార్కెట్‌లో జరిగిన వ్యాపారాన్నికూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఈసారి చిత్రోత్సవం జరుగుతూండగానే దాదాపు డెబ్బై లక్షల రూపాయల విలువగల భారతీయ చిత్రాల్ని వివిధ దేశాలు కొనుగోలు చేశాయి. ఆర్థికపరమైన యీరకం వంకల్ని పక్కకి పెడితే చిత్రోత్సవాల నిర్వహణకి మరో ముఖ్యమైన అభియోగం,-యీ చిత్రోత్సవాలలోని చిత్రాల స్థాయి ప్రజలకి సంతృప్తికరంగా లేదనేది!

చిత్రోత్సవాలలో ప్రజల సంతృప్తి ఎక్కువగా దేని మీద ఆధారపడివుందో అందరికీ తెలిసిందే! శృంగారాన్ని, జీవితాన్ని కళాత్మకంగా, యధాతధంగా ప్రతిబింబించటానికి అవసరమైన శృంగారాన్ని ఘన సినిమాల్లో అదృశ్యం చేసి, వెగటు పుట్టించే శరీర విన్యాసాలకి, కౌగిలింతలకి అన్ని రకాలుగా అవకాశాలు కల్పించిన తీరు, అది ప్రజల ఆలోచన మీద ఎంత ప్రభావాన్ని కలిగిస్తోందో ఎప్పటికప్పుడు పట్టించుకోని అలసత్వం, ఇలాగే వుంటే చిత్రోత్సవాలలోని చిత్రాల స్థాయి ఎంత వున్నతంగా వున్నా ప్రజలకి సంతృప్తి కలిగించవు. సెక్స్, వేడి, హాట్ ఏమైనా వుందా అని పరస్పరం చిత్రోత్సవ ప్రేక్షకులు అడగటం మాని సినిమా ఎలా వుంది, ఏం బావుంది అనే అడిగే స్థితికి చేరటం, వారిని అటువేపు నడిపించం ఎంతేనా అవసరం. సినిమాలలో కేవలం సెక్స్ పట్ల ప్రజల కింత వ్యామోహం ప్రబలటానికి కారణమేమిటో దానికి ప్రతిగా మనం అనుసరించవలసిన విధానమేమిటో యిప్పటికైనా నిర్ణయించుకోకపోతే సినిమా స్థాయి గురించి, చిత్రోత్సవాల విజయం గురించి చర్చించటం అంత వుపయోగకరంగా వుండదు. అన్ని రకాలుగా నడక నేర్చుకుంటున్న స్థితిలో వున్న మన సినిమా అభిరుచి ప్రపంచపు పరుగు వేగం అందుకోలేదని, దానికి చిత్రోత్సవాలలో సినిమా స్థాయి సరైంది కాదని స్థూలంగా నిర్ణయించటం అంత సబబైన విషయం కాదు.

ఈ సారి చిత్రోత్సవంలో చాలా మందికి చాలా అసౌకర్యాలు కలిగిన మాట నిజమే! కలిగిన అసౌకర్యానికి కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి స్వయంగా క్షమాపణ చెప్పుకున్నా ఆ అలజడి తగ్గకపోవటం, మన వాళ్ళకి ప్రతి చిత్రోత్సవంలో తప్పులే తప్ప ఏ మాత్రం ఒప్పు కనిపించకపోవటం

శోచనీయం. యిలాంటి చిత్రోత్సవాల్ని ఎక్కువగా ప్రజాపరంగా చూడాలి. అలాంటిదిపోయి ఎక్కువ భాగం ఆహూతుల వేపు నుంచి, ప్రముఖుల వేపు నుంచి చూట్టం అంత సరైంది కాదు.

యీసారి చిత్రోత్సవంలోని సినిమాల సంక్షిప్త వివరాలు ప్రచురించిన పుస్తకాలు ప్రజలకి అందుబాటులో లేకుండా పోయాయి. డైలీ బులెటిన్స్ కూడా అంతే! ఏ సినిమా ఏమిటో తెలియకుండా గుడ్డిగా (బ్లైండ్ బేసిస్) చిత్రాలకి వచ్చిన ప్రేక్షకుల కుతూహలం ఏ స్థాయిలో వుంటుందో వూహించకపోలేం. ప్రెస్ వారికీ,డెలిగేట్స్‌కి అందే సమాచారం మిగిలిన వారికి కూడా అందినప్పుడే చిత్రాలకి సరైన ఆదరణ లభించేది. ఇన్ఫర్మేషన్ సెక్షన్‌లో ఫెలినీ, బెర్గ్‌మెన్, కుర్సోవా, కొప్పోలా లాంటి ప్రముఖ దర్శకుల చిత్రాలతో పాటు మరికొన్నిటిని మినహాయిస్తే చాలా చిత్రాలు పేలవంగా వున్నమాట వాస్తవమే. కానీ పోటీ విభాగంలోని వివిధ దేశాల 22 చిత్రాలు, భారతదేశపు రెండు చిత్రాలలో చాలా వరకు సంతృప్తికరంగా వున్నాయి.

గోవింద్‌నిహలానీ హిందీ చిత్రం ఆక్రోష్, బల్గేరియాచిత్రం 'దిఅన్‌నోన్ సోల్జర్స్ పేటెంట్ లెదర్‌షూస్'కి కలిపి మొదటి బహుమతి స్వర్ణమయూరి, మణికౌల్ షార్ట్‌ఫిలిం 'ఎరైవల్‌కి'కి రజిత మయూరి-లభించాయి.

ఇప్పటికేనా చిత్రోత్సవాలు అవసరమా, అనవసరమా అన్న చర్చల నుంచి బైటపడి మరింత ప్రయోజనకరంగా వీటిని ఎలా తీర్చిదిద్దాలా అన్న విషయం అందరూ ఆలోచించటం అవసరం.

-వి రాజారామమోహనరావు

రెండు చిత్రాలు

ఏ దేశపు జన జీవితాన్నైనా వివిధ కోణాల్లో పట్టివ్వటానికి సినిమాని మించిన సాధనం మరొకటి లేదు. అన్ని కళలు కలిసి జీవితాన్ని మరింత సుగమంగా, సుందరంగా తీర్చిదిద్దటానికి దోహదం చెయ్యగలవన్నది నమ్మితే దానికి బలమైన సాధనం సినిమా.వివిధ దేశాల సాంఘిక పరిస్థితుల్ని, మానసిక భావనల్ని పరస్పరం మరింత చేరువ చెయ్యటానికి ఏ చిత్రోత్సవమైనా ప్రధానంగా తోడ్పడుతుంది. సినిమా ప్రయోజనాన్ని దృష్టిలో వుంచుకుని యీ చిత్రోత్సవంలోని కొన్ని సినిమాల పరిచయాన్ని మీ కందించే ప్రయత్నంలో రెండు చిత్రాలు....

సన్‌డే ఛిల్డ్రన్

(ఎఫ్. ఆర్. జి.)

మన దేశానికి రెండు ప్రపంచ యుద్ధాల తాకిడి అంతగా లేదు. ముఖ్యంగా తెలుగువారికి యుద్ధకాలపు వికృత రూపం అసలు అనుభవంలో లేదు.



సన్‌డే చిల్డ్రెన్‌లో ఒక దృశ్యం.

రెండవ ప్రపంచ యుద్ధం వస్తువుగా చాలా దేశాలు చాలా చిత్రాలు నిర్మించాయి. ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ కూడా చాలా చిత్రాలు తీసింది.

విమానాలు కూలిపోవటం, ఫిరంగులు పేలటం, శవాలు కుప్పలు కుప్పలుగా కనిపించటం లాంటి దృశ్యాలు సాధారణంగా వార్ ఫిలిమ్స్‌లో వుంటాయి. సన్‌డే చిల్డ్రెన్ సినిమా కథ యుద్ధ కాలం నాటిదే అయినా, యీ సినిమాలో పై కోవకి చెందిన దృశ్యాలేం లేవు.

యుద్ధ కాలంలోనూ, యుద్ధానికి ముందూ మనుష్ని కమ్ముకునే భయం ఎంత తీవ్రంగా వుంటుందో, అది వ్యక్తుల్ని, వ్యక్తిత్వాన్ని ఎంత చిత్రంగా ప్రకంపింపచేస్తుందో అద్భుతంగా చిత్రించిన చిత్రం సన్‌డే చిల్డ్రెన్.

యవ్వనపు తొలకరి వయసులో చిన్న పల్లెటూళ్ళో వున్న పిల్ల ఎల్సీ. యుద్ధం రాబోతోందన్న వార్త ఆ పిల్లని చేరింది. ఆ పల్లెలో సరదాగా, సంతోషంగా గడిపే ఎల్సీతోపాటు, ఆమె యింటి వారినీ, ఆమె స్నేహితుల్ని అందర్నీ యుద్ధభయం కమ్ముకుంది. అంతర్గతంగా భయం వున్నా, ఆ పల్లెకి యుద్ధ తీవ్రత అంతగా లేకపోవడం వల్ల ఎల్సీలో చిలిపితనం, యవ్వనపు కోర్కెలు, కనిపించే మగవాళ్ళ మీద అల్లరి వూహలు పూర్తిగా పోలేదు.

ఎల్సీ తండ్రి యుద్ధ రంగానికి వెళ్ళి మరణించటం, చెల్లెలు రోగిష్టివాడైన మిలటరీ అతన్ని పెళ్ళి చేసుకోవటం, స్నేహితురాలి మరణం యిత్యాది సంఘటనలు ఎల్సీలోని వుత్సాహాన్ని సంహరించాయి. సరదాకోసం యుద్ధరంగంలో వున్న ఓ పరిచయస్తుడికి రాసిన ప్రేమ లేఖలు వీటన్నింటినీ మించిన దెబ్బ తీసింది ఎల్సీమీద. యుద్ధంలో దెబ్బతిని పరమ వికృతంగా మారిన అతను కేవలం ఎల్సీ వుత్తరాల్ని విశ్వసించి ఎల్సీ ఎవరో తెలియకపోయినా ఆ

ప్రేమతో తిరిగి బతుకు సాగించవచ్చని ఆశగా వచ్చిన అతనికి ఎల్సీ చిలిపిపని తీవ్రాఘాతం అవుతుంది. ఆ బాధలో ఎల్సీమీద అత్యాచారానికి పూనుకుని కూడా మానవత్వంతో వెనక్కు తగ్గుతాడు.

ఇన్ని రకాలా విభిన్నమైన సంఘటనల్లోనూ మానవ మనస్తత్వం భయానికి లొంగినప్పుడు కలిగే విచిత్ర పరిణామం, ఆ భయంనుంచి తప్పించుకోటానికి చేసే ప్రయత్నాలలోని వింత ఆలోచనలూ, పరస్పర విరుద్ధమైన చేతల్నీ సున్నితంగా, సునిశితంగా చిత్రించటం యీ చిత్రంలో గొప్పతనం.

యుద్ధంలో జర్మనీకి లభించిన విజయాల్నీ, వాటి గొప్పతనాన్ని చిత్రించిన చిత్రాలు చాలా వచ్చాయి. చాలా దేశాలు నిర్మించాయి. ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ కూడా అలాంటి చిత్రాల్ని నిర్మించింది. కానీ యుద్ధకాలపు పరిస్థితుల్ని మానవత్వపు విలువల దృక్కోణంలో అంతరంగ పరిశోధన చేసుకున్నట్లు యీ రకంగా మరోవేపునుంచి చిత్రించటం గొప్ప విషయం. యుద్ధం ఎవరికిలాభించినా, బాధ, భయం అందరికీ ఒక్కటే అన్న విషయాన్ని ప్రధాన విషయంగా చిత్రించటం మానవత్వపు విలువల్ని మరో మెట్టు ఎక్కించటమే. ఎల్సీగా నోరా బామెర్ చక్కగా నటించింది.

మిస్టర్ స్లాటర్స్ సిల్వర్‌జూబ్లీ

హియన్ స్లాటర్ పెద్ద షాప్ ఫాక్టరీకి మేనేజింగ్ డైరెక్టర్. స్లాటర్ బాల్యం నుంచి ఆ ఫాక్టరీ యజమాని స్లీప్స్‌కి యిష్టుడు. స్లాటర్ పట్ల అభిమానంతో పాటు అతని పట్ల వున్న



నమ్మకం, అతని మీద వున్న విశ్వాసం వల్ల స్లీప్స్ కన్న కొడుకుని కూడా తోసిపుచ్చి ఫాక్టరీకి స్లాటర్‌ని మేనేజింగ్ డైరెక్టర్‌ని చేశాడు. స్లాటర్ ఆధ్వర్యంలో ఫాక్టరీ ఎంతగానో అభివృద్ధి చెందింది స్లాటర్ స్లీప్స్‌కి అల్లుడు. అందువల్ల ఫాక్టరీ పరంగానే కాకుండా ఆ కుటుంబంతో, బంధుత్వపరంగా కూడా సంబంధాలున్నాయి స్లాటర్‌కి. తన గురించి తను చెప్పుకునే మనస్తత్వం కాదు స్లాటర్‌ది. ఫాక్టరీయే అతని జీవితంగా గడిచింది. అతని ఆశ ఒక్కటే-ఎప్పటికేనా పది మంది ముందుస్లీప్స్‌ప్రశంసపొందాలి. స్లీప్స్‌ని వృద్ధాప్యం కమ్ముకుంది. ఎప్పుడు ఏ క్షణాన ఆయన ఎలా ప్రవర్తిస్తాడో ఎవరికీ తెలియదు. ఫాక్టరీ అధికార వర్గంలో చాలా మందికి స్లాటర్ అయిష్టుడు. ఆ వర్గంలో ప్రముఖుడు స్లీప్స్ కొడుకు. ఫాక్టరీ అధికారం అతనికి దక్కలేదన్న దుగ్ధ అంతరాంతరాల్లో వుంది.

ఫాక్టరీ మేనేజింగ్‌డైరెక్టర్‌గా స్లాటర్ 25 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా రజితోత్సవం జరపాలని ఫాక్టరీ అధికార వర్గం నిర్ణయించుకుంది. అందుకు అన్ని ప్రయత్నాల్తోపాటు ఒకసావనీర్ వెలువరించే ప్రయత్నం కూడా జరిగింది. ఆ సందర్భంలోనే స్లాటర్ చిన్నతనంలో జరిగిన ఒక సంఘటన వెలుగులోకి వచ్చింది. చదువుకునే రోజుల్లో ఒక మిత్రుడు స్లాటర్‌ని స్కూల్లో బాగా తన్నిన సంఘటన.... అలా తన్నిన వ్యక్తి యిదే ఫాక్టరీలో చిన్న వుద్యోగి. ఈ విషయాన్ని చిలవలు పలవలుగా పెంచి స్లాటర్‌ని అవమానంపాలు చెయ్యాలన్న వుద్దేశం స్లీప్స్ కొడుక్కి.

స్లాటర్ దురదృష్టవశాత్తు సిల్వర్ జూబ్లీ అంతా అభాసుపాలైంది. స్లీప్స్ నుంచి ప్రశంసకోసం ఎదురు చూస్తున్న స్లాటర్‌కి ఆశాభంగమేకాదు, అవమానం ఎదురైంది. జీవితమంతా తన కృషి నిష్ప్రయోజనం అయినంత ఆందోళన స్లాటర్‌ని కమ్ముకుంది. తట్టుకోలేక రజితోత్సవం జరుగుతుండగానే అక్కడ్నుంచి తప్పుకుని నగరం చివరికి వెళ్ళి ఆ రాత్రి గడుపుతాడు. ఆ రాత్రి విభిన్నమైన వాతావరణంలో తిరిగి తనని తాను పునర్‌నిర్మించుకుని తిరిగి అందరికీ ఆశ్చర్యం కలిగేలా ఫాక్టరీకి మామూలుగా వస్తాడు.

ఓ సంఘటనలో ఎంతో జీవితాన్ని యిమిడ్చిన దర్శకుడు బెర్ట్ హానాస్ట్రా ప్రతిభ అద్భుతం. వృత్తి, దాని పట్ల ఇష్టం, అయిష్టం, దానిలో రాజకీయాలు ఆశ నిరాశలు వీటన్నిటినీ మించిన బాధ్యత ....ఇవన్నీ కలిగలిపిన చక్కటి చిత్రం. ఇంతకు ముందే మరో చలనచిత్రోత్సవంలో ప్రదర్శించబడటంవల్ల పోటీ నుంచి యీ చిత్రాన్ని తొలగించారు. పాత్రకి, తనకీ భేదం లేదన్నట్టు అద్భుతంగా నటించిన కీస్ బ్రూస్‌ని మెచ్చుకోకుండా వుండలేం. •

-వి. ఆర్.

Edited & Published by V. Leelavathy Raghavaiah, at 1-8-4/1/1, Chikkadpalli, Hyderabad-20 & Printed by P. Ramakrishna at Raghava Printers, 1-8-4/1/1 Chikkadpalli, Hyderabad-500 020.

KOTI MARCH'81 Rs.3·50 Regd.

